www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 49

బుధవారం | 4-6-2025

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: నవమి రా.11:55 తదుపరి దశమి, నక్షత్రం: ఉత్తర తె 3:36 తదుపరి హస్త, వర్జ్యం: ఉ.8:58-10:44, దుర్ముహూర్తం: ఉ.11:47-12:39, అమృతఘడియలు: రా.7:36-9:23, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:43, సూర్యాస్తమయం: 6:43

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆర్‌సీబీ జట్టు సభ్యుల విజయోత్సాహం

బెంగళూరు.. బెంగ తీరింది

ఐపీఎల్ నయా చాంప్ ఆర్‌సీబీ.. నెరవేరిన విరాట్ కోహ్లీ కల

తుది పోరులో పంజాబ్ బోల్తా
దెబ్బకొట్టిన క్రునాల్ పాండ్యా
కీలక మ్యాచ్‌లో అయ్యర్ ఫ్లాప్
పోరాడిన శశాంక్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. మూడు సార్లు ఊరించి.. ఉసూరుమనిపించిన ఐపీఎల్ ట్రోఫీ.. ఎట్టకేలకు ఆ జట్టు సొంతమైంది. మెగా లీగ్ ఆరంభం నుంచి ఒకే ఫ్రాంచైజీకి ఆడుతున్న కోహ్లీ కెరీర్‌లో ఐపీఎల్ ట్రోఫీ లేదనే లోటు తీరింది. మెగా వేలం తర్వాత సమతుల్యమైన జట్టుతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ.. ఈ సీజన్‌లో చెలరేగిపోయింది. అద్భుత ప్రదర్శనతో నాలుగోసారి ఫైనల్‌కు చేరి.. తుది పోరులో పంజాబ్ కింగ్స్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకుంది. మరోవైపు.. దశాబ్దం తర్వాత ఫైనల్ చేరిన పంజాబ్ గుండె పగిలింది. ఆఖరి పోరులో దూకుడు లేకపోయినా.. సమష్టిగా చెలరేగిన బెంగళూరు 190 పరుగుల స్కోరు చేసింది. కోహ్లీ (43) క్రీజులో నిలబడగా.. మిగతా బ్యాటర్లు దూకుడుగా ఆడడంతో.. బెంగళూరు పోరాడగలిగే స్కోరు చేసింది. కానీ, బ్యాటింగ్ బలం కలిగిన పంజాబ్ ముందు నిలుస్తుందా? అనే అనుమానం కలిగింది. అయితే, వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఆర్‌సీబీ బౌలర్లు పంజాబ్‌ను సమర్థంగా కట్టడి చేశారు. పవర్‌ప్లేలో హాజిల్‌వుడ్ దెబ్బతీయగా.. మధ్య ఓవర్లలో క్రునాల్ పాండ్యా కీలక వికెట్లు పడగొట్టాడు. ఒంటిచేత్తో పంజాబ్‌ను ఫైనల్ చేర్చిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (1)ను షెఫర్డ్ వెనక్కి పంపడంతో.. బెంగళూరు పట్టుబిగించింది. తర్వాత క్రమం తప్పకుండా వికెట్లను పడగొడుతూ ఒత్తిడి పెంచింది. చివర్లో శశాంక్ సింగ్ చెలరేగినా.. అప్పటికే ఆలస్యమై పోయింది. ఆర్‌సీబీకి విజయం సొంతమైంది. 11

ఎవరిది వెన్నుపోటు?

మోసం, ద్రోహం, పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాన్ని పడదోసి, అధికార పీఠాన్ని చేజిక్కించుకుంటే అది కచ్చితంగా వెన్నుపోటే అవుతుంది. కానీ.. ప్రజాభిప్రాయాన్ని వెన్నుపోటుగా పేర్కొనడం వైసీపీకే చెల్లింది.



● సరిగ్గా ఏడాది కిందట...
2024 జూన్ 4వ తేదీ! ఆ రోజు...
ఐదేళ్ల జగన్ పాలన అంతమైన రోజు!
ఐదేళ్ల నిర్బంధానికి తెరపడిన రోజు!
స్వేచ్ఛకు పడిన 'సర్కారీ సంకెళ్లు' తెగిన రోజు!
నోరుతెరిచి మాట్లాడలేని భయం మాయమైన రోజు!
ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు వెలువడిన రోజు!

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

● కానీ...
ఈ రోజును వైసీపీ 'వెన్నుపోటు దినం' అని పిలుస్తోంది!
జనం ఇచ్చిన తీర్పును 'వెన్నుపోటు'గా అభివర్ణిస్తోంది!
ప్రజలను వెన్నుపోటుదారులుగా చిత్రీకరిస్తోంది!
అసలు... వెన్నుపోటు ఎవరిది?
2019 ఎన్నికల ముందు అమరావతికి జైకొట్టి అధికారంలోకి రాగానే మూడుముక్కలాట మొదలు పెట్టిన వాళ్లది కదా!
ఐదు నక్షత్రాల హోటళ్లలో మినహా ఎక్కడా మద్యం కనిపించకుండా చేస్తామని చెప్పి... అదే మద్యంతో ముడుపుల మూటలు కట్టుకున్న వాళ్లది కదా!
కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో ఐదేళ్లపాటు రాష్ట్రం మొత్తాన్ని భయం అంచున నిలబెట్టిన నాటి పాలకులది కదా!
వెన్నుపోటు ఎవరిది?
వెన్నుపోటు దినం జరపాల్సింది ఎప్పుడు?

ప్రజాతీర్పును అపహాస్యం చేస్తున్న మాజీ సీఎం జగన్



ప్రజలను వెన్నుపోటుదారులుగా చిత్రీకరణ
సరిగ్గా ఏడాది కిందట వైసీపీ పాలనకు తెర
కూటమి సర్కారుకు పట్టం కట్టిన జనం
నేడు 'వెన్నుపోటు దినం' అంటున్న వైసీపీ
ఒక్క చాన్స్ అంటూ వచ్చి ఐదేళ్లు విధ్వంసం
నిర్బంధం, కక్ష సాధింపులే అజెండాగా పాలన
మద్యం నుంచి ఇసుక దాకా ముడుపులే
పశ్చాత్తాపానికి బదులు ప్రజలపైనే జగన్ పగ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
"ప్రజాతీర్పును శిరసావహిస్తాం! మాలో లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుంటాం! నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం!"... ఎన్నికల్లో ఓటమి పాలైన ఏ పార్టీ అధినేత అయినా చెప్పే మాటలివి! కానీ... వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరే వేరు! గత ఏడాది ఎన్నికల ఫలితాలు వెలువడిన 'జూన్ 4'ను ఆయన 'వెన్నుపోటు దినం'గా జరుపుకొంటున్నారు. తీర్పు చెప్పిన ప్రజలను వెన్నుపోటుదారులుగా చిత్రీకరిస్తున్నారు. ఇది ప్రజాతీర్పును అపహాస్యం చేయడమేనని

మిగతా 12వ పేజీలో...

తుని రైలు దహనం కేసు తిరగదోడం

రాష్ట్రప్రభుత్వం స్పష్టీకరణ 14
అప్పీలుకు అనుమతిస్తూ ఇచ్చిన జీవో రద్దు



'గో బ్యాక్ జగన్' అంటూ నల్ల బెలూన్‌లు, ప్లకార్డులతో జగన్ కాన్వాయ్ పైకి దూసుకొస్తున్న దళిత సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వారంతా అమాయకులు

చిన్ననాటి స్నేహితులు.. కానిస్టేబులే వారిపై దౌర్జన్యం చేశారు
పాత కేసులున్నాయేమో.. తెలియదు 13
అందుకని అంత దారుణంగా కొడతారా?
రౌడీషీటర్లకు మద్దతుగా తెనాలిలో జగన్ వ్యాఖ్యలు
మొక్కుబడిగా సాగిన పరామర్శ తంతు
రౌడీషీటర్లను కలుస్తారని తొలుత ప్రచారం
కానీ, కుటుంబాలను మాత్రమే పలకరించి వెనక్కి

అన్నీ అబద్ధాలే!

ఆ రౌడీషీట్ల కథ జగన్‌కు ఎరుకే

ఆయన హయాంలోనే రాకేశ్, విక్టర్‌పై నమోదు
ఒక్కొక్కరిపై తొమ్మిది, పది క్రిమినల్ కేసులు
అందులో చాలావరకు వైసీపీ హయాంలోవే..
దళితులు, మైనారిటీలూ వీరి బాధితులే
ఐతానగర్ కేంద్రంగా కొన్నేళ్లుగా రౌడీరాజ్..
అలాంటివారికి 'అమాయకుల'ని సర్టిఫికెట్
జరిగిన ఘటనను వక్రీకరించి నయా కహానీ..
అలాంటివారి పరామర్శకు పనిగట్టుకుని తెనాలికి..

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)
"పోలీసులు లాఠీ కౌన్సెలింగ్ ఇచ్చాకే వీరందరిపై రౌడీషీట్లు తెరిచారు"... అని తెనాలి పర్యటనలో వైసీపీ అధినేత జగన్ సెలవిచ్చారు. అయితే, ఈ మాటలు పచ్చి అబద్ధాలు. ఈ విషయం ఆయనకు బాగా తెలుసు. జగన్ మంగళవారం తెనాలిలో మద్దతుగా మాట్లాడిన రౌడీషీటర్లలో దోమా రాకేశ్, జాన్ విక్టర్‌లపై రెండేళ్ల క్రితం, ఆయన హయాంలోనే రౌడీషీట్లు తెరిచారు. మరో ముద్దాయి

మిగతా 13వ పేజీలో...

మన రేవులు.. మన సంపద

వచ్చే ఏడాదికల్లా నాలుగు సిద్ధం చేయండి: సీఎం

తొలి దశలో కుప్పం, దగదర్తి, అమరావతి, శ్రీకాకుళం విమానాశ్రయాల నిర్మాణం
ఏజెన్సీ ప్రాంతాల్లో హెలీ పోర్టులు
రద్దీకి అనుగుణంగా రహదార్ల విస్తరణ
జాతీయ హైవేలతో రాష్ట్ర రోడ్లన్నీ అనుసంధానం: చంద్రబాబు
'యోగాంధ్ర'కు అఖండ స్పందన
ముఖ్యమంత్రి చంద్రబాబు సంతృప్తి



అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట పోర్టుల మొదటి దశ పనులతో పాటు కాకినాడ గేట్‌వే పోర్టు పనులు వచ్చే ఏడాదికల్లా పూర్తి చేయాలని నిర్మాణ సంస్థలను, అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జువ్వలదిన్నె,

మిగతా 13వ పేజీలో...



చాట్‌జీపీటీ వినియోగంలో భారత్ టాప్!

అమెరికాను దాటి అగ్రస్థానంలోకి..
అంతర్జాతీయ వినియోగదారుల్లో 13.5 శాతం మంది భారత్‌లోనే

వాషింగ్టన్, జూన్ 3: కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని ఏలుతోంది. ప్రస్తుతం ప్రపంచమంతటా ఏఐ శకం నడుస్తోంది. ఏఐ వాడకంలో భారతీయులు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తున్నారు. ముఖ్యంగా చాట్‌జీపీటీ వినియోగంలో భారత్ అమెరికాను దాటేసింది. మొత్తం ప్రపంచ వినియోగదారుల్లో భారతీయులు 13.5 శాతం

మిగతా 2వ పేజీలో...

బియ్యం వద్దనుకుంటే కార్డు వెనక్కి ఇవ్వండి



ఆరోగ్య శ్రీ కార్డు విడిగా ఇస్తే 13
బియ్యం అక్రమ రవాణాను అరికట్టొచ్చు
ప్రభుత్వానికి అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ప్రతిపాదన
డిప్యూటీ స్పీకర్ రఘురామ వెల్లడి

రాష్ట్రంలో మరో 4 కొవిడ్ కేసులు

14

నరేందర్.. సరెండర్!


ట్రంప్ ఆదేశించారు.. మోదీ ఆపేశారు!

పాక్‌తో కాల్పుల విరమణపై రాహుల్ విమర్శలు
కొద్దిగా ఒత్తిడి తెస్తే చాలు..
బీజేపీ, ఆరెస్సెస్ నాయకులు లొంగిపోతారు
స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచీ అంతే..
1971లో అమెరికా బెదిరింపులకు
ఇందిర లొంగలేదు.. పాక్‌ను ముక్కలు చేశారు
కాంగ్రెస్ నేతలు ఎవరికీ తలొగ్గరు..
పోరాటయోధులు: రాహుల్ గాంధీ 2
జీ-7కు ప్రధానికి ఆహ్వానం అందకపోవడం
ఆరేళ్లలో ఇదే తొలిసారి.. దౌత్యపరంగా
మనకు భంగపాటు: జైరాం రమేశ్



ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్‌ను సమావేశపరచాలి
ప్రధానికి ఇండియా కూటమి పార్టీల లేఖ
సంతకం చేయని ఎన్సీపీ
విడిగా లేఖ రాస్తామన్న ఆప్

నరేందర్.. సరెండర్..!



ట్రంప్ ఆదేశించారు.. ప్రధాని మోదీ ఆపేశారు!

పాక్‌తో కాల్పుల విరమణపై రాహుల్ విమర్శలు


భోపాల్, జూన్ 3: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు మోదీ లొంగిపోయారన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్.. ప్రధానిపై విమర్శలు గుప్పించారు. "ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే మోదీకి ట్రంప్ ఫోన్ చేశారు. మోదీజీ.. ఏం చేస్తున్నారని అడిగారు. నరేందర్.. సరెండర్ అన్నారు. వెంటనే మోదీ కాల్పుల విరమణ ప్రకటించారు. ట్రంప్ ఆదేశాలను పాటించారు" అని రాహుల్ ఎద్దేవా చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ నేతలపై కొద్దిపాటి ఒత్తిడి తెచ్చినా వెంటనే లొంగిపోతారని, భయంతో పారిపోతారని, వారి గురించి తనకు బాగా తెలుసని అన్నారు. అదేసమయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీని పొగడ్తలతో ముంచెత్తారు. "అమెరికా బెదిరింపులను సైతం లెక్కచేయకుండా ఇందిరా గాంధీ హయాంలో 1971లో పాకిస్థాన్‌ను భారత్ విచ్ఛిన్నం చేసింది. అగ్రరాజ్యాలకు తల వంచకుండా పనిచేసింది. గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్.. వీరంతా అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధులే" అని రాహుల్ చెప్పారు. ఇదీ బీజేపీ, ఆరెస్సెస్ నేతలకు, కాంగ్రెస్ నేతలకు మధ్య ఉన్న తేడా అన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయం నుంచీ అంతేనని, వారికి లొంగిపోతూ లేఖలు రాయడం అలవాటని వ్యాఖ్యానించారు. కొద్దిపాటి ఒత్తిడి తెచ్చినా లొంగిపోతారని, అది వారి నైజమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ లొంగిపోదన్నారు. కాంగ్రెస్ నేతలంతా పోరాట యోధులన్నారు. మరోవైపు అదానీ సంస్థలో ఎల్ఐసీ రూ.5వేల కోట్లు పెట్టుబడి పెట్టడంపైనా రాహుల్ విమర్శించారు. "డబ్బు, పాలసీ, ప్రీమియం మీది. భద్రత, సౌకర్యం, లబ్ధి అదానీది" అని ట్వీట్ చేశారు.

జీ7కి ఆహ్వానం రాకపోవడం భంగపాటే

కెనడాలో జరగనున్న జీ7 దేశాల సదస్సుకు ప్రధాని మోదీకి ఆహ్వానం అందలేదు. దీంతో జీ7లో ప్రధాని పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది. ఈ అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు. అయితే, ఆహ్వానం అందినా, కెనడాతో నెలకొన్న పరిస్థితులవల్ల ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

నష్టాలు కాదు.. అంతిమ ఫలితమే ముఖ్యం

- మ్యాచ్ గెలవడమే ముఖ్యమైనప్పుడు ఎన్ని వికెట్లు పడ్డాయని చూస్తామా: సీడీఎస్ అనిల్ చౌహాన్



న్యూఢిల్లీ, జూన్ 3 : తాత్కాలిక నష్టాలనేవి సైన్యంపై ప్రభావం చూపించలేవని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. ఎదురుదెబ్బల కంటే అంతిమంగా ఏం సాధించామనేదే ప్రధానమని ఆయన వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత్ కూడా నష్టపోయిందని, కొన్ని వార్ జెట్లను కోల్పోయిందని చౌహాన్ గత వారం సింగపూర్‌లో ప్రకటించారు. ఆయన తీరు సర్వత్రా విమర్శలకు గురవుతోంది. పుణెలోని సావిత్రీబాయి పులే యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అయన.. తనపై వస్తున్న విమర్శలపై స్పందించారు. 'భవిష్యత్తు యుద్ధాలు - యుద్ధ క్షేత్రాలు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ.. పహల్గాం దాడికి ముందు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను పంచుకున్నారు. "ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మనవైపు జరిగిన నష్టాల గురించి నన్ను అడిగినప్పుడు, అదసలు పెద్ద విషయమే కాదని చెప్పాను. ఫలితమే ముఖ్యం. క్రికెట్‌లో మ్యాచ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ గెలవాలి అనుకున్నప్పుడు, ఎన్ని వికెట్లు కోల్పోయామనేది అసలు లెక్కలోకి రాదు. ఇన్ని యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. ఇన్ని రాడార్లు దెబ్బతిన్నాయి అని లెక్కలు తీసి మనం మాట్లాడుకోవచ్చు. కానీ, దానివల్ల ప్రయోజనం ఉండదు." అని అంటున్నప్పుడు ఆయన స్వరం బలహీనపడటం కనిపించింది. 48 గంటల్లో 'భారత్‌ను లొంగదీయడం' లక్ష్యంగా యుద్ధ వ్యూహాలను రచించుకున్న దాయాది దేశం ఎనిమిది గంటల్లోనే దాడులు నిలిపివేసి, చర్చల ప్రతిపాదనను ముందుకు తెచ్చిందని జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు.

సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ నిర్వహించాలి

- ప్రధానికి ఇండియా కూటమి నేతల లేఖ

న్యూఢిల్లీ, జూన్ 3: ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కోరుతూ ప్రధాని మోదీకి విపక్ష ఇండియా కూటమిలోని 16 పార్టీలు లేఖ రాశాయి. ఈ మేరకు న్యూఢిల్లీలో మంగళవారం ఆ పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జైరాం రమేశ్, దీపేంద్ర హుడా (కాంగ్రెస్), ఓబ్రెయిన్(టీఎంసీ), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), మనోజ్ ఝా (ఆర్జేడీ), సంజయ్ రౌత్ (శివసేన-యూబీటీ) తదితరులు హాజరయ్యారు. మోదీకి రాసిన లేఖపై సంతకాలు చేసినా ఎం.కరుణానిధి జయంతి నేపథ్యంలో డీఎంకే నేతలు ఈ భేటీలో పాల్గొనలేదు. లేఖపై రాహుల్, ప్రియాంక(కాంగ్రెస్), అఖిలేష్(ఎస్పీ), టీఆర్ బాలు(డీఎంకే), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), అరవింద్ సావంత్(శివసేన-యూబీటీ) తోపాటు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), సీపీఎం, ఐయూఎంఎల్, సీపీఐ, ఆర్ఎస్పీ, విదుథలాయి చిరుథాయిగల్ కచ్చి(వీసీకే), కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీల నేతలు లేఖపై సంతకాలు చేశారని విపక్ష నేతలు చెప్పారు. ఈ సమావేశానికి డుమ్మా కొట్టిన ఆప్.. మోదీకి విడిగా లేఖ రాస్తామని తెలిపింది. ఇక, శరద్ పవార్ సారథ్యంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ-ఎస్‌పీ) ఈ భేటీకి గైర్హాజరైంది.

చాట్‌జీపీటీ వినియోగంలో భారత్ టాప్!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. ఏఐ చాట్‌బాట్ అయిన చాట్‌జీపీటీ నెలవారీ క్రియాశీల వినియోగదారుల జాబితాలో భారత్ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో అమెరికా 8.9 శాతం, ఇండోనేసియా 5.7 శాతం ఉన్నాయి. చాట్‌జీపీటీ మాత్రమే కాదు.. చైనా రూపొందించిన డీప్‌సీక్ వినియోగంలోనూ భారతీయులు దూసుకెళ్తున్నారు. డీప్‌సీక్ మొత్తం వినియోగదారుల్లో 6.9 శాతంతో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచారు. 33.9 శాతం వినియోగదారులతో చైనా అగ్రస్థానంలో నిలవగా.. 9.2 శాతం యూజర్లతో రష్యా రెండో స్థానంలో ఉంది. ఈ వివరాలను ప్రముఖ విశ్లేషకురాలు మేరీ మీకర్ తన '2025 ట్రెండ్స్' నివేదికలో వెల్లడించారు. భవిష్యత్తు మొత్తం ఏఐదేననడానికి ఇదో సంకేతమని పేర్కొన్నారు. చాట్‌జీపీటీ వచ్చిన తొలి రెండేళ్లలోనే ఏటా 35000 కోట్ల సెర్చ్‌లు చేశారని.. గూగుల్‌కు ఈ సంఖ్యను చేరుకోవడానికి 11 ఏళ్లు పట్టిందని వెల్లడించారు. "నెట్ వినియోగదారులు కేవలం సమాధానాలు మాత్రమే కోరడం లేదు. వారు సమగ్ర సారాంశాన్ని కోరుకుంటున్నారు. దశాబ్దాకాలం పట్టే సెర్చ్ లెర్నింగ్ ప్రక్రియను చాట్‌జీపీటీ కొన్ని నెలలకు పరిమితం చేసింది" అని గ్రేహౌండ్ రిసెర్చ్ సీఈవో వీర్ గాగియా పేర్కొన్నారు. అయితే, కొన్ని క్లిష్టమైన ప్రశ్నలకు జనరేటివ్ ఏఐ చాలా బాగా ఉపయోగపడుతోందని, కానీ చాలా సెర్చ్‌లకు దాన్ని వాడాల్సిన అవసరం లేదని కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ సంస్థ డైరెక్టర్ మోహిత్ అగర్వాల్ అన్నారు.తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ప్రవేశంపై నిషేధం

న్యూఢిల్లీ, జూన్ 3: మెడికల్ రిప్రజెంటేటివ్‌లు కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులతో సమావేశం కావడంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) నిషేధం విధించింది. ఈ మేరకు మే 28న అయా ఆస్పత్రుల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక వైద్య విధానాలు, ఔషధాలకు సంబంధించిన సమాచారాన్ని వైద్యులతో పంచుకునేందుకు మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఈ-మెయిల్, మరేదైనా డిజిటల్ మీడియాను వినియోగించాలని డీజీహెచ్ఎస్ సూచించింది. ఈ ఉత్తర్వులను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతం ఫార్మా సంస్థలకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఇష్టారీతిన వైద్యులతో సమావేశం అవుతున్నారు. ఫలితంగా రోగులకు అందే వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. నిజానికి, కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ప్రవేశంపై నిషేధం విధిస్తూ డీజీహెచ్ఎస్ గతంలోనే ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేస్తూ తాజా ఆదేశాలు జారీ చేసింది.

లద్దాఖ్‌లో 85% ఉద్యోగాలు స్థానికులకే

న్యూఢిల్లీ, జూన్ 3: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో ఉద్యోగాలు, భాషలు, ప్రజా ప్రాతినిధ్యంపై ప్రత్యేక విధానాలను ప్రకటిస్తూ మంగళవారం కేంద్ర ప్రభుత్వం పలు ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగాల్లో 85 శాతం పోస్టులను స్థానికులకే కేటాయించింది. స్వయంప్రతిపత్తి మండలి అయిన లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడోవంతు సీట్లను మహిళలకు రిజర్వు చేసింది. ఇంగ్లిష్, హిందీ, ఉర్దూలతోపాటు స్థానికభాషలైన భోటి, పుర్గీలను అధికార భాషలుగా ప్రకటించింది. అవిభాజ్య జమ్మూ-కశ్మీర్ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్నప్పుడు లద్దాఖ్‌కు కూడా రాజ్యాంగంలోని 370వ అధికరణం వర్తించేది. అది రద్దయిన తరువాత తమకు రాజ్యాంగపర రక్షణలు లేకుండాపోయావని స్థానికులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఈ ప్రత్యేక సౌకర్యాలను ప్రకటించింది. లద్దాఖ్‌లో 15 ఏళ్లపాటు నివసించిన వారు, ఏడేళ్లపాటు ఇక్కడి విద్యాలయాల్లో చదివి 10వ తరగతిగానీ, 12వ తరగతిగానీ పరీక్షలు రాసినవారు ఈ ఉద్యోగాలకు అర్హులు.

చెప్పినదానికన్నా ఎక్కువే

11 పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశామన్న భారత రక్షణ శాఖ

- ఆ జాబితాలో లేని మరో 8 చోట్ల భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్
- సరిహద్దుల నుంచి 700 కిలోమీటర్ల లోపల కూడా టార్గెట్ చేసినట్లు ఆరోపణ



ఆపరేషన్ సిందూర్ వార్ రూమ్‌లో సైనికాధికారులు(ఫైల్ ఫొటో)

న్యూఢిల్లీ, జూన్ 3: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేసిన దాడులు పాకిస్థాన్‌లో తీవ్ర విధ్వంసం సృష్టించాయా? మన ప్రభుత్వం అధికారికంగా వెల్లడించినదాని కంటే కూడా ఎక్కువ ప్రాంతాలను వాయుసేన ధ్వంసం చేసిందా? పాక్ తనకు భారీ నష్టం జరిగిందని స్వయంగా ప్రకటించడం ఏమిటి? నిజంగా భారీ నష్టం జరిగిందా? దీని వెనుక భారత్‌ను బద్నాం చేసే కుట్ర ఉందా?.. భారత ఆపరేషన్‌కు ప్రతిగా చేపట్టిన 'ఆపరేషన్ బన్యన్ ఉన్ మర్సూస్'కు సంబంధించి పాక్ విడుదల చేసిన 'సవివర సమాచార పత్రం (డోజియర్)' ఇవే ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారత్ మరో ఎనిమిది ప్రాంతాల్లోనూ దాడులు చేసినట్టు పాక్ అందులో పేర్కొంది.

డోజియర్‌లో మ్యాప్‌లతో సహా..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. మే 7న అర్ధరాత్రి పాక్, పీఓకేలలోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా పాక్ పెద్ద సంఖ్యలో డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో భారత్‌లోని పౌర ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించింది. వీటిని అడ్డుకుని, పాక్‌ను నిలువరించేందుకు మన వాయుసేన.. 10వ తేదీన భారీ ఎత్తున దాడులకు దిగింది. పాక్‌లోని 11 ఎయిర్‌బేస్‌లు, వ్యూహాత్మక స్థావరాలు (నూర్‌ఖాన్, రఫీఖి, మురిద్, సుక్కుర్, సియాల్‌కోట్, మర్సుర్, చునియన్, సర్గోధా, స్కరు, భొలారి, జకోబాబాద్)ను క్షిపణి దాడులతో ధ్వంసం చేశామని ప్రకటించింది. వాటికి ఆధారాలను కూడా చూపింది. అయితే పాక్ ఇందులో మూడు ఎయిర్‌బే ఎలు మురిద్, రఫీఖి, మర్సుర్‌తోపాటు బలూచిస్థాన్ ప్రాంతంలోని సముంగ్లి ఎయిర్‌బేస్‌లపై మాత్రమే భారత్ దాడి చేసినట్టు డోజియర్‌లో పేర్కొంది. వీటితోపాటు మరో ఎనిమిది ప్రాంతాలు.. పెషావర్, ఝూంగ్, సింధ్ రాష్ట్రంలోని హైదరాబాద్, పంజాబ్ రాష్ట్రంలోని గుజ్రాత్, గుజ్రన్‌వాలా, భావల్‌నగర్, అట్టోక్, చోర్‌లలోనూ భారత్ దాడులు జరిగాయని చెబుతూ.. ఆ ప్రాంతాల మ్యాప్‌ను కూడా పెట్టింది. భారత్ దాడిచేసినట్టు చెప్పిన ప్రాంతాలకన్నా కూడా.. ఈ ప్రాంతాల్లో కొన్ని పాక్ భూభాగంలో మరింత లోపల ఉండటం గమనార్హం. అయితే భారత్ వాస్తవంగా దాడి చేసిన కొన్ని ఎయిర్‌బేస్‌ల వివరాలు దాచిపెట్టడం, ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతాలను పేర్కొనడంపై సందేహాలు వస్తున్నాయని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

భారత్‌ను బద్నాం చేసే కుట్ర?

వాస్తవానికి భారత్ చెప్పిన దానికంటే ఎక్కువ చోట్ల దాడులు జరిగాయని పాక్ తనంతట తానుగా ఎందుకు చెబుతోందన్నది కీలకమని రక్షణ నిపుణులు అంటున్నారు. పాక్ డోజియర్‌లో పేర్కొన్న సముంగ్లి ఎయిర్‌బేస్ బలూచిస్థాన్‌లోని క్వెట్టా నగరానికి దగ్గరిలో భారత సరిహద్దుల నుంచి సుమారు 600 కిలోమీటర్ల లోపల ఉంటుంది. పెషావర్ సుమారు 1,000 కిలోమీటర్లు, అట్టోక్ సుమారు 700 కిలోమీటర్లు లోపల ఉంటాయి. దీనికితోడు పాక్ అదనంగా చెప్పిన ఏడు ప్రాంతాలు మిలిటరీ స్థావరాలా, పౌర ప్రాంతాలా అన్నది కూడా పేర్కొనలేదు. అంటే పాకిస్థాన్ భూభాగంలో లోపలి పౌర ప్రాంతాల్లోనూ భారత్ దాడి చేసిందంటూ.. అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టేందుకు చేపట్టిన దుష్ప్రచారం ఇదని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి పాక్‌లో సాధారణ పౌరులకు ఏమాత్రం నష్టం జరగకుండా, చాలా కచ్చితత్వంతో మిలటరీ, ఉగ్ర స్థావరాలపై దాడులు చేశామని భారత దళాలు స్పష్టంగా ప్రకటించాయని గుర్తు చేస్తున్నారు. ఒకవేళ అవి మిలటరీ స్థావరాలే అయితే.. భారత్ భీకర దాడి చేసినట్టేనని, పాక్ దిగొచ్చి కాల్పుల విరమణ కోరడానికి ఇది కారణమై ఉంటుందని భావించవచ్చని చెబుతున్నారు.

లోకం తీరు



ఆరు పాక్ ఫైటర్లు కూల్చాం!

- ఆపరేషన్ సిందూర్ డేటా విశ్లేషణలో ఇప్పటివరకు నిర్ధారించిన రక్షణ శాఖ!
- ఇండియా టుడే కథనం

న్యూఢిల్లీ, జూన్ 3: ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు గట్టి దెబ్బ తగిలిందని.. ఆరు యుద్ధ విమానాలు, రెండు నిఘా విమానాలతోపాటు ఒక సీ-130 రవాణా విమానాన్ని కూడా కోల్పోయిందని రక్షణ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు 30కిపైగా క్షిపణులను, పెద్ద సంఖ్యలో డ్రోన్లను కూడా భారత్ ధ్వంసం చేసిందని వివరిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో నమోదైన రాడార్, నిఘా వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థల డేటాను విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. రక్షణ శాఖలోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. ఇండియా టుడే సంస్థ ఈ మేరకు కథనాన్ని ప్రచురించింది. ఆ వివరాల మేరకు.. ఆపరేషన్ సిందూర్ జరిగిన 4రోజుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఆరు యుద్ధ విమానాలను మన వాయుసేన క్షిపణుల సాయంతో కూల్చివేసింది. ఇక సుమారు 300 కిలోమీటర్ల దూరంలోని ఒక అత్యంత విలువైన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ (ఈడబ్ల్యూ) విమానం లేదా అవాక్స్ నిఘా విమానాన్ని సుదర్శన్ క్షిపణి వ్యవస్థను ఉపయోగించి ధ్వంసం చేసింది. మరోవైపు పాక్‌లోని భొలారి ఎయిర్‌బేస్‌పై మన వాయుసేన చేసిన క్షిపణి దాడుల్లో.. ఆ ఎయిర్‌బేస్‌లో నిలిపి ఉన్న స్వీడన్ తయారీ నిఘా విమానం ధ్వంసమైంది. ఈ ఎయిర్‌బేస్‌లోని హ్యాంగర్ (విమానాలను పార్క్ చేసే భారీ షెడ్) కూడా కుప్పకూలింది. అందులో కొన్ని యుద్ధ విమానాలు పార్క్ చేసి ఉన్నట్టు నిఘా వర్గాలకు సమాచారం ఉంది. మరో ఎయిర్‌బేస్‌లోని హ్యాంగర్‌పై రాఫెల్, సుఖోయ్ ఫైటర్లతో చేసిన దాడిలో.. చైనా తయారీ వింగ్ లూంగ్ డ్రోన్లు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. ఇక పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రాంతంపై భారత్ చేసిన డ్రోన్ దాడుల్లో పాక్ కు చెందిన సీ-130 రవాణా విమానం కూలిపోయింది. కాగా, అంచనా వేసినదానికన్నా పాకిస్థాన్‌కు నష్టం ఎక్కువ జరిగినట్లు రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

ఆన్‌లైన్ గేమ్స్ నియంత్రణ చట్టం సబబే

- మద్రాసు హైకోర్టు తీర్పు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌ను క్రమబద్ధీకరించడానికి తమిళనాడు ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటవుతుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. 2022లో ఆన్‌లైన్ జూదాలు, క్రీడలను క్రమబద్ధీకరించడానికి తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించింది. ఆ చట్టంలోని అంశాలను గత ఫిబ్రవరి 14న ప్రభుత్వ గెజిట్‌లో వెలువరించింది. ఆ చట్టం ప్రకారం రాష్ట్రంలో ఆన్‌లైన్ క్రీడలు ఆడేందుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేయాలని పేర్కొంటూ.. అర్ధరాత్రి 12 నుంచి వేకువజాము 5 గంటల వరకు ఆన్‌లైన్ క్రీడలు ఆడటంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆన్‌లైన్ గేమ్స్ సంస్థల తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. మంగళవారం తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం చెల్లుబాటు అవుతుందని తేల్చిచెప్పింది. గోప్యత ప్రాథమిక హక్కే అయినా ఆ హక్కు సంపూర్ణం కాదని, సమాజానికి హాని కలుగుతుంది కనుక వ్యక్తిగతపరమైన గోప్యతలో జోక్యం తప్పనిసరి అవుతుందని స్పష్టం చేసింది.

భారత్ చర్యలతో చికాకు

- అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్

వాషింగ్టన్, జూన్ 3: రష్యా నుంచి సైనిక సామగ్రిని కొనుగోలు చేయడం, బ్రిక్స్‌తో కలిసి డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ప్రయత్నించడం వంటి భారత చర్యలు అమెరికాకు చికాకు కలిగించాయని ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ చెప్పారు. అయితే అధ్యక్షుడు ట్రంప్‌కు భారత్ అంటే అమితమైన గౌరవమన్నారు. కానీ, భారత ప్రభుత్వం చేసిన కొన్ని పనులు అమెరికాను చికాకు పెట్టాయన్నారు. అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక (యూఎస్ఐఎస్‌పీఎఫ్) ఎనిమిదో సమావేశంలో లుట్నిక్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందని, అదెంతో దూరంలో లేదని చెప్పారు.

ఒక్కరోజులో 1,430 మంది ఉక్రెయిన్ సైనికులను చంపాం: రష్యా

మాస్కో/కీవ్, జూన్ 3: తమ సైన్యం 24 గంటల వ్యవధిలో 1,430 మంది ఉక్రెయిన్ సైనికుల్ని అంతమొందించిందని రష్యా తాజాగా ప్రకటించింది. తాము కూడా 1,100 మంది రష్యా సైనికులను హతమార్చినట్లు ఉక్రెయిన్ తెలిపింది. ఇస్తాంబుల్‌లో శాంతి చర్చల వేళ ఈ ప్రకటనలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి. యుద్ధం మొదలైన 2022 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు రష్యా కోల్పోయిన సైనికులు వివరాలను కూడా ఉక్రెయిన్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటి వరకు 9,90,800 మంది రష్యా సైనికులు చనిపోయారని తెలిపింది. మరోవైపు, రష్యా నుంచి క్రిమియాను కలిపే రోడ్డు, రైల్ బ్రిడ్జిపై వెయ్యి కిలోల పేలుడు పదార్థాలతో దాడి చేశామని ఉక్రెయిన్‌కు పేర్కొంది.

గృహహింస బాధితులకు రక్షణ

జిల్లా, తాలూకా స్థాయిల్లో ప్రత్యేక అధికారుల నియామకం ఆరు వారాల్లోపు పూర్తి చేయాలి

- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, జూన్ 3: గృహహింస బాధితులకు రక్షణ కల్పించటానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక అధికారులను ఆరు వారాల్లోపు నియమించాలని రాష్ట్ర కేంద్రపాలితప్రాంతాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. గృహహింస నిరోధక చట్టం నిబంధనలు సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్‌చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం గత నెల 20వ తేదీన ఇచ్చిన తీర్పు తాలూకు పూర్తి వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ తీర్పు కాపీని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. తీర్పులోని ముఖ్యాంశాలు..

- మహిళా, శిశు సంక్షేమశాఖలో జిల్లా, తాలూకా స్థాయిల్లో పని చేస్తున్న అధికారుల్లో కొందరిని గృహహింస బాధితుల కోసం 'రక్షణ అధికారులు'గా నియమించాలి. దీనికోసం ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంత ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి నియామకాల్ని ఆరు వారాల్లోగా పూర్తి చేయాలి. రక్షణ అధికారులు గృహహింస నిరోధక చట్టంలోని సెక్షన్ 9కి అనుగుణంగా విధులను నిర్వర్తించాలి.
- గృహహింస నిరోధక చట్టం సెక్షన్ 11 ప్రకారం.. బాధిత మహిళలకు చట్టం కల్పించే రక్షణ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలి. చట్టం గురించి పోలీసు, న్యాయవ్యవస్థలతోపాటు ఇతర శాఖల అధికారులకు కూడా ఎప్పటికప్పుడు శిక్షణనివ్వాలి. చట్టం అమలును నిర్ణీత కాలవ్యవధుల్లో క్రమం తప్పకుండా సమీక్షించాలి. కేంద్రప్రభుత్వం కూడా కీలకపాత్ర పోషించాలి.
- బాధిత మహిళలకు ఉచితంగా, తక్షణ న్యాయ సహాయం అందించాలని చట్టం నిర్దేశిస్తోంది. ఈ మేరకు జాతీయ న్యాయ సేవల అథారిటీ తగు చర్యలు చేపట్టాలి.

ఇదీ నేపథ్యం

పలు రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో గృహహింస నిరోధక చట్టం సరిగా అమలు కావటం లేదంటూ 'వి ద ఉమెన్' అనే స్వచ్ఛందసంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ చట్టం అమలుకు ప్రత్యేకంగా అధికారులను నియమించకుండా.. 'సమీకృత శిశు సంక్షేమ పథకం' (ఐసీడీఎస్) సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు అదనంగా బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపింది. ఇది వారి పని భారాన్ని పెంచటంతో.. చట్టం అమలుపై వారు దృష్టి పెట్టలేకపోతున్నారని.. ఫలితంగా బాధిత మహిళలకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే, ప్రత్యేకంగా అధికారులను నియమించాలని, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది.

- బాధిత మహిళలు తలదాచుకోవటానికి షెల్టర్‌హోం, నారీనికేతన్ వంటి గృహ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. జిల్లా, తాలూకా స్థాయిల్లో వీటి వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. 10 వారాల్లోపు ఇది జరగాలి.

మీరేమైనా చరిత్రకారులా..?

తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందన్న కమల్ హాసన్‌ను నిలదీసిన కర్ణాటక హైకోర్టు

- క్షమాపణ చెప్పాలని సూచించిన జడ్జి
- కమల్ ససేమిరా..
- తన సినిమా 'థగ్ లైఫ్'ను ప్రస్తుతానికి కర్ణాటకలో విడుదల చేయట్లేదని వెల్లడి



బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషపై తానుచేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో వివాదాస్పదమైన నేపథ్యంలో.. రాష్ట్రంలో తన సినిమా 'థగ్ లైఫ్' విడుదలకు మార్గం సుగమం చేయాలని.. థియేటర్ల వద్ద భద్రత కల్పించాలని కోరుతూ పిటిషన్ వేసిన సినీ హీరో కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ఇటీవల సినిమా ప్రీ-రిలీజ్ వేడుకల్లో చేసిన వ్యాఖ్యలకు మొదట క్షమాపణ చెప్పాలని సూచించింది. భాష ప్రతి వ్యక్తి సాంస్కృతిక, భావోద్వేగ గుర్తింపులో భాగమని.. తమిళం నుంచి కన్నడ పుట్టిందనే హక్కు కమల్‌కు ఎవరిచ్చారని న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈ సందర్భంగా నిలదీశారు. 'ఇలాంటి ప్రకటన చేయడానికి మీరేమైనా చరిత్రకారులా.. లేక భాషావేత్తలా? ఏ ప్రాతిపదికన అలా మాట్లాడారు? ఏ భాషా మరో భాష నుంచి పుట్టదు. నీరు, నేల, భాష ప్రజలకు పవిత్రమైనవి. భాష ప్రాతిపదికనే దేశంలో రాష్ట్రాలు ఏర్పడ్డాయి. మీరు చేసిన వ్యాఖ్యలు కర్ణాటక ప్రజల మనోభావాలను దెబ్బతీశాయి. క్షమాపణ చెబితే సమస్య పరిష్కారమయ్యేది. మీరు కమల్ హాసన్ కావచ్చు.. ఇంకెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి వీల్లేదు. సి.రాజగోపాలాచారి కూడా 75 ఏళ్ల కిందట ఇలాంటి ప్రకటనే చేసి.. తర్వాత క్షమాపణ చెప్పారు. మరి మీరెందుకు చెప్పరు? సినిమా విడుదల ద్వారా కర్ణాటకలో రూ.కోట్లు ఆర్జించాలని భావిస్తున్నారు. కానీ క్షమాపణ చెప్పరా? ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సాధారణ పౌరులను కూడా శిక్షిస్తాం. మీరేమైనా ఇందుకు మినహాయింపా' అని ఆక్షేపించారు. పరిస్థితి సద్దుమణిగేలా చేయడానికి క్షమాపణ చెప్పే విషయం ఆలోచించాలని కమల్‌కు సూచించారు. మధ్యాహ్నం 2.30 వరకు విచారణను వాయిదావేశారు. విచారణ పునఃప్రారంభమయ్యాక.. క్షమాపణ చెప్పడానికి కమల్ హాసన్ నిరాకరించారు. ప్రస్తుతానికి ఆ సినిమాను కర్ణాటకలో విడుదల చేయడం లేదని కమల్, ఆయన నిర్మాణ సంస్థ నిర్ణయించినట్లు వారి లాయర్ తెలిపారు. కేఎఫ్‌సీసీతో చర్చలు జరిపేదాకా విడుదల ఆపేస్తామన్నారు. క్షమాపణ చెప్పడానికి కమల్ నిరాకరించడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. విచారణను 10వ తేదీకి వాయిదావేసింది.

తప్పుగా అర్థం చేసుకున్నారు..

తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని కేఎఫ్‌సీసీ అధ్యక్షుడు నరసింహలుకు కమల్‌హాసన్ ప్రత్యేకంగా లేఖ రాశారు. కన్నడ భాషపై తనకు అగౌరవం లేదని, అభిమానం ఉందని తెలిపారు. తమిళం, కన్నడ, తెలుగు, మళయాళం సహా ఈ గడ్డపై ఉన్న అన్ని భాషలతో తనకు అనుబంధం ఉందన్నారు. తనపై ఉన్న ప్రేమ, అనుబంధంతో శివణ్ణ (శివరాజ్‌కుమార్) కూడా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు వచ్చారని, తన కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై బీజేపీ సీనియర్ నేత, మాజీ సీఎం యడియూరప్ప స్పందించారు. శాంతి, సామరస్యానికి భంగం కలిగించేలా, కోట్లాదిమంది కన్నడిగుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. క్షమాపణలు చెప్పినంత మాత్రాన చిన్నవారైపోరని 'ఎక్స్'లో అభిప్రాయపడ్డారు.

ఒకపక్క ఫుల్.. మరోపక్క డల్

సిబ్బంది సర్దుబాటులో బ్యాలన్స్ తప్పుతున్న ఆర్టీసీ

» ఆదాయం వచ్చే బస్‌డిపోల్లో భారీగా కొరత
» హెడ్ ఆఫీస్‌లో ఖాళీల్లేకుండా 'హౌస్'ఫుల్
» సిఫారసులు, పైరవీలతో సిబ్బంది బదిలీలు
» ఉన్నతాధికారుల నిర్ణయాలతో సంస్థకు నష్టం
» పాలకమండలి, అధికారుల మధ్య సమన్వయ లోపం

నాలుగు చక్రాల్లోనూ సరిపడ గాలి ఉంటేనే బస్సు క్షేమంగా ముందుకువెళుతుంది. అలాగే అవసరం అయిన చోట సరిపడ సిబ్బంది ఉంటేనే సంస్థ కార్యకలాపాలు సజావుగా నడుస్తాయి. అయితే ఏపీఎస్ ఆర్టీసీలో ఇందుకు విరుద్ధంగా ఉంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత వేధిస్తుంటే.. హెడ్ ఆఫీస్‌లో మాత్రం ఒక్క ఖాళీ కూడా లేకుండా 'హౌస్ ఫుల్'గా నడుస్తోంది. పలు డిపోల్లో తక్కువ మంది సిబ్బందితోనే నెట్టుకొస్తుండటం వల్ల అక్కడి వారిపై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. సిబ్బంది పరిస్థితి ఇలా ఉంటే.. అధికారులు, పాలకమండలి మధ్య అసలు సంబంధాలే లేవు. సరిదిద్దాల్సిన రవాణా శాఖ మంత్రి పట్టించుకోవడంలేదు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో రోజూ 45 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యం చేరుస్తున్న ప్రజా రవాణా సంస్థ ఏపీఎస్ ఆర్టీసీలో సిబ్బంది సర్దుబాటులో సమతుల్యత కొరవడింది. సంస్థకు ఆదాయం తెచ్చిపెట్టే బస్ డిపోల్లో సిబ్బంది కొరత భారీగా ఉంటే.. విజయవాడ హెడ్ ఆఫీస్ ఆర్టీసీ హౌస్‌లో మాత్రం ఫుల్లుగా ఉన్నారు. జిల్లాల్లో బస్ డిపో మేనేజర్లు పొరుగు డిపోల బాధ్యతలు కూడా అదనంగా చూస్తున్నారు. హెడ్ ఆఫీస్‌లో ఒక్కటంటే ఒక్క ఆఫీసర్, సూపర్ వైజర్, క్లర్క్ పోస్టు కూడా ఖాళీగా లేకపోవడం విశేషం. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో పనులు ముందుకువెళ్లడం లేదు. పనిభారం పడి సిబ్బంది అనారోగ్యాల బారిన పడుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో 62 వేల మంది సిబ్బంది ఉన్న ఏపీఎస్ ఆర్టీసీలో ఇప్పుడు 47 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారు. గత పన్నెండు ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగ రిక్రూట్మెంట్లు లేకుండా కేవలం కారుణ్య నియామకాలు మాత్రమే చేస్తున్నారు. ఫలితంగా ఉన్న సిబ్బంది వయో భారంతో ఆశించిన స్థాయిలో పని చేయలేకపోతున్నారు. క్లరికల్ సిబ్బంది మొదలు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల కొరత ఆర్టీసీలో ఎక్కువగా ఉంది. కొత్తగా రిక్రూట్మెంట్లు చేసుకుని మెరుగైన సేవలందిస్తే ఆక్యుపెన్సీ మరింత పెరిగి సంస్థ బలోపేతం అవుతుందని సీనియర్లు చెబుతున్నారు. కానీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా ఉన్నతస్థాయిలో అధికారులు కాలం వెళ్లదీస్తున్నారని విమర్శిస్తున్నారు. రోజు వారీ కింద బస్సు డ్రైవర్లను నియవించుకుని, కొత్త బస్సులు కొనకుండా, ఉన్న వాటికి నిర్వహణ లేకుండా ఎన్నాళ్లు సంస్థను నడిపించగలమని వ్యాఖ్యానిస్తున్నారు. పైరవీలు చేసిన వారికి, సొంత మనుషులకు అడిగిన చోట పోస్టింగ్స్ ఇస్తూ అవసరమైన చోట ఖాళీ ఉంచితే సంస్థ నష్టపోతుందని సిబ్బందిలో ఆవేదన వ్యక్తం అవుతోంది. సర్దుబాట్లు చేయాల్సిన ఉన్నతాధికారులు ఇవేవీ పట్టించుకోవట్లేదని, ఆర్టీసీ బోర్డు సభ్యులకు చెబితే మాకే దిక్కు లేదంటూ నిర్వేదం ప్రదర్శిస్తున్నారని చెబుతున్నారు.

బోర్డు మీటింగ్ ప్రసక్తే లేదు

ఆర్టీసీలో కీలక నిర్ణయాలు తీసుకునే పాలకమండలి ఏర్పాటై 8 నెలలు కావస్తోంది. పూర్తి స్థాయి బోర్డు ఏర్పాటైనా ఇప్పటి వరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. బోర్డు చైర్మన్, జోనల్ చైర్మన్‌ల పరిచయ కార్యక్రమం కూడా లేదు. హెడ్ ఆఫీసుకు వచ్చినప్పుడు కూర్చోవడానికి కనీసం ఒక గది ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకునే అధికారి ఒక్కరూ లేరు. బోర్డును పట్టించుకోకుండా ఉన్నతాధికారులు మాత్రం ప్రతి నెలా రెండు, మూడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాలకమండలి, ఉన్నతాధికారులు సమావేశమై చర్చించి ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటే సంస్థకు ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి ఆర్టీసీలో లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర రవాణా మంత్రిగా రామ్‌ప్రసాద్ రెడ్డి గత ఏడాది జూన్ చివరి వారంలో బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు రెండో వారంలో ఆర్టీసీ హౌస్‌లో అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, మహిళలకు ఉచిత ప్రయాణం మొదలుకొని కొత్త బస్సుల కొనుగోలు వరకూ చాలా విషయాలు వెల్లడించారు. ఆ తర్వాత ఒక్క రోజైనా ఆయన ఆర్టీసీ హౌస్‌కు రాలేదు. అందుకు ప్రధాన కారణం సంస్థ ఉన్నతాధికారులు ఆయనను మంత్రిగా చూడట్లేదనే ప్రచారం జరుగుతోంది. బస్సుల నిర్వహణ కూడా సరిగా చెయ్యని ఆర్టీసీ అధికారులు కనీసం బస్టాండ్లను కూడా శుభ్రంగా ఉంచకపోవడంతో కలెక్టర్లు తనిఖీలు చేయాలంటూ ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశించారు. సమన్వయంతో ముందుకెళితేనే ఆర్టీసీ ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయని పలువురు సూచిస్తున్నారు.

చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం

» లాకప్‌లో ఉన్న నిందితుడిపై బ్లేడ్‌తో బాలిక మేనమామ దాడి

ఆకివీడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో దారుణం చోటుచేసుకుంది. బ్రతుకుదెరువు కోసం తిరుపతి నుంచి ఆర్నెల్ల క్రితం దంపతులు తమ ఏడు సంవత్సరాల కుమార్తెతో స్థానిక సంతమార్కెట్‌లోని పడాలవీధికి వచ్చి అద్దెకు ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన షేక్ చిన మీరావలి (70) (మాంసం వర్తకుడు) సోమవారం ఆరు బయట ఆడుకుంటున్న బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మీరావలిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బాలికకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి శాంపిల్స్ విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిందితుడిని తమకు అప్పగించాలంటూ పోలీసులతో వాదనకు దిగారు. కొందరు సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజుతో ఘర్షణ పడ్డారు. ఇంతలో స్టేషన్ లోపలికి వెళ్లిన బాలిక మేనమామ లాకప్‌లో ఉన్న మీరావలిపై దాడి చేసి బ్లేడ్‌తో గాయపర్చాడు. అనంతరం అతను పోలీస్ స్టేషన్‌లో సొమ్మసిల్లి పడిపోయాడు. మీరావలిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం తరలించారు. డీఎస్పీ జయసూర్య ఆకివీడు ఆసుపత్రిలో మీరావలిని పరిశీలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో బాలిక మేనమామ చికిత్స పొందుతున్నాడు. డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణ లో ఎస్ఐ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మేనమామపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా.. మీరావలిని కఠినంగా శిక్షించాలని డీఎస్పీ జయసూర్యకు టీడీపీ శ్రేణులు వినతిపత్రం అందజేశాయి.

ప్రజా ప్రతిపక్షంతోనే విభజన హామీల అమలు సాధ్యం: తులసిరెడ్డి



గుంటూరు కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీలు గత 11 సంవత్సరాలుగా 10 శాతం మాత్రమే అమలు అయ్యాయని, నిర్మాణాత్మకమైన ప్రజా ప్రతిపక్షం ద్వారానే కేంద్రం మెడలు వంచి విభజన చట్టంలోని హామీలను నూరు శాతం అమలు చేసుకోగలమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరులో 'అమలు కాని విభజన హామీలు-యువత వలసలు-అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్' అనే అంశాలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా, వెనుకబడిన 7 జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ అందించకుండా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందన్నారు.



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న విద్యా రవిచంద్రన్

ప్రాణదానం ట్రస్టుకు రూ.54 లక్షల విరాళం

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు మంగళవారం రూ.54 లక్షలు విరాళంగా అందింది. కర్ణాటక రాష్ట్రం మంగుళూరుకు చెందిన విద్యా రవిచంద్రన్ తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

శ్రీవారి మెట్టు మార్గంలో దివ్యదర్శన టోకెన్ల పంపిణీ

తాత్కాలికంగా నిలిపివేత

6వ తేదీ సాయంత్రం నుంచి భూదేవి కాంప్లెక్సులో జారీ

1200వ మెట్టు వద్ద స్కాన్ తప్పనిసరి



తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం శ్రీవారిమెట్టు మార్గంలో కాలి నడక భక్తులకు ఇచ్చే దివ్యదర్శనం(డీడీ) టోకెన్లను.. శుక్రవారం నుంచి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చనున్నారు. ఈ మార్గంలో కాలినడకన వచ్చే భక్తులకు టీటీడీ ప్రతిరోజు 5 వేల దివ్యదర్శన టోకెన్లను జారీ చేస్తోంది. ఇటీవల ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు దర్శన టోకెన్లు ఇప్పిస్తామని భక్తులను భారీగా దోచుకుంటున్న విషయం తెలిసిందే. దీనికి అడ్డుకట్ట వేసేలా టీటీడీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం శ్రీవారి మెట్టు నుంచి దివ్యదర్శన టోకెన్ల కౌంటర్లను శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి మార్చాలని నిర్ణయించారు. అనుమతి కోసం కేంద్ర ఆర్కియాలజీ విభాగానికి లేఖ రాశారు. వారి నుంచి ఇంకా అనుమతి రాకపోవడంతో టోకెన్ల జారీని ప్రస్తుతం స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు(ఎస్ఎస్‌డీ) జారీ చేస్తున్న అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు తాత్కాలికంగా మార్చాలని నిర్ణయించారు. శనివారం దర్శనానికి సంబంధించి శుక్రవారం సాయంత్రం నుంచి భూదేవి కాంప్లెక్స్‌లో డీడీ టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ టోకెన్లు పొందిన భక్తులు తప్పనిసరిగా శ్రీవారిమెట్టు మార్గంలోని 1,200వ మెట్టు వద్ద స్కాన్ చేసుకోవాలి. ఇదే అంశంపై టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం సాయంత్రం అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు.



తుంగభద్ర డ్యాం (ఫైల్)

అహ్మదాబాద్ కంపెనీకే తుంగభద్ర క్రస్ట్ గేట్ల టెండరు

» 52 కోట్లతో 32 గేట్లు తయారీకి ముందు కొచ్చిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ

బళ్లారి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్లు తయారీ ఈ-టెండర్‌ను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ ప్రాజెక్ట్స్ కంపెనీ దక్కించుకుందని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ మంగళవారం తెలిపారు. 19వ క్రస్ట్‌గేట్ మినహా 32 గేట్లను రూ.52 కోట్లకు తయారు చేసేందుకు ఆ కంపెనీ ముందుకొచ్చిందన్నారు. ఈ టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్ దాఖలు చేయగా.. హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ ప్రాజెక్ట్స్ అతి తక్కువకు కోట్ చేసింది. క్రస్ట్ గేట్ల తయారీలో ఆ కంపెనీకి ఉన్న అనుభవం, ఇతర అంశాలను బోర్డు అధికారులు పరిగణనలోకి తీసుకుని టెండరు ఖరారు చేశారు. 19వ క్రస్ట్ గేటును కూడా ఇదే కంపెనీ తయారు చేస్తోంది. మరో 20 రోజుల్లో ఈ గేటును అమర్చే అవకాశం ఉందని బోర్డు వర్గాలు తెలిపాయి. గతేడాది ఆగస్టు 10న వరద ఉధృతికి ఈ గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే.

ఉపాధిలో పెద్ద పనులను తనిఖీ చేయండి

» జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్ కమిషనర్ లేఖలు

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో భాగంగా రాష్ట్రంలో గతేడాది చేపట్టిన పెద్ద పనులను తనిఖీ చేసి నివేదిక పంపించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ జిల్లా కలెక్టర్లకు లేఖలు రాశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యధిక అంచనా విలువ కలిగిన పనులను తనిఖీ చేసేందుకు క్వాలిటీ కంట్రోల్ డీఈఈ, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ/డీఆర్‌పీ, డ్వామా ఏపీడీలతో బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7లోగా తనిఖీ చేయాల్సిన పనులను ఆయా బృందాలకు కేటాయించాలని కోరారు. ఇప్పటికే ఆయా పనులకు సంబంధించి నిఘా ఏజెన్సీలు చేపట్టిన తనిఖీలు, తీసుకున్న చర్యలపై నివేదికను ఈ నెల 9లోగా సమర్పించాలని కోరారు. ఆయా శాఖలకు సంబంధించిన ఎంబుక్‌లు, బిల్లులు, ఓచర్లు, పనివారి ఫైళ్లు తనిఖీ బృందాలకు అందుబాటులో ఉంచాలన్నారు. తనిఖీలు సకాలంలో పూర్తి చేయాలని ఆ లేఖల్లో సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీ చేయాల్సిన పనుల వివరాలను ఆయా జిల్లాలకు పంపారు. ఈ పనుల్లో ఎక్కువగా గతేడాది నిర్వహించిన ఇంటి స్థలాల లెవలింగ్ పనులున్నాయి. వాటితో పాటు ఉపాధి నిధులు, ఇతర శాఖల నిధులతో చేపట్టిన బీటీ రోడ్లు ఉన్నాయి.



జస్టిస్ హరిహరనాథ శర్మకు జ్ఞాపిక, ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ ఈఓ, అర్చకులు

మహానందీశ్వరుని సేవలో జస్టిస్ హరిహరనాథ శర్మ

మహానంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ మంగళవారం సందర్శించారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన, కోదండరామాలయంలో నామార్చన నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో జస్టిస్ హరిహరనాథ శర్మను వేద పండితులు ఆశీర్వదించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రష్యా 'పెర్ల్‌హార్బర్'!

నలభైకి పైగా రష్యన్ విమానాలను ఉక్రెయిన్ పేల్చివేసిన ఆ ఘటన ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. సామాజిక మాధ్యమాల్లో అసలు దృశ్యాలకంటే కృత్రిమవిడియోలే అనేకరెట్లు విస్తృతంగా ప్రచారమైనాయి. ఇటీవలికాలంలో ఎన్నడూ చూడని, ఊహకు కూడా అందని ఈ కొత్తతరహా దాడి ఆధారంగా విడియోగేమ్‌లు కూడా తయారైనాయట. సరిహద్దునుంచి నాలుగువేల కిలోమీటర్ల లోపలకు చొచ్చుకుపోయి, రష్యాలోని వేర్వేరుప్రాంతాల్లో ఉన్న వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేయగలగడం ఊహకు అందనిది. డ్రోన్లను ట్రక్కుల్లో దట్టించి రష్యాలోకి రహస్యంగా చేరవేయడం, ఆ వాహనాలను వైమానికస్థావరాలకు సమీపంలో ఉంచడం, తాము కోరుకున్న సమయంలో రిమోట్‌తో వాటి పైకప్పులను ఎత్తి డ్రోన్లను గాలిలోకి వదలడం 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్' పేరుకు తగ్గట్టుగానే ఉంది. ఉబ్బితబ్బిబ్బవుతున్న జెలెన్‌స్కీ, ఏడాదిన్నర కష్టమిది అంటున్నారు. అణ్వాయుధాలను మోసుకుపోగలిగే యుద్ధవిమానాలు, బాంబర్లతో సహా, హెచ్చరిక, రక్షణ వ్యవస్థలున్న విమానాలు కూడా నాశనమైనవాటిలో ఉన్నాయని ఉక్రెయిన్ అంటోంది. ఉక్రెయిన్ గొప్పలన్నింటినీ నమ్మనక్కరలేదు కానీ, డ్రోన్లు, కృత్రిమమేథస్సు కలగలిపి సాగించిన ఈ విధ్వంసం యుద్ధం మొదలైన తరువాత రష్యాకు అతిపెద్ద దెబ్బ.

బుడాపెస్ట్ ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్ తన వద్ద ఉన్న ఆఖరు విడత అణ్వాయుధాలను రష్యాకు అప్పగించి ఆదివారం నాటికి 29 సంవత్సరాలైందని కొందరు గుర్తుచేసుకుంటున్నారు. రష్యన్ ప్రజలు ఈ డ్రోన్లదాడిని 1941 డిసెంబరు 7న పెర్ల్ హార్బర్‌లో అమెరికా నౌకాదళం మీద జపాన్ జరిపిన వైమానిక దాడితో పోల్చుకుంటున్నారు. యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం ఏ స్థాయికి హెచ్చిందో ఈ ఘటన చెబుతోంది. ఇటీవలే రష్యా నాలుగువందల డ్రోన్లను వినియోగించి ఉక్రెయిన్‌ను దెబ్బతీసిన నేపథ్యంలో, అంతకంటే అత్యాధునికమైన, సొంత బుర్రతో సమస్త కార్యాలనూ చక్కబెట్టగల నాలుగోవంతు డ్రోన్లతో ఉక్రెయిన్ పైచేయి సాధించడం విశేషం. తక్కువ ఖర్చుతో తయారైన చిన్నచిన్న డ్రోన్లు ఇంతటి పెను విధ్వంసాన్ని సృష్టించడం యుద్ధరీతుల్లోనూ, నీతుల్లోనూ వచ్చిన మార్పుకు ప్రబల నిదర్శనం. ఒక్కసారిగా గాల్లోకి లేచి, తూనిగల్లాగా ఎగురుతున్న బుల్లి డ్రోన్లు ఏకంగా భారీ బాంబర్లను పేల్చివేస్తున్న దృశ్యాలు డ్రోన్ టెక్నాలజీలో అమితవేగంగా జరుగుతున్న ఎదుగుదలను తెలియచెప్పడమే కకాదు, భవిష్యత్ యుద్ధాలు ఏ విధంగా జరగబోతాయో కూడా హెచ్చరిస్తున్నాయి.

యుద్ధంలో ఉన్న రెండుపక్షాలు ఇంత సునాయాసంగా పరస్పరం నష్టపరచుకొనే, రెచ్చగొట్టుకొనే వీలున్నప్పుడు యుద్ధాలను ఆపడం కూడా కష్టమే. వారం క్రితం మిసైళ్ళు, డ్రోన్లతో రష్యా సాగించిన విధ్వంసం అమెరికా అధ్యక్షుడికి అమితాగ్రహం కలిగించింది. ఒకపక్క చర్చలు జరుగుతూంటే, కాల్పుల విరమణకు సిద్ధపడకుండా ఇప్పటివరకూ యుద్ధంలో వాడని అతిశక్తిమంతమైన మారణాయుధాలతో సామాన్యులను సైతం పుతిన్ చంపినందుకు ట్రంప్‌కు కోపం వచ్చింది. రష్యాను తానే రక్షిస్తున్నానని, తానేగనుక లేకపోతే ఈ పాటికి రష్యాకు తీవ్రమైన చెడు జరిగి, ప్రపంచపటం నుంచి చెరిగిపోయేదన్నట్టుగా ఆయన మాట్లాడారు. పుతిన్ నిప్పుతో చెలగాటమాడుతున్నాడన్నట్టుగా ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో రష్యా పెద్దలకు మూడో ప్రపంచయుద్ధం హెచ్చరిక కూడా కనిపించింది. వారం నాటి ఆ దాడి శాంతి చర్చలను ప్రభావితం చేస్తుందని అనుకుంటే, మలివిడత చర్చలకు కూచోబోతున్న కొద్దిగంటలముందు జరిగిన ఇప్పటిదాడి వాటి వైఫల్యానికి కారణం కావడం అత్యంత సహజం. తుర్కియే కేంద్రంగా రెండోవిడత చర్చలు కనీసం గంటకూడా సాగకుండా ముగిసిపోయాయి. ఈ చర్చల్లో కాల్పుల విరమణ గురించి పలుమార్లు ఉక్రెయిన్ ఒత్తిడిచేసినా రష్యా లొంగలేదట. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆపరేషన్ స్పైడర్ వెబ్ తీవ్రమైన అవమానాన్ని మిగిల్చింది. ఏడాదిన్నరగా సాగుతున్న ప్రణాళికను రష్యన్ ఇంటలిజెన్స్ విభాగం పసిగట్టలేకపోవడం పెద్ద వైఫల్యం. ఉక్రెయిన్ మీద మరింత తీవ్రంగా కక్షసాధించాలన్న ఒత్తిడి పుతిన్‌మీద పెరుగుతోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో, రాబోయే కాలంలో ఈ ప్రతీకార దాడుల స్థాయి, విస్తృతి ఊహకు అందదు. కాలం గడుస్తున్నకొద్దీ యుద్ధం కట్టుతప్పి ఇరుపక్షాలనూ ఎదురెదురుగా కూర్చోబెట్టగలిగే అవకాశమే లేకపోవచ్చు. రెండోవిడత చర్చలు విఫలమైన నేపథ్యంలో తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ ఓ ప్రతిపాదన చేశారు. సాధ్యమైనంత త్వరలో, కనీసం ఈ నెలాఖరులోగా, రష్యా, ఉక్రెయిన్, అమెరికా అధ్యక్షులు నేరుగా చర్చల్లో కూర్చోవాలన్న ఆ ఆలోచనకు ముగ్గురూ సరేనంటే తప్ప, చర్చల్లో ప్రగతి అసాధ్యం.

కాంగ్రెస్‌కు అధిష్ఠానమే గుదిబండ!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గత నెల చివరి వారంలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ పదవ సమావేశంలో ముగ్గురే ముగ్గురు ముఖ్యమంత్రులు అద్భుతమైన ప్రసంగాలు చేసి అందరి దృష్టినీ ఆకర్షించారని ఒక అధికారి తెలిపారు. వారిలో ఇద్దరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కావడం గమనార్హం. సాధారణంగా తన సహజ శైలిలో చంద్రబాబు తన ప్రసంగ వెల్లువలో తానే కొట్టుకుపోకుండా నిర్దిష్టమైన సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ అభివృద్ధికి నమూనాగా మార్చేందుకు తానేమి చేయబోతున్నానో స్పష్టంగా చెప్పి చంద్రబాబు అందర్నీ ఆకట్టుకున్నారు. తెలంగాణ రైజింగ్ ఎజెండాను ఆవిష్కరిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలోను, సామాజిక న్యాయం అందించడంలోను తెలంగాణ ముఖ్యమైన భూమిక ఎలా పోషించగలదో రేవంత్‌రెడ్డి వివరించారు. కేంద్రం సహకార సమాఖ్య విధానాన్ని అవలంబించినప్పుడే రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందగలవని ఆయన స్పష్టీకరించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్‌సింగ్ మాన్ తమ రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న సవతి తల్లి ధోరణిని నిర్ద్వంద్వంగా ఖండించారు.

ఆ సమావేశం తర్వాత నరేంద్రమోదీ కూర్చున్న రౌండ్ టేబుల్‌లోనే చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కూడా ఉండడంతో సహజంగా మోదీ ఇరువురితోనూ స్నేహపూర్వకంగా మాట్లాడారు. మాటల సందర్భంలో రేవంత్ తన సహజ ధోరణిలో మాట్లాడుతూ 'నేను మొదట మీ స్కూలులోనూ, తర్వాత చంద్రబాబు కాలేజీలోనూ చదువుకున్నాను.. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉద్యోగం చేస్తున్నాను..' అని చమత్కరించారు. ఇందుకు మోదీ బిగ్గరగా నవ్వి రేవంత్ భుజం తట్టారని సమాచారం. చంద్రబాబు ఢిల్లీలో ఉన్న రెండు రోజుల్లోనూ అమిత్ షాతో సహా ఏడుగురు మంత్రులను కలుసుకుని నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొని అదే రోజు సాయంత్రం వెళ్లిపోయారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు నెలకోసారి సగటున ఢిల్లీకి వచ్చినప్పటికీ నిర్దిష్టంగా తనకు అవసరమైన పనులు చేసుకుని వెళ్లిపోతారు. ఆయన వచ్చిన ప్రతిసారీ ఆయన ప్రాధాన్యం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. మంత్రులు ఆయనను ఎదురెదురుగా కూర్చోబెట్టడం కాకుండా తమ పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడడమే ఇందుకు నిదర్శనం.

నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న రేవంత్ వెంటనే ఢిల్లీ నుంచి వెళ్లిపోలేదు. అదే రోజు ఆయనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో అపాయింట్‌మెంట్ లభించి రాష్ట్రానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలపై చర్చించే అవకాశం లభించినప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానంతో పెండింగ్ అంశాలను చర్చించడం కోసం మూడు రోజుల పాటు దేశ రాజధానిలోనే మకాం వేయవలిసి వచ్చింది. చివరకు ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను తప్ప మరెవరినీ కలుసుకోలేక, సమస్యలకు పరిష్కారం సాధించలేక తిరిగి వెళ్లిపోయారు. నిజానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనుకున్న సమయానికి రాలేకపోవడం వల్ల నిర్ణయాలు వాయిదా పడి ఉండవచ్చు కాని సహజంగానే ఒక ముఖ్యమంత్రి ఢిల్లీలో పార్టీ నేతలను కలుసుకోవడం కోసం ఇన్ని రోజులు ఉండాల్సి రావడంపై ప్రజల్లో చర్చకు రాక తప్పదు. పీసీసీ అధ్యక్షుడు తాను ఎంపికై ఏడెనిమిది నెలలు కావస్తున్నా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గాన్ని ఎంపిక చేసుకోలేకపోవడం, ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోతున్నా మంత్రివర్గాన్ని విస్తరించలేకపోవడం ప్రధాన చర్చనీయాంశాలు. నిజానికి ఇవేమీ పెద్ద ప్రజాసమస్యలు కాకపోయినా ఢిల్లీ రావడం, రోజుల తరబడి వాటికోసం ఉండాల్సి రావడం జనం దృష్టిని దాటిపోలేని అంశాలే అనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రి వచ్చినప్పుడల్లా పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి రావడం, పార్టీ నేతల్ని కలుసుకోవడం, రకరకాల కథనాలను ప్రచారం చేయడం జరుగుతూనే ఉంటోంది. ఎలాగూ ముఖ్యమంత్రి తరుచుగా వస్తున్నారు కనుక మళ్లీ వెళ్లిపోవడం ఎందుకులే అని కొందరు ఎమ్మెల్యేలు ఇక్కడే ఉండి రకరకాల నేతల్ని కలుసుకుంటున్నారు. ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కటాక్ష వీక్షణాలకోసం తాపత్రయ పడుతూనే ఉన్నారు. కర్ణాటక పరిస్థితి కూడా తెలంగాణ పరిస్థితికి ఏమంత భిన్నంగా లేదు. ముఖ్యమంత్రిని ఢిల్లీకి పదే పదే తిప్పించుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి అలవాటేనని, దాని వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని సీపీఐ నేత నారాయణ లాంటి వారు కూడా విమర్శించారు.

కాంగ్రెస్‌లో రెండు ప్రధాన లక్షణాలు కనపడుతుంటాయి. ఒకటి– పదవులకోసం తపన; రెండవది– అసమ్మతి. పదవులకోసం కాంగ్రెస్ నాయకుల ఆరాటం, ఓపిక చూస్తుంటే అధికారం లేకపోతే జీవించలేరా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. అధికారమే కాదు, నిత్య అసమ్మతి కూడా కాంగ్రెస్‌లో జీవలక్షణంలా కనిపిస్తుంది. ప్రతి రోజూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఈ మెయిల్స్, ఫోన్లు ఢిల్లీకి చేరుతూనే ఉంటాయి. ముఖ్యమంత్రి ప్రతి నిర్ణయాన్నీ, ప్రసంగాన్నీ విమర్శిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఏదో తీవ్ర నష్టం జరిగిపోతున్నదని చెప్పేవారు ఉంటారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే వీటిలో కొన్ని మాటలు పార్టీ నేతలు కూడా నమ్ముతుంటారు. దానివల్ల రాష్ట్రానికి సంబంధించిన కొన్ని కీలక నిర్ణయాలు సుదీర్ఘకాలం పెండింగ్‌లోనే ఉంటాయి.

నాలుగేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ పంజాబ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాలలో అధికారంలో ఉండేది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రులను మార్చాలని కాంగ్రెస్ అధిష్ఠానంపై తరుచూ ఒత్తిళ్లు వచ్చేవి. పంజాబ్‌లో అమరీందర్‌సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనపై అసమ్మతి తార స్థాయికి చేరుకుంది. రాహుల్‌గాంధీకి సన్నిహితుడుగా భావించిన నవజ్యోత్‌సింగ్ సిద్ధూ అవకాశం వచ్చినప్పుడల్లా అమరీందర్‌సింగ్‌పై తీవ్ర విమర్శలు చేసేవారు. లోక్‌సభ టిక్కెట్ల పంపిణీ నుంచి శాఖ కేటాయింపు దాకా ప్రతి అంశంలోనూ విభేదించేవారు. ముఖ్యమంత్రిని అవినీతిపరుడని నిందించేవారు. ఈ ఘర్షణ తీవ్రమై చివరకు అమరీందర్‌సింగ్ స్థానంలో ఒక దళిత ముఖ్యమంత్రిని నియమించారు. అమరీందర్ సింగ్ వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆ తర్వాత పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. ఛత్తీస్‌గఢ్‌లో 2018లో బీజేపీని గద్దెదించిన తర్వాత పీసీసీ అధ్యక్షుడు భూపేశ్ భగేల్‌ను ముఖ్యమంత్రి చేశారు. ఆయన మంత్రిమండలిలో ఆరోగ్యమంత్రి, ఒకప్పటి ప్రతిపక్ష నేత టీఎస్ సింగ్ దేవ్ సీఎం కావాలని తహతహలాడుతుండేవారు. రాష్ట్రంలో రొటేషన్ ప్రాతిపదికన ముఖ్యమంత్రిని మారుస్తామని రాహుల్ తనకు వాగ్దానం చేసినట్లు ఆయన చెప్పుకుంటుండేవారు. అలాంటిదేమీ లేదని, తానే ముఖ్యమంత్రిగా ఉంటానని భూపేష్ భగేల్ ప్రతిఘటించేవారు. ఇరు వర్గాలను కాంగ్రెస్ అధిష్ఠానం తరుచూ కలుసుకుని బుజ్జగిస్తూ ఉండేది. ప్రతిసారీ అధిష్ఠానమే అంతా నిర్ణయిస్తుందనేవారు కాని ఆ కుంపటి రగులుతూ చివరకు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయేందుకు దారి తీసింది. రాజస్థాన్‌లో కూడా ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌కూ, సచిన్ పైలట్‌కూ మధ్య బహిరంగంగానే రాజకీయ ఘర్షణ జరుగుతుండేది. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న కమల్‌నాథ్‌పై రాహుల్ సన్నిహితుడు జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు సచిన్ పైలట్‌కు ప్రేరణగా నిలిచింది. మంత్రివర్గంలో తన విధేయులను చేర్చలేదనే కినుకతో ఉన్న సచిన్‌ను బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఒక దశలో అశోక్ గెహ్లోట్‌ను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడుగా నియమించాలని ప్రయత్నం చేసినా ఆయన ముఖ్యమంత్రిగా ఉంటానని భీష్మించుకుకూర్చునే సరికి అధిష్ఠానం ఏమీ చేయలేకపోయింది. చివరకు రాజస్థాన్‌లో కూడా కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. గత ఏడాది హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అనేక మంది భావించారు. కాని కుమారి సెల్జా, రణదీప్ సింగ్ సూర్జేవాలా వర్గాలకూ, నాటి ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా వర్గానికీ మధ్య రేగిన చిచ్చు ప్రధానంగా పార్టీ అధికారంలోకి రాలేకపోవడానికి కారణమైంది.

నిజానికి భారతీయ జనతా పార్టీలో కూడా అంతర్గత తగాదాలు లేకపోలేదు. కాని దీనివల్ల పార్టీకి పెద్దగా నష్టం రాకుండా జాతీయ నాయకత్వం దృఢవైఖరితో, నిర్ణయాత్మకంగా వ్యవహరించింది. ఒకే ఒక నాయకుడో, నాయకురాలో దేశంలో పార్టీని గెలిపించడం ఎల్లవేళలా సాధ్యం కాదని, స్థానిక నాయకత్వాలు కూడా బలంగా ఉండడం అవసరమన్న విషయంపై బీజేపీలో కూడా చర్చ జరుగుతోంది.

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొదట్లో తన సన్నిహితుడైన కేవీపీ రామచంద్రరావుకు రాజ్యసభ సభ్యత్వాన్ని సాధించలేకపోయారు. తన కుమారుడికి సీటు కూడా ఇప్పించలేకపోయారు. అయితే ఆయన క్రమంగా పార్టీపై పట్టు సాధించి తాను అనుకున్నవి జరిగేలా చూసుకున్నారు. పీజేఆర్‌ను మంత్రిగా నియమించాలని సోనియా భావించినా ఆయన సున్నితంగా తిరస్కరించారు. తనపై అసమ్మతి ప్రకటించిన వి. హనుమంతరావు లాంటి వారిని ఢిల్లీ విస్మరించేలా చేశారు. పార్టీపై తన పట్టు బిగించడానికి వైఎస్‌కు చాలా కాలం పట్టింది. విచిత్రమేమంటే కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో అధికారంలో లేకపోయినా, కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితమయిపోయినా ఆ పార్టీ రాజకీయ సంస్కృతి మాత్రం మారలేదు! బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఆ రాజకీయ సంస్కృతిని ఏ విధంగా మార్చుకోవాలో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ముఖ్యంగా తాము ఎంపిక చేసుకున్న నేతల్ని తమ దగ్గర పనిచేసే ఉద్యోగుల్లా కాకుండా విశ్వాసంలోకి తీసుకుని వారికి పూర్తి అండదండలివ్వడం అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



కాంగ్రెస్ గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించలేకపోవడానికి ఆ పార్టీలో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న రాజకీయ సంస్కృతి ఒక కారణమని చెప్పక తప్పదు. పార్టీని జిల్లా స్థాయి నుంచి పటిష్ఠం చేయాలని, అభ్యర్థుల ఎంపికలో డీసీసీ అధ్యక్షులకు భాగస్వామ్యం కల్పించాలని, సామాజిక న్యాయానికి పెద్ద పీట వేయాలని రాహుల్ సంకల్పించారు. కాంగ్రెస్ పురోగతికి మౌలికంగా నష్టం కలిగిస్తున్న పార్టీ అధిష్ఠానం వ్యవహార శైలిపై ఆయన ముందుగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉన్నది.

పాపం, జగన్ ఇంకా నమ్మలేకపోతున్నారు!

జూన్ 4– ఏడాది క్రితం ఇదే రోజున తెలుగు ప్రజలు జగన్‌కు వెన్నుపోటు పొడిచిన సంగతి బైటపడింది. మూడు లక్షల కోట్లు గుమ్మరించినా ఇదే రోజున, "నువ్వెవరో మాకు తెలియదు పో" అంటూ ప్రజలు జగన్‌ను అధికారం లోంచి గెంటేశారు. అందుకే ఈ రోజును ఆయన 'వెన్నుపోటు దినం'గా పాటిస్తున్నారు. అలా పాటించాలని రాష్ట్రంలోని అన్ని వయసుల వారికి పిలుపు ఇస్తున్నారు.

సంవత్సరమైనా తెలుగువారు చేసిన ద్రోహం తాలూకు మనోవేదన జగన్‌ను వదలడం లేదు. తిన్న ఇంటి వాసాలను లెక్కపెట్టినట్టుగా తాను విదిల్చిన డబ్బుతో తిని, తాగిన జనం తనకు వెన్నుపోటు పొడవడం ఏమిటో జగన్‌కు అర్థం కావడం లేదు. ఓటర్లు తన సొమ్ము తిని తనకే వెన్నుపోటు పొడవడం వెనక చంద్రబాబు, లోకేశ్‌ల కుట్ర ఉందనీ, లేకపోతే 175కి 175 సీట్లూ వచ్చి ఉండేవని జగన్ నమ్ముతున్నారు. అందుకే ఈ కుట్రల్ని తిప్పికొట్టడానికి ఆయన పూనుకున్నారు.

"హు! ఇంత విశ్వాసఘాతం ఎక్కడైనా ఉంటుందా?" అంటూ ఆయన తీవ్ర ఆవేదనకు లోనైన సందర్భాలు అనేకం మీడియాలో కూడా వచ్చాయి. జనం డబ్బు వారి మొహాన్నే ఎంత ధారపోశారో..! ఇంతగా తినిపించి, పేకాటలు ఆడించి, పీపాలు తాగించి బదులుగా తనకు ఒక్క ఓటు ముక్క వేస్తారనుకుంటే... చివరకు ఏం చేశారు? చప్పుడు రాకుండా వెన్నుపోటు పొడిచారు. అంతకుముందు 151 సీట్లు ఇచ్చిన జనమే, 11 సీట్లు విదిల్చారు. అవసరమైనప్పుడు వదిలేసి, ప్రతిపక్షం చంకనెక్కడాన్ని మించిన 'వెన్నుపోటు' మరొకటి ఉంటుందా? "హే... ప్రభూ! ఏమిటీ దారుణం!"



ముప్పయ్ ఏళ్ళ పాటు మన 'ప్రజాసేవకు' ఎదురే లేదని మనసా వాచా కర్మణాః నమ్మిన ఈ రౌడీ షీటర్లు, కబ్జా కోరులు, రేషన్ బియ్యం దొంగలు, హంతకులు, మోసగాళ్లు, థర్డ్ రేట్ కాంట్రాక్టర్లు, పొలిటికల్ బ్రోకర్ల దురాగతాలను అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఊరూరా తిరిగి టముకు వేశారు. జగన్ పట్టించుకోలేదు. కానీ, జనం పట్టించుకున్నారు.

కలికాలం ముగింపునకు వచ్చిందా అన్నట్టు జగన్ ఎంత ఆవేదనకు లోనయ్యారో సజ్జల రామకృష్ణారెడ్డికి తెలుసు, వాళ్ళబ్బాయి చిరంజీవి సజ్జల భార్గవరెడ్డికి తెలుసు. అందుకే చంద్రబాబు నాయుడు మీద, లోకేశ్ మీద, పవన్ కళ్యాణ్ మీద అంత దుర్మార్గమైన వ్యాఖ్యానాలను భార్గవరెడ్డి సోషల్ మీడియాలో పెట్టించింది. పాపం భార్గవరెడ్డి ఆవేదనను అర్థం చేసుకోలేని సుప్రీంకోర్టు "బెయిల్ లేదు.... గియిల్ లేదు" అని కసిరి పారేసింది. ఇక జగన్ అయితే– రాజకీయాల్లో విలువలు లేకుండా పోతున్నాయని బాగా ఫీలయ్యారు. ఇంకా చాలా చాలా అన్నారు. తాను అబద్ధాలు చెప్పలేకపోవటం, అవినీతికి పాల్పడకపోవడం, ప్రజాస్వామిక పద్ధతుల్ని నమ్ముకోవడం వల్ల కూడా ప్రజలు దొంగహామీల వలలో పడి ఇటువంటి తీర్పు ఇచ్చి ఉంటారని సమాధానపడ్డారు.

అమ్మలకు, అయ్యలకు, తాతలకు, అవ్వలకు, అక్క చెల్లెమ్మలకు, మావయ్యా అని నోరారా పిలిచే మేనల్లుళ్ళకు, మేనకోడళ్లకు, ప్లీడర్లకు, ఆటోవాలాలకు, ఓటున్న ప్రతి ఒక్కరికీ ఆరారగా, వరి నారుమడి మీద నీరు చల్లినట్టు, డబ్బు పంచుతూన్నందున, తాను 30 ఏళ్ళపాటు అధికారంలో ఉంటానని జగనన్న భావించారు. ఆయన మనోగతం ఎరిగిన తెలుగు జ్యోతిష్యులు కూడా ఉగాదినాడు– జగన్ ఏకంగా 12 సంవత్సరాల 8 నెలల 15 రోజుల 11 గంటల 37 నిముషాలు ఈ రాష్ట్రాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి నిస్వార్థ సలహాలతో ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తారని పంచాంగాల సాక్షిగా వేదాశీర్వాదాలు పలికి, భారీ దక్షిణలు తీసుకొని వెళ్లిపోయారు.

ఈ భవిష్యద్దర్శనాల్ని జగనన్న ఒక్కరే కాదు, గుంటూరులో బోరుగడ్డ అనిల్ నమ్మాడు. అమరావతి ప్రాంతంలో నందిగం సురేష్ నమ్మాడు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధనరెడ్డి, ఆళ్ల నాని, కొడాలి నాని, పేర్ని నాని, అంబటి, రజని... ఇంకా చాలామంది నమ్మారు. మాచర్లకు ప్రభువుల లాంటి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బ్రదర్స్ నమ్మారు. కాకినాడలో అనంతబాబూ నమ్మాడు. ఆయన గాడ్ ఫాదరూ నమ్మారు. అలా ముప్పయ్ ఏళ్ళ పాటు మన "ప్రజాసేవకు" ఎదురేలేదని మనసా వాచా కర్మణాః నమ్మిన రౌడీలు, కబ్జా కోరులు, రేషన్ బియ్యం దొంగలు, హంతకులు, మోసగాళ్ళు, థర్డ్ రేట్ కాంట్రాక్టర్లు, పొలిటికల్ బ్రోకర్ల దురాగతాలను చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఊరూరా తిరిగి టముకు వేశారు. జగన్ పట్టించుకోలేదు. కానీ, జనం పట్టించుకున్నారు.

ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంలో విశేషానుభవం గడించిన సజ్జల రామకృష్ణారెడ్డి జనం ఇవన్నీ పట్టించుకుంటారా అంటూ "అంతరంగిక" సలహా ఏమైనా ఇచ్చారేమో తెలియదు గానీ, జగన్ మాత్రం "థర్టీ ఇయర్స్" థియరీకే ఫిక్స్ అయిపోయారు. వీళ్ళను చూసి ఆఫీసర్లూ తయారైపోయారు. "జరుగు... జరుగు..." అంటూ ఇప్పుడు వీళ్ళు కూడా వాళ్ళతో పాటు జైళ్ళ బాట పడుతున్నారు. పాపం జనం వెన్నుపోటు వల్లే కదా ఇంతమందికి ఇన్ని కష్టాలు?

ఐదేళ్ళ పాటు జగన్ పంచిన ప్రలోభాలకు లొంగి జనం విశ్వాసం చూపించి ఉంటే– చంద్రబాబు, లోకేశ్ ఇప్పుడు ఎక్కడ ఉండేవారు? రఘురామకృష్ణంరాజు పరిస్థితి ఏమిటి? కొడాలి నానికి గుండెపోటు వచ్చేదా? వల్లభనేని వంశీ వెలిసిపోయిన జుట్టుతో ఖళ్ ఖళ్ మని దగ్గుతూ బెజవాడ జైలులో ఉండేవాడా? పుంగనూరు ప్రభువులవారు గానీ, ప్రభుత్వ ప్రధాన 'సలహాదారు'లు గానీ కబ్జా చేసిన భూముల్లోకి కలెక్టర్ అయినా కన్నెత్తి చూసేవారా? ఇప్పుడు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సైతం వెళ్ళి, "ఇది ప్రభుత్వ భూమి. బీ కేర్‌ఫుల్" అంటూ బోర్డులు పాతి పెడుతున్నారు. ఫస్ట్ టర్మ్‌లో పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును ఆయన సర్వీస్‌లో చివరి ఐదేళ్ళూ అసలు ఉద్యోగంలో లేకుండా చేశారు గానీ, అరెస్ట్ చేసి జైల్లో మాత్రం పెట్టలేకపోయారు. జగన్‌కు అది తీరని కోరికగానే మిగిలిపోయింది. జనం వెన్నుపోటు పొడవకుండా ఉన్నట్టయితే, ఈ టర్మ్‌లో జగన్ కోరిక తీరేది. పిఎస్ఆర్ ఆంజనేయులుకు వెలిసిపోయిన జుట్టుతో కళావిహీనంగా బెజవాడ జైలులో ఉండవలసిన పరిస్థితి వచ్చేది కాదు. మద్యం మహా కుంభకోణం వైపు వేలెత్తి చూపించడానికి ఎవడికైనా ఎన్ని గుండెలు కావాలి!? ఇంకా ఎన్ని వేలకోట్లు పోగడిపోయేవి!?

అందుకే, తనకు జనం వెన్నుపోటు పొడిచే విధంగా వెనుక నుంచి కుట్ర పన్నిన నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ నడుపుతున్న "అప్రజాస్వామిక" రాజకీయాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేసి, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని జగన్ "పిలుపు" ఇచ్చారు. ఇక, ఆ తరువాత జనం దయ, జగన్ ప్రాప్తం!

• భోగాది వేంకటరాయుడు
సీనియర్ జర్నలిస్ట్

వెన్నుపోట్ల పితామహుడు జగన్‌రెడ్డే!

నోటికి వచ్చినట్లు అబద్ధాలు చెప్పడం, వెన్నుపోటు రాజకీయాలు చెయ్యడం జగన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబుది వెన్నుపోటు అంటూ వెకిలి విమర్శలు చెయ్యడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. చంద్రబాబుది వెన్నుపోటు కాదు, దుష్ట శక్తి నుంచి పార్టీని రక్షించుకోవడం. కుటుంబ సభ్యులు, మెజారిటీ శాసనసభ్యులు కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఆనాడు ఎన్నుకున్నారు. పార్టీ యంత్రాంగం–ప్రజలు ఆ నిర్ణయాన్ని అంగీకరించి, 1999 ఎన్నికల్లో మళ్లీ తెలుగుదేశం పార్టీని గెలిపించారు. అయినా దానిని వెన్నుపోటుగా చిత్రించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నాడు జగన్‌రెడ్డి.

మహాభారతంలో పౌండ్రక వాసుదేవుడు అనే ఒక క్యారెక్టర్ ఉంది. అందులో తానే అసలైన శ్రీకృష్ణుడిని అని భావిస్తూ అవే వేష భాషలతో ప్రజలను నమ్మించడానికి ఆయన ప్రయత్నించేవారు. నేడు ఆధునిక భారతంలో కూడా జగన్ వంటి వాళ్లను పౌండ్రక వాసుదేవుడుగా పరిగణించాల్సి ఉంటుంది. అయితే ఎవరు అసలైన శ్రీకృష్ణుడో, ఎవరు నకిలీనో ప్రజలు తెలుసుకోవాలి. విషాదం ఏమిటంటే గంజాయి మొక్కలను చూసి తులసి మొక్కలు తలదించుకోవాల్సి దుస్థితి జగన్ పాలనలో నెలకొన్నది.

జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా ప్రకటించిన జగన్‌రెడ్డి, ప్రజల తరఫున అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలడా? తండ్రి హెలికాప్టర్ ప్రమాదంలో దారుణంగా దుర్మరణం చెందితే, కనీసం ప్రమాదస్థలికి వెళ్ళి భౌతికకాయాన్ని తీసుకురావడానికి ప్రయత్నించకుండా తాను ముఖ్యమంత్రి కావడానికి ఎమ్మెల్యేలతో సంతకాల సేకరణకి శ్రీకారం చుట్టిన జగన్, తాను ఏదో పులు కడిగిన ముత్యంలా ఇతరులను వెన్నుపోటుదారులుగా చిత్రించడానికి సిగ్గు అనిపించడం లేదా? రాజశేఖరరెడ్డి మరణానంతరం జగన్‌ను వెంటనే సీఎం చేయడానికి ఒప్పుకోకుండా రోశయ్యను ముఖ్యమంత్రిగా నియమించింది కాంగ్రెస్ పార్టీ. తనకి ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని రోశయ్యకి సహకరించకుండా నానా ఇబ్బందులు పెట్టారు. శాంతిభద్రతలు అస్థిరం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ధర్నాలు, ర్యాలీలు చేశారు. జగన్ మీడియా సాక్షి టీవీ, పత్రిక ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తూ తప్పుడు కథనాలు రాసి ప్రభుత్వాన్ని బదనాం చేసి, రోశయ్యకు వెన్నుపోటు పొడవలేదా? తర్వాత కాంగ్రెస్ పార్టీ కిరణ్‌కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించింది. దీంతో ఆయన ప్రభుత్వంపై ఘర్షణాత్మక వైఖరి తీసుకుని, ప్రభుత్వ విధానాలను బహిరంగంగా విమర్శించారు. ఆ సమయంలో జగన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని బహిరంగంగా ఎదిరించారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలలో తనకు న్యాయం జరగలేదని భావించి, తనకి సోనియాగాంధీ ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని కోపంతో 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారు. అది కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడవటం కాదా? ఏ సిద్ధాంతంపై విభేదించి కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి కొత్త పార్టీ పెట్టారు? తండ్రి ముఖ్యమంత్రిగా ఉండబట్టే కదా, ఆ అధికారాన్ని అడ్డం పెట్టుకొని వేల కోట్ల రూపాయలు ప్రజాధనం దోపిడీ చేసి, ఆ సొమ్ముతోనే కాదా రాజకీయ పార్టీని స్థాపించింది?

జగన్ అధికారం కోసం ఆడే జగన్నాటకాలు అన్నీ దోచుకొన్న డబ్బును కాపాడుకోవడానికి, అక్రమాలు అన్నీ సక్రమం చేసుకోవడానికి తప్ప, ప్రజల కోసం మాత్రం కాదు. రాష్ట్ర విభజన సమయంలో తెలుగుదేశం పార్టీ రెండు తెలుగు రాష్ట్రాలకు సమన్యాయం చెయ్యాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇచ్చింది. అయితే జగన్‌రెడ్డి– తెలంగాణ అంశంలో బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీగా మేము మా వైఖరిని తెలియజేస్తున్నాము. 2011, జూలై 8–9 తేదీలలో జరిగిన మా పార్టీ మొదటి ప్లీనరీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం... తెలంగాణ ప్రజల మనోభావాలను పార్టీ గౌరవిస్తుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ని ఉపయోగించి రాష్ట్రాన్ని విభజించమని ఎం.వి. మైసురారెడ్డి, కె.కె. మహేందర్‌రెడ్డి ద్వారా కేంద్రానికి లేఖ పంపి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు జగన్‌రెడ్డి. అది తెలుసుకొన్న ప్రజలు జగన్‌రెడ్డిని 2014 ఎన్నికల్లో ఓడించారు.

విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అగమ్యగోచరంగా మారిన అత్యంత కీలక తరుణంలో ప్రజలు తమను ఒడ్డుకు చేర్చే బాధ్యతను సమర్థ నాయకుడు చంద్రబాబుకే అప్పగించారు. బాబు ఐదేళ్ల పాలనలో నవ్యాంధ్ర అద్భుత ప్రగతి సాధించింది. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను దేశం ముందు నిలిపారు చంద్రబాబు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా సంక్షేమ పథకాల అమలులో దేశంలో ఆంధ్రప్రదేశ్‌ని ఆదర్శంగా నిలిపారు. ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి నిర్ణయాలు చేయాల్సిన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి, తన బాధ్యతను విస్మరించి అసెంబ్లీకి వెన్నుపోటు పొడిచారు జగన్‌రెడ్డి. సొంత బాబాయి వివేకానందరెడ్డి గొడ్డలి పోటు హత్య వెనుక జగన్ ఉన్నాడని జనం అనుకొంటున్నారు. బాబాయి మరణం గుండెపోటు వల్ల అని వారిని నమ్మించే ప్రయత్నం చేశారు. ఆస్తులు పంపకం విషయంలో సొంత చెల్లిని, తల్లిని కూడా బయటకు గెంటి, వారికి వెన్నుపోటు పొడిచాడు. ఎన్నికల్లో తల్లిని, చెల్లిని ఉపయోగించుకొని తర్వాత బయటికి గెంటివెయ్యడం వెన్నుపోటు కాదా? సొంత చెల్లి షర్మిల పైకి తన ఉన్మాద మూకను ఉసిగొల్పి, నీచ రాజకీయాలు చేయలేదా?

సెప్టెంబర్ 4, 2014న అసెంబ్లీ ఏకగ్రీవంగా అమరావతిని రాజధానిగా అంగీకరిస్తూ అన్నీ రాజకీయపక్షాల మద్దతుతో అసెంబ్లీలో తీర్మానం చేసింది అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం. 'రాజధాని రాష్ట్రానికి నడిబొడ్డున ఉండాలి, కనీసం 30వేల ఎకరాలు కావాలి, 13 జిల్లాల చిన్న రాష్ట్రం కాబట్టి ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టడం ఇష్టంలేక అమరావతి రాజధానిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా... అంటూ రాష్ట్రానికి మధ్యలో ఉండేలా చూడండని, విజయవాడ పరిసర ప్రాంతాల్లో రాజధాని నిర్మాణాన్ని తానెప్పుడూ వ్యతిరేకించలేద'ని అప్పటి ప్రతిపక్ష నేతగా జగన్ చెప్పలేదా?

2019లో అబద్ధాలను పదేపదే వల్లెవేసి అవే నిజాలుగా జనాన్ని నమ్మించి అధికారంలోకి వచ్చి, రాజధానిపై తాను చెప్పిన దానికి విరుద్ధంగా, మూడు రాజధానులు అంటూ కొత్త పల్లవిని అందుకున్నాడు. విద్వేష రాజకీయాలతో ప్రాంతాల మధ్య వైషమ్యాలను ఎగదోశాడు. అమరావతి ముంపు ప్రాంతమని, ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా అవినీతి జరిగిందని, అమరావతి శ్మశానం, ఎడారి అని అబద్ధాలు, అర్ధసత్యాలు, అభాండాలతో, రాజకీయ నాటకాలు ప్రదర్శించి, అమరావతికి రెక్కలు విరిచాడు. అభివృద్ధిని అడ్డుకొని, విధ్వంసం చేసి, రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచాడు. ఇప్పుడు ఏమీ ఎరగనట్టు జనం ముందుకొచ్చి శ్రీరంగనీతులు చెబుతున్నాడు. తన పాత కాలూ, ఘాతుకాల పట్ల పశ్చాత్తాప పడకుండా ఏదో జరిగిపోతున్నట్లు కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నాడు.

ఐదేళ్ల జగన్ పాలనను ఒక పీడకలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. తన ఉనికి కాపాడుకోవడానికి జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినం అంటూ విన్యాసాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు నేను ఉన్నాను, నేను విన్నాను అంటూ అనేక ఆచరణ ఎరుగని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి అన్ని పథకాలకు కోతలు పెట్టి, అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్. ముందు ఆయన పొడిచిన వెన్నుపోట్లకు సమాధానం చెప్పాలి. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైసీపీకి 11 సీట్లిచ్చి ఇంట్లో కూర్చోబెట్టినా, జగన్ పద్ధతుల్లో వీసమెత్తు మార్పు రాలేదు.

జగన్ పాలనను ఒక పీడకలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. తన ఉనికి కాపాడుకోవడానికి జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినం అంటూ విన్యాసాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు నేను ఉన్నాను, నేను విన్నాను అంటూ అనేక ఆచరణ ఎరుగని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి, అన్ని పథకాలకు కోతలు పెట్టి, అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్. ముందు ఆయన పొడిచిన వెన్నుపోట్లకు సమాధానం చెప్పాలి.



■ యనమల రామకృష్ణుడు
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





కృష్ణానదిలో నిల్వ ఉంచిన మాంసాహార వ్యర్థాలు

ప్రజారోగ్యంతో చెలగాటం!

మాంసం వ్యర్థాల రవాణాకు నగరం కేంద్రంగా మారుతోంది. రామలింగేశ్వరనగర్ కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో కొందరు అక్రమార్కులు కార్పొరేషన్ శానిటరీ విభాగంలోని పలువురి కనుసన్నల్లో అక్రమంగా మాంసం వ్యర్థాలను నిల్వ చేస్తున్నారు. కంటెయినర్లు, డ్రమ్ముల్లో ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు గుట్టుగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లోని కొందరు చేపల చెరువుల యజమానులు, పందుల పెంపకందారులు వీటిని కొనుగోలు చేసి మేతగా వి నియోగిస్తున్నారు. ప్రజల ఆరో గ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

కృష్ణానదిలో గుట్టుగా మాంసాహార వ్యర్థాల నిల్వలు

మాంసం వ్యర్థాలు, మాంసాహార వ్యర్థాలుగా గ్రేడింగ్

- కంటెయినర్లు, డ్రమ్ముల్లో ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు రవాణా
- చేపల చెరువులతో పాటు పందుల పెంపకానికి వినియోగం
- కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖలోని కొందరు అవినీతి అధికారుల అండదండలతో వ్యాపారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/రామలింగేశ్వరనగర్): విజయవాడ నగరంలోని మాంసం దుకాణాలు, క్యాటరింగ్, రెస్టారెంట్స్, హోటల్స్ నుంచి సేకరించిన నాన్‌వెజ్ ఫుడ్ వేస్ట్‌ను కృష్ణానదిలో భారీ ఎత్తున నిల్వ చేస్తున్నారు. నగరంలో ఇళ్ల మధ్య నిల్వ చేస్తే వాసన వస్తుందన్న ఉద్దేశ్యంతో అక్రమార్కులు తెలివిగా కృష్ణానదిని ఎంపిక చేసుకున్నారు. రామలింగేశ్వరనగర్ కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో డంపింగ్ యార్డు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఉన్న చోటును ప్రత్యేకంగా సిద్ధం చేసుకున్నారు. చేపల వ్యర్థాలు, నాన్‌వెజ్ వేస్ట్ ఫుడ్ కూడా ఇక్కడే నిల్వ చేస్తున్నారు. కంటెయినర్లు, డ్రమ్ములను పెట్టి మాంసం వ్యర్థాలు, మాంసాహార వ్యర్థాలను వేరు చేస్తున్నారు. మాంసం వ్యర్థాలు, మాంసాహార వ్యర్థాలను గుర్తు తెలియని చోట అక్రమార్కులు వేయించి (ఫ్రై) తీసుకువస్తున్నారు. వీటిని వేయించటం ద్వారా ఎక్కువ రోజులు నిల్వ ఉండటానికి అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఇలా వేయించిన మాంసం వ్యర్థాలు, మాంసాహార వ్యర్థాలను వేర్వేరుగా కంటెయినర్లు, ప్లాస్టిక్ డ్రమ్ములలో నిల్వ చేస్తున్నారు. ఇలా నిల్వ చేసిన వ్యర్థాలను మ్యాక్సీ ట్రక్కులలోకి లోడింగ్ చేసి బయటకు తరలిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు, కృష్ణాజిల్లాలోని చేపల చెరువుల యజమానులకు ఈ వ్యర్థాలను ఎగుమతి చేస్తున్నారు. చేపలకు సాధారణ ఫీడ్ ఇస్తే ఆరు నెలల వరకు పెరగటానికి అవకాశం ఉండదు. అదే మాంసాహార వ్యర్థాలను ఇవ్వటం ద్వారా అవి మూడు నెలలకే ఎదిగిపోతాయి. అంటే సంవత్సరంలో రెండు సార్లు చేతికి వచ్చే చేపలు.. ఈ వ్యర్థాల వల్ల ఏడాదికి నాలుగు సార్లు దిగుబడిని ఇస్తాయి. ఈ వ్యర్థాలను తిన్న చేపలు బరువు పెరిగి త్వరగా వేటకు వస్తాయి. ఈ చేపలను తిన్న ప్రజలకు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి.



తక్కువ ధర.. త్వరగా బరువు

సాధారణ సంప్రదాయ చేపల ఫీడ్ కంటే కూడా 60 శాతం పైగా తక్కువ ఖర్చుకే మాంసం, మాంసాహార వ్యర్థాలు లభిస్తున్నాయి. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఇది తప్పని తెలిసినా డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. కృష్ణానదిలో ఏకంగా అక్రమ వ్యాపార దందాకు శ్రీకారం చుట్టారు. విజయవాడ నగరంలోని మాంసం దుకాణాల నుంచి వ్యర్థాలను అక్రమ ముఠా గ్యాంగ్ సేకరిస్తుంది. అలాగే నగరంలోని నాన్‌వెజ్ మిగతా 6లో..

ప్రజారోగ్యశాఖ ఉద్యోగుల

కనుసన్నల్లోనే..

రామలింగేశ్వరనగర్ కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ఈ వ్యవహారాలు కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అధికారులకు కూడా తెలుసునని సమాచారం. తూర్పు ప్రాంతంలోని పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఇక్కడి వ్యవహారంతో సంబంధం ఉందని తెలుస్తోంది. ఈ ప్రాంతంలో మాంసం వ్యర్థాలను నిల్వ ఉంచినందుకు అక్రమార్కుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నట్టు సమాచారం. క్షేత్ర స్థాయి పరిశీలన సందర్భంలో పలువురు శానిటరీ సిబ్బంది వ్యర్థాల వద్ద ఉండటం ఈ అనుమానాలను మరింతగా బలపరుస్తోంది.

ఇక ఎలక్ట్రిక్ బస్సులు!

విద్యాధరపురం డిపోకు 100 బస్సుల కేటాయింపు

- జూలైలో విజయవాడకు రానున్న సర్వీసులు
- ఈ నెల 18 నుంచి 26 వరకు సీనియర్ డ్రైవర్లకు హైదరాబాద్‌లో శిక్షణ



ఈకేఏ ఎలక్ట్రిక్ బస్సు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు మరో నెలన్నర రోజుల్లో ఆర్టీసీకి రాబోతున్నాయి. ఈకేఏ గ్రీన్ మొబిలిటీ సంస్థ ద్వారా రూపుదిద్దుకున్న ఎలక్ట్రిక్ బస్సులు ప్రస్తుతం బాడీ బిల్డింగ్‌ను పూర్తి చేసుకుంటున్నాయి. జూలై రెండు లేక మూడో వారంలో ఆర్టీసీకి ఈ బస్సులు రానున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు పలుమార్లు బాడీ బిల్డింగ్ పనులను పరిశీలించారు. వీటిని నడిపేందుకు డ్రైవర్లను సన్నద్ధం చేస్తున్నారు. పీఎం ఈ-బస్ పథకంలో భాగంగా విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో అతి త్వరలో 100 ఎలక్ట్రిక్ బస్సులు నడవనున్నాయి. ఈ బస్సులన్నీ కూడా విద్యాధరపురం బస్ డిపోకు కేటాయించారు. ఈ బస్సులు వచ్చే లోపు ఆ డిపో డ్రైవర్లకు డ్రైవింగ్ శిక్షణ ఇప్పించాలని అధికారులు మిగతా 6లో..

మసులా 2కె రన్ జోష్



6

మంగినపూడిలో ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న మసులా బీచ్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని మచిలీపట్నంలో మంగళవారం 2కె రన్ నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, సినీ నటులు నారా రోహిత్, మంచు మనోజ్, డైరెక్టర్ కనకమేడల విజయ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు తదితరులు ఉత్సాహంగా పాల్గొని యువతలో స్ఫూర్తిని నింపారు. మసులా బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం.. బందరు ప్రాభవాన్ని దేశం నలుమూలల చాటి చెబుదాం అంటూ నినదించారు.

- ముచ్చింతాలకు చెందిన రైతు మగినం లక్ష్మణుడికి మూడు ఎకరాల పొలం ఉంది. మునేటి వరదకు 20 సెంట్లలో 15 అడుగుల లోతైన పెద్ద గొయ్యి పడింది. మిగతా పొలంలో ఇసుక మేట వేసింది. తన పొలంతో పాటుగా సమీప పొలాల్లోని ఇసుక తొలగించి గొయ్యిని పూడ్పించాడు. ఇందుకు అక్షరాల రూ.4.35 లక్షలు ఖర్చు అయింది. ప్రభుత్వం నుంచి పంట నష్టం ఎకరాకు రూ. పది వేలు తప్పితే ఇతరత్రా ఎలాంటి సాయమందలేదు.
- ముచ్చింతాలకు చెందిన మరో రైతు మగినం రామారావుకు 2.5 ఎకరాల పొలం ఉంది. కొంత పొలంలో పెద్ద గొయ్యి పడింది. మిగతా పొలం ఇసుక మేట వేసింది. తువ్వకాల్వకు పడిన గండ్లు పూడ్చకుండా, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పొలంలో ఇసుక తొలగించి, గొయ్యిని పూడ్పించటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మునేటికి ఒక మాదిరి వరద వచ్చినా భూములపై పడుతుంది. దీంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆయన దెబ్బతిన్న పొలాన్ని చూస్తూ కన్నీళ్లు పెడుతున్నాడు.
- మునేటి వరద దెబ్బకు కుదేలైన రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. రెండు పంటలు పండే మాగాణి భూములు చిన్నాభిన్నమయ్యాయి. పొలాల్లో పడిన గోతులను పూడ్చలేదు. ఇసుకను ఇంకా తొలగించలేదు. మునేటి నీటిని అందించే ప్రధానమైన తువ్వకాల్వకు పడిన గండ్లను సైతం అలాగే వదిలేశారు. గత ఏడాది ఖరీఫ్ పంట వరదపాలు కాగా, ఈ ఏడాది పంట సాగు చేసే పరిస్థితి లేదు.

భూములన్నీ ఎడారే!

మునేరు వరదతో పంట పొలాల్లో ఇసుక మేటలు, భారీ గోతులు



మునేరు పక్కన ఉన్న పంట భూముల్లో మేట వేసిన ఇసుక

- ఇసుక తిన్నెల్లా ఆరు గ్రామాల్లోని పంట భూములు
- నేటికీ పూడ్చని గోతులు, తొలగించని ఇసుక మేటలు
- తువ్వ కాలువకు పడిన గండ్లు పూడ్చడంలో అధికారుల నిర్లక్ష్యం
- మళ్లీ వర్షాలు వచ్చేస్తున్నాయని రైతుల్లో పెరుగుతున్న ఆందోళన

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల /పెనుగంచిప్రోలు): మునేటికి సమీపంలో ఉన్న వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేమవరం (రేకులగడ్డ), పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల పరిధిలో విలువైన మాగాణి భూములు ఉన్నాయి. తువ్వ నేల కావటంతో మాగాణి వరి పంట పుష్కలంగా పండుతుంది. వ్యవసాయ పంపు సెట్లు కూడా ఉండటంతో రైతులు రెండు పంటలు పండిస్తున్నారు. ముఖ్యంగా ఈ భూములకు తువ్వకాల్వ ద్వారా మునేటి నీరు అందుతుంది. ఆళ్లూరుపాడు నుంచి ప్రారంభమయ్యే తువ్వకాల్వ మునేటికి ఆనుకుని, సమాంతరంగా ఉంటుంది. గత ఏడాది ఆగస్టు చివరి వారం, సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు మునేరు ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రం వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి గతంలో ఎన్నడూ లేనంతగా 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా మిగతా 6లో..

కాలువల్లో పనులు చేశాకే..

సాగునీరు విడుదల చేయాలి

- పంట కాలువలు, బుడమేరు గండ్లు పూడ్చకుంటే సాగు ప్రశ్నార్థకమే!
- డ్రెయిన్లలో పూడిక తీయకుంటే పంటలు మునిగిపోవడం ఖాయం
- సాగునీటి సలహామండలి సమావేశంలో ఎమ్మెల్యేలు, సాగునీటి సంఘాల అధ్యక్షులు
- 10న సాగునీరు విడుదల చేసే అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని నిర్ణయం



సాగునీటి సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, వేదికపై ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : "పంట కాలువల్లో, డ్రెయినేజీల్లో గుర్రపు డెక్క, నాచు, కిక్కిస, తూడు పెరిగిపోయాయి. కాలువల్లో ఇప్పటి వరకు పూడికతీత, కాలువల నిర్వహణ (ఓఅండ్ఎం) పనులు ప్రారంభించనేలేదు. ఇలాంటి స్థితిలో కృష్ణాడెల్టాకు సాగునీరు విడుదల చేస్తే అన్ని ప్రాంతాలకు సకాలంలో నీరు చేరదు. కాలువల్లో పనులు చేశాకే సాగు నీటిని విడుదల చేయాలి" అంటూ జిల్లాలోని ఎమ్మెల్యేలు, సాగు నీటి సంఘాల అధ్యక్షులు డిమాండ్ చేశారు. మంగళవారం జెడ్పీ సమావేశపు హాలులో 42వ సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. గన్నవరం, పామర్రు, మిగతా 6లో..

ఏసీబీ వలలో చిక్కిన అటవీశాఖ అధికారి

టింబర్ డిపో లైసెన్సు రెన్యువల్‌కు రూ.18 వేలు డిమాండ్

లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం): టింబర్ డిపో లైసెన్స్ రెన్యువల్ చేసేందుకు రూ.18 వేలు లంచం తీసుకుంటూ అటవీశాఖ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ బి.వి .సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నానికి చెందిన వనం రవీంద్రనాథ్ మచిలీపట్నంలో శ్రీజ టింబర్ డిపో నడుపుతున్నారు. ఈ టింబర్ డిపో లైసెన్స్ గడువు ముగియడంతో రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జి.జయప్రకాష్ చుట్టూ రెండు నెలలుగా తిరుగుతున్నారు. ఈ క్రమంలో జయప్రకాష్ రూ.25వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో చివరకు రూ.18వేలు ఇస్తే టింబర్ డిపో లైసెన్స్‌ను పునరుద్ధరిస్తామని అటవీశాఖ అధికారి బేరం కుదుర్చుకున్నారు.



ఏసీబీకి పట్టుబడిన అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జి.జయప్రకాష్

లంచం ఇవ్వటం ఇష్టంలేని రవీంద్రనాథ్ ఈ విషయంపై ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ బి.వి.సుబ్బారావుతోపాటు మరో 15 మంది సిబ్బంది మంగళవారం మిగతా 6లో..

చిక్కిన చైన్ స్నాచర్లు!

- నిందితుల్లో రౌడీషీటర్, విద్యార్థి
- పరారీలో మరో ఇద్దరు యువకులు
- నున్న ప్రాంతానికి చెందిన వారిగా గుర్తింపు
- గొలుసు చోరీలకు ముందు బైక్ చోరీ

8

సమస్యలను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తా : ఎంపీ చిన్ని

8

మోడల్ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దుదాం : కలెక్టర్



కొండపల్లి రైల్వేస్టేషన్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

» రాయనపాడులో మరిన్ని రైళ్లు అగేలా చర్యలు

» త్వరలో మూడు ఆర్వోబీల నిర్మాణ పనులు ప్రారంభం

» ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నుంచి అభివృద్ధికి నోచుకోని కొండపల్లి రైల్వేస్టేషన్ శాటిలైట్ స్టేషన్ అవ్వాలనే ఈప్రాంత వాసుల చిరకాల స్వప్నం త్వరలో నెరవేరుతుందని, రాయనపాడు స్టేషన్‌లో మరిన్ని రైళ్ల ఆగేలా చర్యలు తీసుకోవడంతో పాటు రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, కూటమి నేతలతో కలిసి మంగళవారం ఆయన కొండపల్లి, రాయనపాడు స్టేషన్లు, గొల్లపూడి, కొండపల్లిలో ఆర్వోబీలు ఏర్పాటు చేయనున్న డ్రెయిన్ల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, విజయవాడ స్టేషన్‌లో రద్దీ నియంత్రించేందుకు రాయనపాడు స్టేషన్‌ను అమృత్‌భారత్ కింద రూ.12.13 కోట్లతో శాటిలైట్ స్టేషన్‌గా తీర్చిదిద్దుకుందని, త్వరలో స్టేషన్ ప్రారంభిస్తారన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, కొండపల్లి స్టేషన్ కల కూడా సాకారం చేస్తామన్నారు. స్టేషన్ అభివృద్ధి చేస్తే ఖిల్లా పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. త్వరలో కొండపల్లి, ఈలప్రోలు ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. స్టేషన్ అభివృద్ధిపై నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. కూటమి నేతలు జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, చుట్టుకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

విజయవాడ డివిజన్‌కు ఐఎస్‌వో గుర్తింపు

రైల్వేస్టేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ ట్రాక్షన్ పంపిణీ విభాగానికి ప్రతిష్టాత్మక ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికేషన్ లభించింది. భారతీయ రైల్వేలో తొలిసారిగా ఈ సర్టిఫికెట్‌ను దక్కించుకున్న డివిజన్‌గా విజయవాడ నిలిచింది. ఈ మేరకు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తమ డివిజన్‌కు క్వాలిటీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ లభించటం ఎంతో గర్వకారణమన్నారు. సేవలు, నాణ్యతకుగాను సమగ్ర ఆడిటింగ్ తరువాత క్యూఆర్‌వో సర్టిఫికేషన్ హైదరాబాద్‌లోని హర్ష టెక్నాలజీ ద్వారా జారీ చేయబడిందన్నారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్ దినేష్ రెడ్డి, డిపార్టుమెంట్ బృందానికి డీఆర్ఎం అభినందనలు తెలిపారు.

చర్లపల్లి-రామనాథపురం ప్రత్యేక రైలు పొడిగింపు

రైల్వేస్టేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీ నిమిత్తం దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి-రామనాథపురం మధ్య ప్రత్యేక రైలును కొంతకాలం పొడిగిస్తున్నట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07695 చర్లపల్లి-రామనాథపురం రైలు ప్రతి బుధవారం ఈనెల 11 నుంచి 25వరకు కొనసాగుతుంది. 07696 రామనాథపురం-చర్లపల్లి ప్రతి శుక్రవారం ఈనెల 13 నుంచి 27వరకు కొనసాగుతుంది. ఇవి నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై, ఎగ్మోర్, చెంగల్‌పట్టు, విల్లుపురం, తిరుప్పదిరిపుల్లియార్, చిదంబరం, శిర్గాసి, మైలాదుతురై, తిరువాయూర్, తిరుతరైపూండి, అబిరామపట్టణం, పత్తుకొట్టై, అరంతంగి, కరైకుడి, శివగంగ, మన్నదురై స్టేషన్‌లలో ఆగుతాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్‌లు అనుసంధానించబడతాయి.

రేపట్నుంచి ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

భారతీనగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు గురువారం నుంచి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులు మినహా ఇతర కేటగిరీల వారు రూ.60 డిపాజిట్ చెల్లించాలని, ప్రైవేట్ ఐటీఐలో చేరే అభ్యర్థులు వారి నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కౌన్సిలింగ్ తేదీ అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. మెరిట్ నంబరు కోసం విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐలోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468లో సంప్రదించాలన్నారు.

యోగాతో నూతనోత్సాహం : లక్ష్మీశ



సత్యనారాయణపురం: కార్మికులకు యోగాసనాలు దివ్య ఔషధమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆయుష్ శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో కార్మికులతో థీమ్ యోగా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లక్ష్మీశ కార్మికులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం శారీరక శ్రమతో సతమతమయ్యే కార్మికులు యోగాసనాలు వెయ్యడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చేకూరి, ఉత్సాహంగా పనిచేసేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపకార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డిఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆయుష్ వైద్యాధికారులు వి.రాణి, రామతేజ, రత్నప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ : జేసీ

కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అత్యంత పారదర్శకంగా కార్డుదారులకు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయడం జరుగుతోందని, దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు దుకాణాలకు రావొద్దని, వారి ఇళ్లకే డీలర్లు వచ్చి సరుకులు అందచేస్తారని జేసీ ఎస్.ఇలక్కియ అన్నారు. మంగళవారం సీతారాంపురం ఎల్‌వీ శాస్త్రి వీధిలోని వృద్ధుడి ఇంటికే డీలర్లు వెళ్లి సరుకులు అందించే ప్రక్రియలో జేసీ పాల్గొన్నారు. అనంతరం 225 నంబరు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. డిస్‌ప్లే బోర్డులు, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ ఇచ్చేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా కార్డుదారులకు సరుకులు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని, దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు 5వ తేదీలోగానే ఇళ్ల వద్దనే రేషన్ అందించడం జరుగుతుందన్నారు.







మంగినపూడి బీచ్ ఫెస్టివల్‌కు సిద్ధమవుతున్న కళాకృతులు

అందరి చూపు బందరు వైపు..



జాతీయ స్థాయి ఉత్సవంలా మసులా ఫెస్ట్, బీచ్ ఫెస్టివల్‌కు రానున్న 15 లక్షల మంది పర్యాటకులు.. 25 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మసూలా బీచ్ ఫెస్టివల్ 2025 జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మంగినపూడి బీచ్‌ని మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదతరులతో కలిసి సందర్శించారు. జలక్రీడలను పర్యవేక్షించారు. గుర్రపుస్వారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, 2018 అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రెట్టించిన ఉత్సాహంతో 5వ తేదీ నుంచి బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఫెస్టివల్‌లో 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, బీచ్‌కబడ్డీ, వాలీబాల్, జలక్రీడల్లో పాల్గొంటారన్నారు. కొలంబస్, జెయింట్ వీల్ పిల్లలకు ఏర్పాటు చేశామన్నారు. సాహసక్రీడల్లో భాగంగా హెలీ రైడింగ్, ప్యారాగ్లైడింగ్, బోటింగ్ ఏర్పాటు చేశామన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ, రోల్డ్‌గోల్డ్ నగలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల రుచులతో ఏడు జోన్లలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుచేశామన్నారు. 80 అడుగుల అమరావతి ఐకానిక్ నిర్మాణం, అసెంబ్లీ టవర్‌లు పర్యాటకులకు కనువిందు చేస్తాయన్నారు. వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. కొనకళ్ల మాట్లాడుతూ, 2018లో ఉత్సవాలలో 10 లక్షల మంది పాల్గొన్నారని, ఇప్పుడు 15 లక్షల వరకు వస్తారన్నారు. మంగినపూడి బీచ్‌ని పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఆకట్టుకునేలా వివిధ కళాఖండాలు

మంగినపూడి బీచ్ కళాఖండాలతో నిండిపోయింది. చేపలు, తిమింగలాలు, పీతలతో పాటు డాల్ఫిన్ ఆకృతులు ఏర్పాటు చేశారు. లక్షలాది సందర్శకులు రానున్న నేపథ్యంలో బీచ్‌లో అమరావతి గేట్‌వే ఆకృతిని కళాకారులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

50 మంది సినీ కళాకారులతో నెలరోజులుగా పనులు



వంకా రమణ, ఆర్ట్ డైరెక్టర్

మంగినపూడి బీచ్‌లో నెలరోజులుగా 150 మంది కళాకారులు పనిచేస్తున్నారు. అపురూపమైన కళాఖండాలు తయారుచేశారు. అమరావతి గేట్‌వే పర్యాటకులను ఆకట్టుకుంటుంది. జాతీయస్థాయిలో నిలిచిపోయేలా కార్యక్రమం నిర్వహిస్తున్నాం.



» 2కె రన్‌లో మంత్రి కొల్లు రవీంద్ర

» హాజరైన సినీనటులు నారా లోహిత్, మంచు మనోజ్ తదితరులు



గుర్రాలపై స్వారీ చేస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మసూలా బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా కోనేరుసెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు జరిగిన 2కె రన్‌లో మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో పాటు సినీనటులు నారా రోహిత్, మంచు మనోజ్, డైరెక్టర్ కనకమేడల విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, సినీనటులను తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, మంగినపూడి బీచ్ ఫెస్టివల్ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే విధంగా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్, అమరావతికి దగ్గరగా, పర్యాటకులకు అనుకూలంగా ఉండే మంగినపూడి బీచ్‌ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, బీచ్ అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. 2కె రన్‌లో భాగంగా మత్స్యకార కళాకారులతో కలిసి మంత్రి రవీంద్ర ఉత్సాహంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, పాటు మెప్మా పిడి సాయిబాబు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, మాదివాడ రాము, తలారి సోమశేఖర్, గోపు సత్యనారాయణ, లోగిశెట్టి వెంకటస్వామి, కాగిత వెంకటేశ్వరరావు, పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

» రైతు సేవాసంస్థ అధ్యక్షుడు భవానీ ప్రసాద్

మిగులు జలాల విషయంలో
రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మిగులు జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని రైతు సేవాసంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీ ప్రసాద్ అన్నారు. సోమవారం బనకచర్ల రైతు సంఘాల నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గోదావరి-బనకచర్ల ఎత్తిపోతల పథకం విషయంలో ప్రభుత్వం మంచీ, చెడు ఆలోచించాలన్నారు. చిన్నస్థాయి నీటి పారుదల వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను నిశితంగా పరిశీలించి తమ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనతో సామాజిక ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కృష్ణానదిలో 75శాతం నీటి పంపకం విషయంలో బచావత్ ట్రిబ్యునల్ తీర్పును బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ యధాతథంగా ఆమోదించడంతో రాష్ట్రానికి న్యాయం జరిగినా.. మిగులు జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ హక్కులు ప్రమాదంలో పడ్డాయని, దీనిపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా వాదనలు వినిపించి హక్కులను పరిరక్షించాలని కోరారు. వంశధార నదీ జలాల వివాదంపై ట్రిబ్యునల్ రాష్ట్రానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని, ఈ తీర్పుపై ఒడిస్సా సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందని తెలిపారు. వంశధార సమస్యతో పాటు పొరుగు రాష్ట్రాలతో నీటి వివాదాలు, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణం దృష్టి సారించాలన్నారు. విశ్రాంత ఇంజనీర్ కంభంపాటి పాపారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల పథకంలో భాగంగా పోలవరం నుంచి కృష్ణానదికి నీరు తీసుకురావడం వల్ల ప్రతి సంవత్సరం బుడమేరకు వరద వచ్చే ప్రమాదముందన్నారు. పోలవరం నుంచి తరలించే నీటిని కృష్ణా నదిని దాటించి తీసుకెళ్తే బుడమేరుకు వరద రాకుండా నివారించవచ్చన్నారు. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందించడం వల్ల భవిష్యత్తులో రాజధాని నగరానికి తాగునీరు అవసరాలకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. పోలవరం ఎత్తుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ప్రస్తావించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందని, అలాగే పోలవరం నిర్వాసితుల పునరావాసితులకు నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకుడు వైకేశవరావు డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డే శోభనాద్రేశ్వరరావు, మాజీ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, కంభపాటి పాపారావు, ఎం.వి.కృష్ణారావు, ఎం.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర రైతు సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకొనేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్రైట్ ప్రత్యేక సెల్‌లో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఈ ప్రత్యేకసెల్ ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రైతులకు ఎరువుల కొరత లేకుండా బఫర్ గోడౌన్‌లలో నిలువ చేయడం, ప్రభుత్వ మద్దతు ధరకు పంట కొనుగోలు చేయడం, ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేయడం, నాణ్యమైన పశుదాణా తయారీ, నంది గోల్డ్ బ్రాండ్ ద్వారా విక్రయాలు చేయడం, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను సరైన ధరలతో అందుబాటులో వుంచడం తదితర సేవలను రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అన్నారు. ఒకకుటుంబం-ఒక పారిశ్రామికవేత్త సాకారం దిశగా ఔత్సాహికులను సరికొత్త ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సహాయ సహకారాలు అందిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

కాలువల్లో పనులు చేశాకే..

(5వ పేజీ తరువాయి)

పెడన ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్ నియోజకవర్గాల్లో పంట కాలువలు, డ్రెయినేజీ దుస్థితిని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ నెల 10వ తేదీన కృష్ణాడెల్టాకు సాగు నీటిని విడుదల చేస్తే ఉపయోగం ఉండదని, కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తదితరాలను తొలగించే పనులు పూర్తి చేసి, ఆ తర్వాతే సాగునీటిని విడుదల చేస్తే ఉపయోగం ఉంటుందని స్పష్టం చేశారు.

10న నీటిని విడుదలపై సందిగ్ధం

జిల్లాకు సాగు నీటిని ఈనెల 10వ తేదీన విడుదల చేయాలని కోరుతూ తీర్మానం చేయాలని సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా తొలుత సూచించారు. అయితే పంట కాలువలు, డ్రెయినేజీల్లో ఓఅండ్ఎం పనులు చేయకపోవడంతో కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తదితరాలు పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయనే అంశం చర్చకు వచ్చింది. దీంతో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంట్రావు మాట్లాడుతూ పంట కాలువల్లో అసలు పనులు ప్రారంభించకుండా సాగునీటిని విడుదల చేస్తే ఎంతమేర ఉపయోగం ఉంటుందనే అంశంపై అధికారులు సమాధానం చెప్పాలన్నారు. రామవరప్పాడు కాలువ పరిధిలో 48వేల ఎకరాల ఆయకట్టు ఉందని, 1,600 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రవహించే ఈ కాలువ వెయ్యి క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కూడా తట్టుకునేస్థితిలో లేదన్నారు. దీంతో ఈ కాలువ ద్వారా సాగునీరు ఎంతమేర పొలాలకు చేరుతుందని ప్రశ్నించారు. బుడమేరుకు ఎనిమిది చోట్ల గండ్లు ఉన్నాయని, వాటిని ఎప్పటిలోగా పూడుస్తారని నిలదీశారు. గండ్లు పూడ్చడానికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారని, ఈ నిధులు ఎప్పటికి విడుదల అవుతాయి, ఎప్పటికి పనులు పూర్తిచేయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిధుల విడుదలకు నీటిపారుదలశాఖ ఎస్ఈ ప్రతిపాదనలు పంపారా, సంబంధిత శాఖ మంత్రికి వివరించారా లేదా ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పనులు చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో ఇస్తామని చెబితే కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు చేయిస్తానన్నారు. బొడ్డపాడు, ఎనికేపాడు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో తొమ్మిది చోట్ల కాలువలకు గండ్లు ఉన్నాయని, వాటిని పూడ్చేందుకు రూ.3 కోట్లు అవసరమని, పనులు చేసేందుకు నిధులు అందుబాటులో ఉన్నాయా లేవా అన్ని ప్రశ్నించారు.



మృతుడు ఆంజనేయులు, ప్రమాదానికి గురైన కారు

పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ..

» లారీని ఢీ కొన్న కారు

» ఒకరి మృతి, పలువురికి గాయాలు

ఇబ్రహీంపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారిలో ఒకరు మృతిచెందగా.. పలువురికి గాయాలైన ఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం గ్రామంలో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల మండలం గుడిపూడి గ్రామానికి చెందిన వెంపరాల ఆంజనేయులు కుటుంబంతో కలిసి పెనుగంచిప్రోలు తిరుపతమ్మను దర్శించుకొని కారులో స్వగ్రామం గుడిపూడికి తిరుగు ప్రయాణయ్యారు. కీలేశపురం గ్రామం వద్దకు చేరుకుంటుండగా డ్రైవర్ వై.ముత్యాలు ఎదురుగా ఉన్న లారీని ఢీ కొట్టాడు. డ్రైవర్ పక్కనే కూర్చున్న వెంపరాల అంజనేయులు (45) అక్కడికక్కడే మృతి చెందగా.. వెంపరాల ముత్యాలయ్య (డ్రైవర్), వెంపరాల ఉల్లయ్య, బోగి లక్ష్మి, వెంపరాల నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూములన్నీ ఎడారే!

(5వ పేజీ తరువాయి)

వరద రావటంతో ఆక్లూరుపాడు, రేకులగడ్డ, ముచ్చింతాల వద్ద మునేరు ఒడ్డెక్కింది. ఆనుకుని ఉన్న తువ్వకాల్వ చిన్నాభిన్నమైంది. ఆక్లూరుపాడు సమీపంలో భారీ గండి (మైసమ్మ గండి) పడింది. రేకులగడ్డ, ముచ్చింతాల, అనిగండ్లపాడు సమీపంలో ఐదారు చోట్ల గండ్లు పడ్డాయి. విలువైన పంట భూములు నామరూపాలు లేకుండా పోయాయి. వరిపైరంతా తుడిచి పెట్టుకుపోయింది. నీటి ఉధృతికి కాల్వకు ఆనుకుని ఉన్న పొలాల్లో మట్టి కోసుకుపోవటంతో పెద్ద పెద్ద గొయ్యిలు పడ్డాయి. ఒక అడుగు నుంచి మూడు అడుగుల మందం వరకు ఇసుక మేటలు వేసింది. వ్యవసాయ పంపు సెట్లు కూడా పోయాయి. వరద పుణ్యమా అంటూ రైతులకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు.

అందింది రూ. 10వేల సాయమే!

ప్రభుత్వం పంట నష్టం పోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల వంతున ఆర్థిక సాయ మందించింది. ఈ సాయం కూడా బాధిత రైతులందరికీ అందలేదు. ఆయా గ్రామాల్లో దేవాలయ భూములు సాగు చేసిన కౌలుదారులకు, మ్యుటేషన్ పెండింగ్‌లో ఉన్న రైతులకు న్యాయం జరగలేదు. ఇక కోసుకుపోయి, గోతులు పడిన పొలాలకు, ఇసుక మేట వేసిన పొలాలకు మాత్రం ఎలాంటి సాయమంద లేదు. పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, మరుభూమిగా మారిన భూములను చూసి జరిగిన నష్టం గురించి ప్రభుత్వానికి నివేదించారు. సాయమందించాల్సిందిగా బాధిత రైతులు వేడుకున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పొలాల్లో గోతులు పూడ్చటానికి, మేట వేసిన ఇసుక తొలగించటానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. అక్కడికి కొంత మంది రైతులు ఖర్చుకు వెనుకాడకుండ ఇసుక మేటలు తొలగించి, గోతులు పూడ్చారు. ఇంకొందరు రైతులు ఇసుక మేటలు తొలగించకపోవటంతో ఆ భూములు ఎడారిలా కన్పిస్తున్నాయి. గోతులు కూడా పూడ్చలేదు. మునేటికి ఆనుకుని ఉన్న తువ్వకాల్వకు పడిన గండ్లను పూడ్చకపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మునేటికి భారీ వరద కాదు, ఒక మాదిరి వరద వచ్చినా ప్రమాదం పొంచి ఉందని రైతులు భయపడుతున్నారు. మునేరు వరద తువ్వకాల్వ ద్వారా మరల పంట భూములపై విరుచుకు పడనుంది. గండ్లు పూడ్చకుండ పొలాలను బాగు చేయటం వల్ల ఉపయోగం లేదు. దీని వల్లనే కొందరు రైతులు పొలాలను బాగు చేయకుండ వదిలేశారు. మునేరు వరద పుణ్యమా అంటూ ఆయా గ్రామాల పరిధిలో తువ్వకాల్వకు సమీపంలో ఉన్న పంట భూముల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. వరదకు ముందు ఎకరం రూ. 20 లక్షలు పలికిన పొలం నేడు రూ.పది లక్షలు కూడా పలకటం లేదు. ఆర్థిక అవసరాల దృష్ట్యా అమ్ముకుందామన్న వీలు పడటం లేదు. ఈ భూములు కొనేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు.

ఇసుక మేట తొలగించాలి

పది ఎకరాల్లో ఇసుక మేట వేసింది. ఒక అడుగు నుంచి మూడు అడుగుల వరకు ఇసుక పొర ఏర్పడింది. ఇసుక మేట తొలగించి, పొలం బాగు చేయటానికి రూ. 10 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. తువ్వకాల్వ గండ్లు పూడ్చనందున బాగుచేసినప్పటికీ ప్రయోజనం లేదని ఇసుక తొలగించలేదు. ఈ ఏడాది కౌలు కూడా రాదు.

-నంబూరి కృష్ణమూర్తి, రేకులగడ్డ

అంతా ఇసుకే..

సిరులు పండించే మాగాణి భూమి ఎడారిగా మారింది. ఇసుక తప్పితే మట్టి కనిపించటం లేదు. రెండు ఎకరాలు ఉంటే అర ఎకరంలో పెద్ద గొయ్యి పడింది. రెండు అడుగులకు పైగా ఇసుక మేట వేసింది. వరద వల్ల ఎకరానికి రూ. 15 వేలు చొప్పున రూ.30 వేలు పెట్టుబడి నష్టం ఏర్పడింది. ప్రభుత్వం పంట నష్టం కింద రూ. 20 వేలు ఇచ్చింది. ఏం చేయాలో తోచటం లేదు.

-మాదల అప్పారావు, రేకులగడ్డ

ఏసీబీ వలలో చిక్కిన అటవీశాఖ అధికారి

(5వ పేజీ తరువాయి)

రాత్రి ఆనంద్‌పేటలోని జిల్లా అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం టింబర్ డిపో యజమాని రవీంద్రనాథ్‌కు పౌడర్ చల్లిన రూ.18వేల నగదును ఇచ్చి అటవీశాఖ అధికారి వద్దకు పంపారు. నగదు తీసుకున్న అధికారిని ఏసీబీ అధికారులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి నగదును స్వాధీనం చేసుకుని, సంబంధిత అధికారి చేతులను రసాయనాలతో కడిగి లంచం తీసుకున్నట్లుగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఏసీబీ అధికారులకు పట్టుబడిన జి.జయప్రకాష్ 2015లో రాజమండ్రిలో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో లంచం తీసుకుని పట్టుబడినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఇక ఎలక్ట్రిక్ బస్సులు!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు.ట్రిప్పుకు ఐదుగురు సీనియర్ డ్రైవర్ల చొప్పున దశల వారీగా డ్రైవర్లకు శిక్షణ ఇప్పించనున్నారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు సీనియర్ డ్రైవర్లకు హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు డిపోకు వచ్చిన తర్వాత సీనియర్ డ్రైవర్లు, తమ జూనియర్ డ్రైవర్లకు శిక్షణ ఇస్తారు. ఆర్టీసీకి జూలై నెలలో ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే అవకాశం ఉంది. వీటిని సిటీ సబర్బన్ పరిధిలో మైలవరం, కంకిపాడు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ వంటి సబర్బన్ లాంగ్ రూట్లతో పాటు, సిటీ పరిధిలో బందరు రోడ్డు, ఏలూరు రోడ్ల మీద నడపనున్నారు.

ప్రజారోగ్యంతో..

(5వ పేజీ తరువాయి)

హోటల్స్, భోజన శాలలకు వెళ్లి ఆహార వ్యర్థాలను సేకరిస్తారు. ఇలా ప్రతి రోజూ సేకరించిన వ్యర్థాలను డ్రమ్ములలో నిల్వ చేస్తారు. నాలుగైదు మ్యాక్సీ ట్రక్‌లలో డ్రమ్ములను ఉంచే పరిమాణం వరకు సేకరించగానే.. వాటిని రవాణా చేస్తున్నారు.

చేపలకే కాదు.. పందుల పెంపకానికి కూడా సరఫరా

రామలింగేశ్వరనగర్ కృష్ణానది కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై 'ఆంధ్రజ్యోతి' దృష్టి సారించగా.. మరో విషయం వెలుగు చూసింది. నాన్‌వెజ్ ఆహార వ్యర్థాలను ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలలోని పందుల పెంపకందార్లకు కూడా సరఫరా చేస్తున్న విషయం తెలిసింది. సీమ, నాటు పందులను పెంచేవాళ్లు మాంసాహార వ్యర్థాలను వినియోగిస్తున్నారు. దీంతో చాలా ముందుగా పందులు కోతకు వచ్చేస్తున్నాయి. అతి తక్కువ వ్యవధిలో పందులు ఏపుగా పెరిగిపోతున్నాయి. ఈ కారణంగా మాంసాహార వ్యర్థాలకు డిమాండ్ ఉంటోందని, ఫోన్లు చేసి మరీ నిల్వ చేసిన ఆహారాన్ని తెప్పించుకుంటున్నారని తెలిసింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

దుర్గగుడిలో నవగ్రహాల ప్రతిష్ఠకు శ్రీకారం

ఇంద్రకీలాద్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి క్షేత్రంలో మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నవగ్రహాల ప్రతిష్ఠకు మంగళవారం శ్రీకారం చుట్టారు. మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, రుత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, క్షీరాధి వాసం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి మంటప పూజలు, మూల మంత్ర హవనములు, అధివాసములు జరిగాయి. కార్యక్రమాల్లో దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ పాల్గొని పూజలు చేశారు. ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వరశాస్త్రి, ఉపప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వేద పండితులు పాల్గొన్నారు.


రోడ్డు మీద రొయ్యలు విక్రయిస్తున్న మహిళ


విక్రయానికి సిద్ధంగా ఉన్న నాటు కోళ్లు


నాటు కోళ్లను కాలుస్తున్న వ్యాపారి


అపరిశుభ్ర వాతావరణంలో చేపలు శుభ్రం చేస్తున్న మహిళ

ఆదివారం వస్తే అంతే..

● రోడ్డుమీదే చేపలు, రొయ్యల విక్రయాలు ● తాటాకులతో నాటుకోళ్లను కాలుస్తున్నారు ● వ్యర్థాలను బందరు కాల్వలో వదులుతున్న వైనం

పటమట, ఆంధ్రజ్యోతి: ఆదివారం వస్తే మాంసాహార ప్రియులు పటమటలోని చేపల మార్కెట్ వైపు క్యూ కడతారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రామలింగేశ్వర్ నగర్ వరకు వివిధ రకాలైన మాంసాన్ని విక్రయిస్తుంటారు. కొందరు నాటుకోళ్లను తెచ్చి విక్రయిస్తుంటారు. చేపలను, రొయ్యలను బహిరంగంగా అపరిశుభ్ర వాతావరణంలో అమ్ముతుంటారు. నాటుకోళ్లను డ్రెయినేజీ పక్కనే తాటాకులతో కాలుస్తుంటారు. నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ పక్కనే పంది మాంసాన్ని కూడా అమ్ముతున్నారు. చేపల మార్కెట్ కింద భాగంలో చేపలను, కోళ్లను బాగు చేసి వ్యర్థాలను పక్కనే ఉన్న బందరు కాలువలోకి వదులుతున్నారు. అధికారులు స్పందించి పరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు జరిగేలా చూడాలని, వ్యర్థాలు బందరు కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పులు లేకుండానే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రభుత్వాసుపత్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో అప్పుల కోసం ఢిల్లీకి వెళ్లకుండానే కూటమి ప్రభుత్వం ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన 2వ డివిజన్‌లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నలుగురు నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం రూ.70 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి మంగళవారం ఆర్థికశాఖ మంత్రి ఢిల్లీ వెళ్లి రూ.2 వేల కోట్లు అప్పు తెచ్చేవారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు తనకు ఉన్న అనుభవంతో అప్పుల లేకుండానే అభివృద్ధి చేస్తున్నారన్నారు. జూన్ 4న వైసీపీ రాక్షస పాలన అంతమైన రోజన్నారు. రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛగా జీవించడం ప్రారంభించిన రోజన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలు తెలుసుకోకుండా వైసీపీ ఎమ్మెల్యేలు తప్పించుకు తిరుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పేరేపి ఈశ్వర్, దాసరి గాబ్రియేలు, ముత్యాల కృష్ణ, పర్వతనేని రత్నశ్రీ, కృష్ణ ప్రసాద్, నాళ్లం రవీంద్ర, వెలసిన సురేష్‌బాబు, షేక్ షకీలా, యలమంచిలి రాజ, కె.కృష్ణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా విక్రయిస్తే చర్యలు

● ఏసీపీ దామోదర్


పొగాకు సీజ్ చేస్తున్న ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్, సిబ్బంది

బెంజిసర్కిల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలలు ఉన్న ప్రాంతాలకు వంద మీటర్ల దూరంలోనే పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించాలని ఏసీపీ కె. దామోదర్ ఆదేశించారు. మంగళవారం ఎన్ఎస్ఎం పాఠశాల ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కా విక్రయించిన పలువురిపై కేసులు నమోదు చేయాలని ఏసీపీ సూచించారు. పలువురు ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల సమీపంలో పొగాకు సంబంధించిన ఉత్పత్తులను విక్రయిస్తున్న ఏడు షాపులకు రూ.200 జరిమానా విధించామని, ఆయా ఉత్పత్తులను విక్రయించవద్దని హెచ్చరించినట్లు తెలిపారు. మాచవరం, గుణదల పరిధిలోని పలు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలకు సమీపంలో నిషేధిత గుట్కా, పొగాకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ఎస్ఎం రోడ్డులో డ్రోన్లతో పర్యవేక్షించారు. మైక్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్, ఎస్ఐలు జి.రేవతి, హరికృష్ణ, దుర్గాదేవి పటమట స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి

టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవంను ఘనంగా నిర్వహించాలని, ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. మంగళవారం శాఖాధిపతులతో, సచివాలయం సిబ్బందితో కమిషనర్ ధ్యానచంద్ర టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పర్యావరణాన్ని సంరక్షించుకునే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా ప్లాస్టిక్ అవుట్-ఫ్యాబ్రిక్ ఇన్ అనే అంశంపై ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే దిశగా పబ్లిక్ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నగరపాలకసంస్థ పరిధిలో ఉన్న రెడ్యూస్, రీ యూస్, రీ సైకిల్ సెంటర్లలో ప్రజల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ సెంటర్లు ప్రజలకు తెలిసే విధంగా వారికి డోర్ టు డోర్ అవగాహన కల్పించాలని ఆదేశించారు. మూడు నియోజక వర్గాలలోను మొక్కలు నాటే కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయం స్థాయిలో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి

భారతీనగర్: నగరాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం లయోల కళాశాల రోడ్డు, బెంజిసర్కిల్, మహాత్మాగాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ, డీసిల్టింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేస్తూ రోడ్లపై వర్షపు నీరు నిల్వలేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, మెడికల్ హెల్త్ అధికారి డాక్టర్ గోపాలకృష్ణ, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, అసిస్టెంట్ సిటీప్లానర్ మోహన్‌బాబు, ఈఈ సామ్రాజ్యం, ఇన్‌చార్జి ఈఈ (పార్కు) చంద్రశేఖర్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


లయోలా కళాశాల రోడ్లో అధికారులతో మాట్లాడుతున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

అటకెక్కిన షాదీఖానా నిర్మాణం

ఏడాదిగా ముందుకు సాగని లబ్బీపేట షాదీఖానా నిర్మాణం

లబ్బీపేట, ఆంధ్రజ్యోతి: లబ్బీపేటలో షాదీఖానా నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో వెంటనే నిర్మాణాన్ని పూర్తిచేయాలని ముస్లింలు కోరుతున్నారు. కృష్ణలంక, పటమట, రాణిగారితోటలతో పాటు నియోజకవర్గంలో ఉన్న ముస్లింలకు శుభకార్యాలు చేసుకోవడానికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ముస్లింలు లక్షలు పెట్టి ఖరీదైన ఫంక్షన్ హాల్స్‌ను ఆశ్రయించలేక రోడ్లపై వేడుకలు చేసుకుంటున్నారు. దీంతో తూర్పు నియోజకవర్గంలో మధ్య ప్రాంతమైన లబ్బీపేటలో ఎక్కువగా ముస్లింలు ఉండడంతో ఇక్కడ షాదీఖానా నిర్మించాలనే ప్రతిపాదన బలంగా ఉండడంతో 19వ డివిజన్‌లోని వైవీ రావు హాస్పటల్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణాన్ని చేపట్టారు. గత శాసనసభ ఎన్నికల ముందు ఈ షాదీఖానా నిర్మాణం అటకెక్కింది. దాదాపు సంవత్సరం నుంచి నిర్మాణం ముందుకు సాగలేదు. నిర్మాణం పూర్తి ముస్లింలు కోరుతున్నారు.


మధ్యలో ఆగిన షాదీఖానా నిర్మాణం

అదనపు నిర్మాణం కోసం ఆలస్యం

షాదీఖానా నిర్మాణం ఆలస్యం కావడానికి ప్రస్తుతం జరుగుతున్న భవన నిర్మాణాన్ని మరింత పొడిగించమేనని తెలిసింది. ఇప్పుడు జరుగుతున్న నిర్మాణం సుమారు కోటి రూపాయలతో, దాదాపు 500గజాల్లో జరుగుతుండగా సరిపోదని స్థానికులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడడంతో ముందు ఉన్న స్థలంలో కూడా భవన నిర్మాణం పెంచే విధంగా అధికారులు నిర్ణయించడంతో పాటు దాదాపు రూ.50లక్షల వరకు అంచనా ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు ప్రక్రియ కూడా ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. దీంతో మరోప్లాన్ రూపొందించడానికి ఆలస్యం జరిగినట్లు సమాచారం. ఈ ప్లాన్ కూడా దాదాపు పూర్తయిందని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ఈ ప్రణాళిక, పనుల వివరాలు తెలిపి నిర్మాణ పనులు ముందుకు తీసుకువెళ్లేందుకు అధికారులు సిద్ధమైనట్లు, మరో 20రోజుల్లో పనులు ప్రారంభించేందుకు అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో కూడా సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.

కౌన్సిల్ సమావేశంలో అడుగుతా



షాదీఖానా నిర్మాణం ఆలస్యం కావడంతో ముస్లింలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఆలస్యం ఎందుకు అవుతుందో అధికారులు చెప్పడం లేదు. దీనిపై కౌన్సిల్ సమావేశంలో అధికారులను అడుగుతాను.

ఎం.డి రెహన నాహీద్, కార్పొరేటర్

ఆడుకోడానికి వెళ్లి ఇద్దరు చిన్నారుల అదృశ్యం

సీసీ కెమెరాల సాయంతో పిల్లలను గుర్తించిన పోలీసులు
గంట వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగింత


పిల్లలను తల్లి, బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

లబ్బీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారుల ఆచూకీ లభించక తల్లడిల్లిన తల్లిదండ్రులకు గంట వ్యవధిలోనే కృష్ణలంక పోలీసులు పిల్లల ను అప్పగించిన ఘటన లబ్బీపేటలో మంగళవారం జరిగింది. లబ్బీపేటకు చెందిన మధు ప్రియాంక, చిత్ర వీరశ్రీ లు మంగళవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఆడుకోడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. చిన్నారుల తల్లి ఉదయం 7 గంటలకు పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. అప్పటి వరకు ఇంటి వద్ద ఉన్న తండ్రి మధ్యాహ్నం పనికి వెళ్లాడు. తండ్రి వెళ్లగానే వీరు ఆడుకునేందుకు వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన తల్లికి పిల్లలు కనిపించక పోవడంతో మధ్యాహ్నం 3గంటల వరకు వెతికి 112కి కాల్ చేసి ఫిర్యాదు చేసింది. కృష్ణలంక సీఐ నాగరాజు సీసీ కెమెరాల సహాయంతో పైడయ్యవీధిలో పిల్లలు ఆడుకుంటుండగా గుర్తించి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు ఇచ్చిన గంట వ్యవధిలోనే పిల్లలను అప్పగించడంపై చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 11 నుంచి

చిట్టినగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం సీఎంను సచివాలయంలో కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ నెల 11 నుంచి బ్రహ్మోత్సవాలకు అంగరంగ వైభవంగా జరుగుతాయని కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు అన్నారు. కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, రాంపిళ్ల శ్రీనివాసరావు, మాకెన సత్యనారాయణ, మరుపిళ్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు.


సీఎంను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మార్కెట్ల తరలింపునకు సహకరించండి


మాట్లాడుతున్న చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్

కార్పొరేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహంతి మార్కెట్, మ్యాంగో మార్కెట్, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ల తరలింపునకు విజయవాడ నగరపాలకసంస్థకు సహకరించాలని చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ కోరారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన మీటింగ్ హాల్‌లో మంగళవారం మహంతి మార్కెట్, మ్యాంగో మార్కెట్, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ మార్కెట్ అసోసియేషన్ సభ్యులను విడివిడిగా పిలిచి మాట్లాడా మన్నారు. మార్కెట్ తరలింపునకు వారికున్న సమస్యలను తెలుసుకు న్నామని, వారికి ఎటువంటి సమస్య లేకుండా, నష్టం జరగ కుండా మార్కెట్ తరలింపునకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి విషయాలపై చర్చించినట్లు తెలిపారు. మార్కెట్ అసోసియేషన్ సభ్యులు మార్కెట్ తరలింపులో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కేబీఎస్ఎస్. లత, మార్కెట్‌ల అసోసియేషన్ సభ్యులు, డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, టౌన్ ప్లానింగ్, ఎస్టేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 7.00గంటల నుంచి 11.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్రనగర్ కాలనీ, కరెన్సీనగర్‌కాలనీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణ పై అవగాహన

సత్యనారాయణపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం సర్కిల్-2 కార్యాలయంలో మంగవారం అగ్నిప్రమాద నిరోధక అవగాహన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా అధికారులు అగ్నిప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాద సమయంలో అగ్నిప్రమాద నిరోధక పరికరాలను ఏలా ఉపయోగించాలి చేసి చూపించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు వాహనంలో అగ్నిప్రమాదం

త్రుటిలో తప్పిన ప్రమాదం

వన్‌టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హనుమాన్‌పేటలోని సిందూ ట్రాన్స్‌పోర్టు వాహనంలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది స్పందించటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం హనుమాన్‌పేటలో సిందూ ట్రాన్స్‌పోర్టులో సిబ్బంది, ముఠాకూలీలు వాహనాల్లో ఎగుమతి, దిగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ వాహనంలో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించటంతో అక్కడున్న వారు బయటకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే వాహనంలో ఉన్న కొన్ని బండిల్స్ దగ్ధమయ్యాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని ఫైర్ సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్‌పేట పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.


అలంకార్ థియేటర్‌లో మాట్లాడుతున్న మనోజ్, నారా రోహిత్

'భైరవం' హీరో ద్వయం సందడి

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'విజయాలవాడ బెజవాడ.. ఎన్నో ఏళ్ల తరువాత మళ్లీ మీ ముందుకొచ్చా. అందరూ బాగున్నారా' అంటూ భైరవం హీరో మంచు మనోజ్ అభిమానులను ఉత్సాహపరిచాడు. మంగళవారం నగరంలో అలంకార్ థియేటర్‌లో భైరవం విజయోత్సవంలో చిత్ర యూనిట్ సందడి చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ సినిమాల విషయంలో ఇక ఆగడం ఉండదన్నారు. తన సినిమాలు వరుసగా వస్తూనే ఉంటాయన్నారు. తమ హీరో రోహిత్ సుందరకాండ జూలైలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా రెండు వారాల్లో విడుదల కాబోతోన్నాయని అప్పటి వరకు భైరవం సినిమా ఆడుతూనే ఉండాలని ఆకాక్షించారు. తన సహచర నటుడు నారా రోహిత్ నటించిన సుందరకాండ సినిమా కూడా కుటుంబంతో చూడదగ్గ చిత్రమన్నారు. నటుడు నారా రోహిత్, విజయ్ కనకమేడల, చిత్ర నిర్మాత కే కే రాధామోహన్, అన్నపూర్ణ స్టూడియోస్ మేనేజర్ కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బద్మాషులు చిత్ర బృందం

నగరంలో 'బద్మాషులు'

లబ్బీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో బద్మాషులు చిత్ర యూనిట్ సందడి చేసింది. మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చిత్ర నటీనటులు విద్యాసాగర్, దీక్ష మాట్లాడుతూ పూర్తి గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించామని, ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందన్నారు. దర్శకుడు శంకర్ చేకూరి నూతన నటీనటులతో అద్భుతంగా తీశారన్నారు. ఈ నెల 6న ఈ సినిమా విడుదల కానుందన్నారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చిత్ర దర్శకుడు శంకర్ చేకూరి మాట్లాడుతూ ఈ చిత్రం టైటిల్‌కు ప్రేక్షకులు నుంచి విశేష స్పందన వచ్చిందని, చిత్రంలో కామెడీ, ప్రేమ సన్నివేశాలు కడుపుబ్బ నవ్వించేలా తీశామన్నారు.

ముచ్చెర్ల శ్రీనివాసరావు మా సభ్యుడు కాదు

- లబ్బీపేట వేంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బంగారం చిట్టీలు నిర్వహించి ప్రజలకు కుచ్చుటోపీ పెట్టిన ముచ్చెర్ల శ్రీనివాసరావు తమ కమిటీ సభ్యుడు కాదని కంచి కామకోటి పీఠస్థ శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థాన పాలక మండలి పర్సన్ ఇన్‌చార్జి రామమోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. శ్రీనివాసరావుకు పాలక మండలితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దేవస్థానాలను పాలక మండలి నిర్వహిస్తోందన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నెట్టెం, శ్రీరాం తాతయ్య

వెన్నుపోటు సంస్కృతి జగన్‌దే

- టీడీపీ నేత నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే తాతయ్య ధ్వజం

జగ్గయ్యపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నవరత్నాలు పేరుతో నవ మోసాలు చేసి ప్రజలు ఛీత్కరించినా జగన్‌రెడ్డి నైజం మారలేదని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ధ్వజమెత్తారు. వారిద్దరు నెట్టెం నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు వెన్నుపోటు దినోత్సవం పేరుతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం జగన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణం సహా అనేక కుంభకోణాల్లో జగన్ ప్రమేయం బయటపడుతున్నాయని, వెన్నుపోటు అనేది జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే 70శాతం హామీలు నెరవేర్చిందన్నారు. పింఛన్ పంపిణీ, ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం, మెగా డీఎస్సీ, చెత్తపన్ను ఎత్తివేత, అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభంతో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, ముల్లంగి రామకృష్ణారెడ్డి, మల్లెల గాంధీ, టీ జగన్మోహనరావు, నరసరాజు, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.


అగ్నికి ఆహుతైన పాత ఇనుము, ప్లైవుడ్ పరికరాలు,
బాధితులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- భారీగా ఆస్తినష్టం ● బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నందిగామ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల భవనంలో మంటలు చెలరేగి భారీ ఆస్తినష్టం సంభవించింది. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని మూడంతస్తుల భవనంలో తమ్మిశెట్టి యల్లమందయ్య నివాసంలోని కిందభాగంలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. పాత ఇనుప వ్యాపారం చేసే యల్లమందయ్య కొనుగోలు చేసిన పాత ఇనుప సామాను సహా ప్లైవుడ్ చెక్కలను నిల్వ ఉంచాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కిందిభాగంలో మంటలు రావడంతో పాటు ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనుమానం వచ్చిన యల్లమందయ్య కిందకు వచ్చి చూడగానే మంటలు ఎగసిపడడం గమనించి భార్య, పిల్లలను బయటకు తీసుకువచ్చి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. దీంతో నందిగామ, కంచికచర్ల స్టేషన్లకు చెందిన అగ్నిమాపక వాహనాలు హుటాహుటీన అక్కడకు చేర్చి మంటలు అదుపు చేశారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, న్యాయవాది షేక్ కరీముల్లా ఘటనాస్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సౌమ్య అధికారులను ఆదేశించారు.

సమస్యలను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తా

- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ● నెలరోజుల్లో గుణదల ఆర్‌వోబీ పనులు ప్రారంభం ● ఆరు ఆర్‌యూబీలు, మూడు ఆర్‌వోబీలకు ప్రతిపాదనలు చేశాం : ఎమ్మెల్యే

గుణదల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సింగ్‌నగర్, సత్యన్నారాయణపురం,మధురానగర్, గుణదల ప్రాంతవాసులు రైల్వేట్రాక్‌లు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆయా సమస్యలను కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంపరిధిలోని రైల్వే సమస్యలను ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుణదల ఉలవచారు కంపెనీ వద్ద నిలిచిపోయిన ఆర్‌వోబీ పనులను పరిశీలించారు. తర్వాత సత్యన్నారాయణపురం, మధురానగర్, దేవినగర్, సింగ్‌నగర్ ప్రాంతవాసులు రైల్వేట్రాక్‌లు దాటేందుకు పడుతున్న అవస్థలను స్వయంగా పరిశీలించారు. స్థానికులు ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి రైల్వే సమస్యలను వినతిపత్రం రూపంలో వారికి సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ సెంట్రల్‌లోని పలు ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 15 రోజుల్లో ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను రైల్వే బోర్డ్ చైర్మన్‌ను కలిసి ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలను మంజూరు చేయాల్సిందిగా కోరతానన్నారు. రేపు జరగబోయే డీఆర్‌ఎం మీటింగ్‌లో సెంట్రల్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను చర్చకు తీసుకొచ్చి పరిష్కరించేలా చేస్తానన్నారు. సింగ్‌నగర్లో పెరిగిన ట్రాఫిక్ రీత్యా రెండో ఫ్లై ఓవర్ అవసరమన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వేశాఖతో ముడిఉండటంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలోనే సీఎం చంద్రబాబుతో పాటు రైల్వే అధికారుల దృష్టికి ఇక్కడ 6 ఆర్‌యూబీలు, 3 ఆర్‌వోబీల అవసరాన్ని తెలియజేస్తూ ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ఆగిపోయిన రైల్వే పెండింగ్ పనులు మొదలుపెట్టడంపై దృష్టి పెట్టిందనేన్నారు. నెలరోజుల్లో గుణదల్లో నిలిచిపోయిన ఆర్‌వోబీ పనులు ప్రారంభిస్తామన్నారు. ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్క్ అడ్వైజరీ కమిటీ గొట్టుముక్కల రఘురామ రాజు, ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.


సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే సమస్యల పరిష్కారం, ఆర్‌వోబీ నిర్మాణాలకున్న అవాంతరాలను పరిశీలించిన ఎంపి కేశినేని (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమా

మోడల్ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దుదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకమైన సేవలందించడంతో పాటు పరిపాలన, పచ్చదనం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను మోడల్ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దడంలో అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో చేపట్టాల్సిన సంస్కరణలు, ప్రాంగణం అభివృద్ధి, పచ్చదనం పరిశుభ్రతపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురాతన కాలం నాటి కట్టడమైన కలెక్టరేట్ భవనం సందర్శకులను ఎంతో ఆకట్టుకొంటోందన్నారు. ఒకప్పటి సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పడి నూరు వసంతాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా ఏర్పాటు చేసిన స్థూపం సమాచారాన్ని ప్రజలకు తెలియజేసేలా రంగులతో తీర్చిదిద్ది అలంకరించాలన్నారు. స్థూపం చుట్టూ ఔషధ మొక్కలు నాటి, సంరక్షించి, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్‌ను సందర్శించే ప్రజలకు అర్థమయ్యేలా విభాగాలు, అధిపతులకు దారిచూపుతూ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన ద్వారం వద్ద కలెక్టరేట్‌కు సంబంధించిన లే అవుట్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ వాడకుండా చూడాలన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


పచ్చదనం పరిశుభ్రతపై కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు

జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. గోవధ నిషేధ చట్టం అమలుపై సమన్వయ శాఖల అధికారులతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7న బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని ఉల్లంఘించకుండా ఆహ్లాదకర వాతావరణంలో పండుగ జరుపుకోవాలని జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. గోవధ నిషేధ చట్టం అమలు వంటి విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల, డివిజన్ స్థాయిలోని విజిలెన్స్ కమిటీలు చట్టం అమలును పర్యవేక్షించాలన్నారు. జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీపీవో పి.లావణ్యకుమారి, గో సంరక్షణ సమితి ఐకాస సభ్యులు తోట సురేష్, నాగలింగం శివాజీ, పోతురాజు వినోద్‌రాజ్ పురోహిత్, గోవిందసాబు, మిరియాల శ్రీనివాసరావు, బాలకృష్ణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చిక్కిన స్నాచర్లు!

- నిందితుల్లో రౌడీషీటర్, విద్యార్థి ● పరారీలో మరో ఇద్దరు
- నున్న ప్రాంత యువకులుగా గుర్తింపు ● గొలుసు చోరీలకు ముందు బైక్ చోరీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: 10 నిమిషాల వ్యవధిలో రెండు వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గొలుసు చోరీలు చేసిన నిందితులను పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో కనిపించిన ఈ ఇద్దరు యువకులు విజయవాడ నున్న ప్రాంతానికి చెందిన వారని ఒక నిర్ధారణకు వచ్చారు. సోమవారం రాత్రి ఆటోనగర్‌లోని సన్‌లైట్ సెంటర్‌లో నడిచి వెళ్తున్న ఓ మహిళ, పాలీక్లినిక్ రోడ్డులో మున్సిపల్ కాలనీలో ఓ కిరణా షాపులోని మహిళ మెడలో ఉన్న బంగారం గొలుసులను లాగేసిన విషయం తెలిసిందే. మొదట ఘటన జరిగిన సన్‌లైట్ సెంటర్ నుంచి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ రెండు గొలుసు చోరీలను చేయడానికి ముందు బైక్‌లను దొంగిలించినట్టు సమాచారం. మొత్తం నలుగురు యువకులు గ్యాంగ్‌గా ఏర్పడి ఈ చోరీలు చేసినట్టు తెలిసింది. నున్న ప్రాంతానికి నలుగురు యువకులు ఈనెల 1న అర్ధరాత్రి యాక్టివా, పల్సర్ బైక్‌పై బయలుదేరి విజయవాడకు చేరుకున్నారు. ముందుగా మొగల్రాజపురంలోని బోయపాటి మాధవరావు వీధిలో ఓ ఇంటి ముందు ఉన్న యమహా ఎంటీ 15 బైక్ దొంగిలించారు. దీన్ని తీసుకుని నున్నకు వెళ్లిపోయారు. అక్కడ బైక్‌కు ఉన్న నంబరు ప్లేటును తొలగించారు. ఆ బైక్‌ను ఉపయోగించుకుని ఆటోనగర్, మున్సిపల్ కాలనీలో చైన్ స్నాచింగ్‌లు చేశారు. ఈ నలుగురి గ్యాంగ్‌లో ఇద్దరిని పోలీసులు గుర్తించినట్టు విశ్వసనీయంగా తెలిసిందే. ఆ ఇద్దరిలో సత్యానారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్, మరో విద్యార్థి ఉన్నట్టు తెలిసింది. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం రాత్రి రెండు గొలుసు చోరీలు జరిగాయని పోలీసులు భావించారు. వాస్తవానికి ఈ గ్యాంగ్ మూడు స్నాచింగ్‌లు చేసింది. సోమవారం సత్యానారాయణపురం పోలీసులు కొత్త పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవ హడావుడిలో ఉన్నారు. దీన్ని గమనించిన యువకులు శారదా కళాశాల వద్ద ఓ మహిళ మెడలో ఉన్న గొలుసును లాక్కున్నట్టు సమాచారం. ఈ గొలుసు రోల్డ్‌గోల్డ్ అని తెలిసింది. ఈ స్నాచింగ్‌ను ఉదయమే చేసినట్టు భావిస్తున్నారు. తర్వాత ఇళ్లకు వెళ్లిపోయిన ఈ యువకులు రాత్రికి మళ్లీ రోడ్డెక్కారు. ఈసారి ఆటోనగర్, మున్సిపల్ కాలనీ ప్రాంతాలను టార్గెట్ చేసుకుని గొలుసు చోరీలు చేశారు. గ్యాంగ్‌లో ఇద్దరి ఆచూకీ లభించినందుకు మిగిలిన ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

ఇష్టారాజ్యంగా పాలిటెక్నిక్ పోస్టుల రేషనలైజేషన్

- ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో రేషనలైజేషన్ ఇష్టారాజ్యంగా చేశారని, దీనిపై విచారణ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. కడప జిల్లా సింహాద్రిపురంలోని పాలిటెక్నిక్‌లో విద్యార్థులు తక్కువగా ఉన్నా ముగ్గురు ఫిజిక్స్ లెక్చరర్లను కేటాయించారన్నారు. అదే ప్రొద్దుటూరు కాలేజీలో 1,800 మంది విద్యార్థులు ఉంటే గణితానికి ఒకే లెక్చరర్‌ను కేటాయించారన్నారు. ఇలా అనేక లోపాలతో చేసిన రేషనలైజేషన్‌ను నిలిపివేయాలని కోరారు.

ఏపీ మద్యం విధానం భేష్

- కొల్లు రవీంద్రను కలిసిన ఒడిశా ఎక్సైజ్ అధికారులు

రాష్ట్రంలో అమలుచేస్తున్న మద్యం పాలసీని ఒడిశా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రశంసించారు. మంగళవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. మద్యం పాలసీ, క్వార్టర్ రూ.99 మద్యంపై చర్చించారు. రూ.99 మద్యంతో నాటుసారాను నిర్మూలించవచ్చన్నారు. మద్యం నాణ్యతను పరిశీలించే లేబొరేటరీల ఏర్పాటు మంచి నిర్ణయమన్నారు. ఏపీలోని ఎక్సైజ్ లాబొరేటరీలను పరిశీలించి, ఒడిశాలోనూ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. భేటీలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

రేషన్‌షాపుల్లో మంత్రి నాదెండ్ల తనిఖీ

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి సేవే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం నగరంలో 10, 15 నెంబర్ల చౌక దుకాణాలను కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎనీ టైం రేషన్ అనేలా ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు అనుకూలమైన సమయంలో సరుకులు తీసుకునే సౌకర్యం కల్పించామన్నారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 3 రోజుల్లో 62.14 లక్షల లబ్ధిదారుల కుటుంబాలకు రేషన్ సరుకులు అందించామన్నారు. తొలుత విద్యాధరపురంలో వృద్ధ దంపతుల ఇంటికి వెళ్లి స్వయంగా రేషన్ అందజేశారు.

ప్రసాదాల నాణ్యత పరిశీలనకు నోడల్ ఆఫీసర్

- సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు ఇతర విభాగాల పటిష్ట కార్యాచరణ
- 9న దేవస్థానంలోని అన్ని విభాగాలతో దేవదాయ కమిషనర్ సమీక్ష
- దుర్గగుడి ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో లడ్డూ, ప్రసాదాల నాణ్యత ప్రమాణాల పరిశీలనకు నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో శీనా నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలలో సీఎం, దేవదాయ శాఖ మంత్రి సమక్షంలో సమీక్షా సమావేశం జరిగింది. కొనసాగింపుగా మంగళవారం దేవదాయ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి, కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. తాజా సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ, దేవదాయ శాఖ కమిషనర్ సూచించిన మేరకు ఈవో శీనానాయక్ ఆయా విభాగాల వారికి సూచనలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే ఈనెల 9న దేవదాయ కమిషనర్‌తో సమీక్షా సమావేశం ఉన్నందున ఆయా విభాగాల అధికారులు తమ విభాగాలపై పట్టు సాధించి పేర్కొన్న అంశాలను తూ.చ తప్పక పాటించాలని, అందుకు సంబంధించిన రోజువారీ నివేదికలు సమర్పించాలని సూచించారు.

దేవస్థానంలో సీసీ టీవీ కెమెరాల నిర్వహణలో స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అన్ని కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా కెమెరాలు పెట్టవలసిన ప్రదేశాలను గుర్తించారు. 90 రోజుల పాటు సీసీ ఫుటేజీ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ ప్రతి రోజూ సీసీ టీవీల స్క్రీన్‌లను పరిశీలించి నివేదికలను ఈఓకు సమర్పించటంతో పాటు అన్ని కెమెరాల పనితీరుపై స్క్రీన్ షాట్‌లు కూడా పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. స్క్రీన్ షాట్‌ను దేవదాయ శాఖ కార్యాలయానికి, ఐటీ వింగ్ వారికి కూడా ఏరోజుకు ఆరోజు పంపించాలని సూచించారు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలను నమోదు చేసే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల పేరు, వివరాలు, ఫోన్‌నెంబర్లతో సహా దేవాలయ కార్యాలయ ఇంటర్నెట్ లింకుకు అనుసంధానం చేయాలన్నారు. అన్న ప్రసాదాల విభాగంలో ప్రతి అంశాలను పరిశీలించేందుకు చర్యలు తీసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. దేవాలయంలో అధిక వసూళ్లను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్లోక్‌రూమ్, చెప్పులస్టాండ్, కళ్యాణకట్ట తదితర ప్రాంతాలలో భక్తుల నుంచి అధిక వసూళ్లు చేసి ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు.

లీజుల వ్యవహారాల్లో కోర్టు కేసులను ఎప్పటికప్పుడు ఈఓకు తెలియజేసి తగు సూచనలు తీసుకుని పరిష్కరించాలన్నారు. తిరుమలలో సేవకుల విధానాన్ని దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కూడా ఏర్పాటు చేయాలని, సేవకుల సేవలకు రిజిస్ట్రేషన్, సేవా సంస్థల నమోదు పేపర్ ప్రకటన ఇచ్చి నియమించాలన్నారు. సేవకులకు సేవా సంస్థల ద్వారా తాత్కాలిక గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, ఎరుపు రంగు దుస్తులు యూనిఫాంగా ఉంచాలని సూచించారు. ఈనెల 9న జరిగే సమావేశంలో వీటి అమలుపై ప్రగతి నివేదికను సమర్పించాలని, ఆదేశాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని సూచించారు

సంకల్పబలం కలిగిన నేత విద్యాసాగర్: ఎంపీ

విజయవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సామరస్యపూర్వకంగా సమస్యలను చాకచక్యంగా పరిష్కరించగలిగే సంకల్పబలం కలిగిన ఏకైక నేత విద్యాసాగర్ అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మంగళవారం ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత అలపర్తి విద్యాసాగర్ ఎంపీ చిన్నిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విద్యాసాగర్ ఎన్నికతో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చక్కని పునాది ఏర్పడిందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. పోరాటపటిమ కలిగిన నాయకులు కనుమరుగవుతున్న కాలంలో విద్యాసాగర్ లాంటివారు అరుదుగా ఉంటారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వక సంబంధాలు అవలంబిస్తుందన్నారు. తిరువూరులో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేయాలని ఇటీవల ఎన్జీజీఓ నాయకులు కోరారని ఎంపీ చిన్ని తెలిపారు. అనంతరం ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చిత్తశుద్ధితో సహకరిస్తానన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు సకాలంలో పరిష్కారం అవుతాయని రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నమ్మకంతో ఉన్నారన్నారు. ఎంపీ చిన్నిని కలిసిన వారిలో జేఏసీ నేతలు కె.జగదీశ్వరరావు, డి.వి.రమణ, పుట్టగుంట సతీష్, రత్నబాబు, జిల్లా అధ్యక్షుడు డిఎస్ఎన్ రెడ్డి, సిటీ ఉపాధ్యక్షుడు వి.నాగార్జున, అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ ఉన్నారు.

అధికారం కోసం కుయుక్తులు

- వైఎస్ జగన్‌పై ఐపీఎస్ మాజీ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శలు
- థర్డ్ డిగ్రీ ప్రయోగించి నేరం ఒప్పించాలని చూశారు
- జగన్ చర్యలతో ఆర్థికంగా చితికిపోయిన వడ్డెర కుటుంబాలు
- తప్పుడు కేసులు పెట్టిన అధికారులు, పెట్టించిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- లోకేశ్, బొండా ఉమా పేర్లు చెప్పమని చిత్రహింసలు పెట్టారన్న బాధితులు

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గులకరాయి డ్రామాలు తెరపైకి తెచ్చి పేదలను బలిచేసి తద్వారా సానుభూతి పొంది అధికారంలోకి రావాలని ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుయుక్తులు పన్నారని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. జగన్ గులకరాయి కేసులో నిందితులుగా ఉన్న అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీ ప్రాంతానికి చెందిన వేముల దుర్గారావు, వేముల సతీష్, డేరంగుల సంతోష్ అలియాస్ చిన్నా, వేముల సతీష్ కుటుంబాలను మంగళవారం న్యాయవాది సలీంతో కలిసి ఏబీ వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా గులకరాయి కేసులో నిందితులుగా ఉన్న యువకులతో మాట్లాడి నాడు ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. దీంతో యువకులు వారి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ గత ప్రభుత్వం కారణంగా తాముపడ్డ నరకాన్ని వివరించారు. స్థానిక కార్పొరేటర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి రూ.200 ఇస్తామంటే తాము జగన్ పర్యటనకు వెళ్లి వచ్చామని అంతకు మించి ఏ పాపం తెలియదన్నారు. రెండు రోజుల తర్వాత పోలీసులు వచ్చి గంజాయి తాగుతున్నారని, కౌన్సెలింగ్ ఇస్తామని ఇంటి నుంచి స్టేషన్‌కు తీసుకెళ్లారని, అక్కడికి వెళ్లాక జగన్‌పై రాళ్లు వేసింది తామేనని ఒప్పుకోవాలని పోలీసులు చేశారన్నారు. ఇందులో భాగంగా అప్పుడే తెలుగుదేశం పార్టీలో చేరి చురుగ్గా పనిచేస్తున్న వేముల దుర్గారావు పేరు చెప్పమన్నారని తెలిపారు. తామెలా చెబుతామని ప్రశ్నించగా ఐదు రోజులపాటు చిత్రహింసలు పెట్టారన్నారు. చివరకు బలవంతంగా వేముల దుర్గారావు పేరు చెప్పించారని, అనంతరం అతడిని కూడా పిలిపించి రహస్యంగా చిత్రహింసలు పెట్టారన్నారు. అనంతరం దుర్గారావు తనపై జరిగిన దాష్టీకాన్ని ఏబీ వెంకటేశ్వరరావుకు వివరించాడు. ఇష్టానుసారంగా తనను చావబాది అప్పటి ప్రతిపక్ష నేతలు లోకేశ్, బొండా ఉమా పేర్లు చెప్పాలని, అందుకు రూ.2లక్షల నగదుతో పాటు వైసీపీలో పదవి ఇస్తామని, లేకుంటే కుటుంబ సభ్యులను కాల్చి చంపేస్తామని బెదిరించారన్నారు. దీని వెనుక ఎమ్మెల్సీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి ఉన్నారన్నారు. అనంతరం ఏబీ వెంకటేశ్వరరావు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈ ఘటనలను పరిశీలిస్తే ఎన్నికల్లో గెలిచేందుకు జగన్, వైసీపీ నేతలు భారీ స్కెచ్ వేసినట్టు తెలుస్తోందన్నారు. ఇందుకు ఆర్థికంగా భరోసా లేని వడ్డెర కుటుంబాలను ఎంపిక చేసినట్టు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఓ ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా ఆడి సానుభూతి పొందేందుకు శ్రీనును బలిచేశారని, తర్వాత ఎన్నికల్లో సొంత బాబాయిని చంపించి సానుభూతి పొందారని, గత ఎన్నికల్లో కోసం పేద కుటుంబాలను బలిచేశారని దుయ్యబట్టారు. ఏడాది గడుస్తున్నా బాధితులు స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, వారికి న్యాయం జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ రుహుల్లా, ఆ పార్టీ నేత అవుతు శ్రీనివాసరెడ్డి, అప్పటి సీపీ, పోలీసు అధికారులు బాధ్యత వహించాలన్నారు. బాధితులకు నష్టపరిహారం అంది కేసుల నుంచి విముక్తి పొందేవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలతో నగర పోలీసు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.


పోలీసు దెబ్బల తాలూకు గాయాలను చూపుతున్న బాధితులు

ఇక చెన్నై పెట్రోలియం..
పెట్రోల్ పంపులు

రూ.400 కోట్ల పెట్టుబడి

తొలుత తమిళనాడులో ఏర్పాటు

చెన్నై: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అనుబంధ సంస్థ చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) రిటైల్ ఇంధన విక్రయ విభాగంలోకి అడుగుపెడుతోంది. వ్యాపార విస్తరణలో భాగంగా.. పెట్రోల్, డీజిల్ విక్రయాల కోసం సొంతంగా రిటైల్ పంపులు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ శంకర్ వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం వచ్చే రెండు మూడేళ్లలో రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. సంస్థ డైమండ్ జూబ్లీ సందర్భంగా ఈ ఏడాదే తొలి పెట్రోల్ పంపును ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. పెట్రోల్ పంపుల ఏర్పాటుకు సీపీసీఎల్ ఇప్పటికే కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు పొందింది. తొలుత ఈ పంపులను తమిళనాడులో ప్రారంభించి ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు.

● ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఆక్సిలో ఫిన్‌సర్వ్.. ఇండియాఎడ్ పేరుతో వడ్డీ రహిత స్కూల్, ట్యూషన్ ఫీజుల ఫైనాన్సింగ్ సేవలను ప్రారంభించింది. విద్యార్థులు, విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను పరిష్కరించే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇండియాఎడ్ కింద రూ.20,000 నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను అందించనుంది. రుణాల చెల్లింపు కాలపరిమితి 3 నెలల నుంచి 72 నెలల వరకు ఉంటుందని తెలిపింది.



పసిడి ర్యాలీకి బ్రేక్?

15% వరకు తగ్గనున్న ధర

క్వాంటమ్ ఎంఎఫ్ అంచనా

న్యూఢిల్లీ: పసిడి ర్యాలీకి బ్రేక్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే రెండు నెలల్లో డాలర్లపరంగా పసిడి ధర 12 నుంచి 15 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ తన నెలవారీ నివేదికలో తెలిపింది. మంగళవారం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి పసిడి ధర 3,350 డాలర్ల వద్ద ట్రేడైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో నమోదైన 3,500 డాలర్లతో పోలిస్తే ఇది 150 డాలర్లు తక్కువ. భారత మార్కెట్లోనూ ఏప్రిల్‌లో రూ.లక్ష ఎగువన ట్రేడైన 10 గ్రాముల మేలిమి బంగారం ప్రస్తుతం రూ.లక్ష దిగువన ట్రేడవుతోంది. అయితే మధ్య, దీర్ఘకాలిక పెట్టుబడులకు మాత్రం బంగారం ఇప్పటికీ ఆకర్షణీయంగానే కనిపిస్తోందని క్వాంటమ్ ఎంఎఫ్ తన నివేదికలో తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్య, దీర్ఘకాలిక లాభాల కోసం చూసే మదుపరులు తమ పెట్టుబడుల్లో ఎంతో కొంత పసిడిలో మదుపు చేయడం మంచిదని సూచించింది.

ధర పతనానికి కారణాలు

- ప్రధాన కరెన్సీలతో పుంజుకుంటున్న డాలర్ మారకం రేటు
- అమెరికా-చైనా సుంకాల యుద్ధం ముగుస్తుందనే అంచనాలు
- కొనసాగుతున్న లాభాల స్వీకరణ అమ్మకాలు

విద్యాలక్ష్మి పథకంపై వడ్డీ 0.20% తగ్గింపు

పీఎన్‌బీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) విద్యాలక్ష్మి పేరిట అందిస్తున్న విద్యా రుణాలపై వడ్డీ రేటును 0.20 శాతం మేరకు తగ్గించింది. ఈ తగ్గింపుతో ఈ పథకంపై కనీస వడ్డీ 7.5 శాతానికి తగ్గుతుంది. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్న తమ కట్టుబాటుకు ఇది నిదర్శనమని పీఎన్‌బీ తెలిపింది. దేశంలో అత్యున్నత నాణ్యత గల విద్యను అందిస్తున్న 860 విద్యా సంస్థల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇది అందుబాటులో ఉంటుంది.

భారత్‌లో పన్నుల భారం ఎక్కువ

ఎయిర్‌పోర్టు చార్జీలూ ఎక్కువే

ఐఏటీఏ చీఫ్ విల్లీ వాల్ష్



న్యూఢిల్లీ: భారత విమానయాన రంగంపై ప్రభుత్వం విధిస్తున్న పన్నులపై ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. పన్నుల నిర్వచనంలోనూ స్పష్టత లేకుండా పోతోందని ఐఏటీఏ వార్షిక సదస్సుకు హాజరైన ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. ఈ విషయంలో స్పష్టత ఏర్పడితే తప్ప భారత్‌లో విమానయాన రంగం తన శక్తికి తగ్గట్టు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం లేదని స్పష్టం చేశారు. భారత విమానాశ్రయాల్లో వసూలు చేస్తున్న చార్జీలపైనా వాల్ష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో మరే దేశంలోనూ భారత ఎయిర్‌పోర్టుల్లో ఉన్నన్ని చార్జీలు లేవన్నారు. ఈ చార్జీలు విమానయాన సంస్థలకు భారం కాని స్థాయిలో ఉండాలన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా భారత్‌లో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ విషయంలో భారత్ త్వరలోనే చైనాను మించిపోతుందని వాల్ష్ స్పష్టం చేశారు.

అద్భుత అవకాశాలు: వర్జిన్ అట్లాంటిక్

విమానయానానికి సంబంధించి భారత్ అద్భుత అవకాశాల గని అని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే వర్జిన్ అట్లాంటిక్ విమానయాన సంస్థ తెలిపింది. భారత-బ్రిటన్ ఎఫ్‌టీఏ నేపథ్యంలో సరుకు రవాణ కోసం భారత్‌కు మరిన్ని విమాన సర్వీసు ప్రారంభించబోతున్నట్టు ఆ సంస్థ సీఈఓ షాయ్ వీస్ చెప్పారు. అమెరికా తర్వాత ప్రస్తుతం భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అన్నారు.

భారత్ నుంచి ప్రస్తుతం ఏటా తమ విమానాల ద్వారా 10 లక్షల మంది ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తన సాంకేతిక వ్యవస్థలను ఏఐ ఆధారిత సొల్యూషన్స్‌తో ఆధునీకరించేందుకు వర్జిన్ అట్లాంటిక్ సంస్థ టీసీఎస్‌తో ఐఏటీఏ సదస్సు సందర్భంగా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

మార్కెట్లోకి టాటా హారియర్ ఈవీ

ప్రారంభ ధర రూ.21.49 లక్షలు



ముంబై: టాటా మోటార్స్.. మార్కెట్లోకి హారియర్ ఈవీని తీసుకువచ్చింది. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఒకసారి చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. హారియర్ ఈవీ ప్రారంభ ధర రూ.21.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్). జూలై 2వ తేదీ నుంచి దీని బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. నెలకి 25,000 వాహనాలు అమ్ముడుపోతున్న ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇది సహాయకారి అవుతుందని ఈ కారు విడుదల సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ చంద్ర అన్నారు. హారియర్ ఈవీతో ఆఫ్ రోడ్ ప్రయాణాలపై ఆసక్తి గల కొత్త శ్రేణి కస్టమర్లను తాము ఆకర్షించ వచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇది ఆల్ వీల్ డ్రైవ్, 504 నానోమీటర్ల టార్క్‌తో అందుబాటులోకి వస్తోందని ఆయన అన్నారు. హారియర్.ఈవీ 75 కిలోవాట్ ఆప్షన్ సహా రెండు బ్యాటరీ ప్యాక్‌లతో అందుబాటులో ఉంటుంది. ఈ బ్యాటరీ ప్యాక్‌లకు జీవితకాల వారెంటీ ఇస్తున్నట్టు కంపెనీ తెలిపింది. ఆటో పార్క్ అసిస్ట్, 6 టెర్రైన్ మోడ్, 55 కనెక్టెడ్ ఫీచర్లు హారియర్. ఈవీ ప్రత్యేకతలు. కేవలం 6.3 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని వెల్లడించింది.

వలసలపై ఉద్యోగుల ఆసక్తి

కొత్త బాధ్యతల కోసం పరుగులు

మైఖెల్ పేజ్ ఇండియా

న్యూఢిల్లీ: మన దేశంలోనూ ఉద్యోగుల అభిరుచులు మారిపోతున్నాయి. గతంలోలా ఉన్న ఉద్యోగాన్నే పట్టుకుని వేలాడేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. మంచి, కొత్త బాధ్యతలు, ఉద్యోగాల నిర్వహణలో వెసులుబాటు కోసం చూస్తున్నారు. పని చేస్తున్న కంపెనీల్లో ఈ అవకాశాలు లేకపోతే అందుకు అవకాశాలు కల్పించే కంపెనీలకు మారిపోవడానికి ఏ మాత్రం వెనకాడడం లేదు. మైఖెల్ పేజ్ ఇండియా అండ్ సింగపూర్ సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 3,000 మంది వృత్తి నిపుణులను సర్వే చేసి ఈ నివేదికను రూపొందించింది. దీంతో ఈ సంవత్సరం 62 శాతం మంది నిపుణులు, ఉన్న కంపెనీల్లోనే జీతాలు పెంచుకుంటే, 37 శాతం మంది ప్రమోషన్లు సంపాదించుకోగలిగారు. ప్రస్తుత ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఉద్యోగ భద్రత కంటే ప్రమోషన్లు, జీతాలు, పనిలో వెసులుబాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారని మైఖెల్ పేజ్ ఇండియా సంస్థ సీనియర్ ఎండీ నిలయ్ ఖండేల్‌వాల్ చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,060 ▲	90,800 ▲	1,11,100 ▲
విజయవాడ	1,00,300 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,910 ▲	90,800 ▲	1,11,100 ▲
రాజమండ్రి	99,050 ▲	90,800 ▲	1,03,200 ▲
ప్రొద్దుటూరు	97,000 ▲	89,240 ▲	1,00,500 ▲
ముంబై	96,867 ▲	88,730 ▲	1,00,460 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ



హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	112
కరీంనగర్	105	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	101	అనంతపురం	105
గోదావరి	109		

81,000 దిగువకు సెన్సెక్స్

మూడో రోజూ నష్టాల బాటలోనే..

ముంబై: విదేశీ నిధుల తరలింపు, పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ అస్థిరతల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా నష్టాలతో ముగిసింది. ఎనర్జీ, ఫైనాన్స్, ఐటీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. మంగళవారం రోజంతా ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 636.24 పాయింట్లు నష్టపోయి 80,737.51 వద్ద స్థిరపడగా నిఫ్టీ 174.10 పాయింట్ల నష్టంతో 24,542.50 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 798.66 పాయింట్ల మేరకు దిగజారి కనిష్ఠ స్థాయి 80,575.09ని తాకింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.52%, స్మాల్‌క్యాప్ సూచీ 0.07% నష్టపోయాయి. కమోడిటీస్, రియల్టీ మినహా విభాగాల వారీ సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా మినహా మిగతా 29 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి.

నష్టాల్లో అదానీ షేర్లు: అదానీ గ్రూప్‌పై మరోసారి ఆరోపణలు చెలరేగిన నేపథ్యంలో ఆ గ్రూప్ షేర్లు నష్టాల బాట పట్టాయి. అదానీ పోర్ట్స్ 2.42%, ఎన్‌డీటీవీ 2.25%, అదానీ ఎనర్జీ 2.18%, అదానీ పవర్ 2.02% నష్టపోయాయి. నష్టాలతో ముగిసిన ఇతర షేర్లలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1.89%), అదానీ టోటల్ గ్యాస్ (1.62%), అదానీ గ్రీన్ (.158%), సంఘీ ఇండస్ట్రీస్ (1.16%), అంబుజా సిమెంట్ (.088%), ఏసీసీ (0.22%), ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ (0.06%) ఉన్నాయి.

6 ఐపీఓలకు సెబీ అనుమతి: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహా 6 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు జారీ చేయడానికి సెబీ అనుమతి ఇచ్చింది. ఈ అనుమతి పొందిన ఇతర కంపెనీల్లో విక్రమ్ సోలార్, డోర్ఫ్-కెటాల్ కెమికల్స్, ఏ-వన్ స్టీల్స్ ఇండియా, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్, శ్రీజి షిప్పింగ్ గ్లోబల్ ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిసి రూ.20,000 కోట్లు సమీకరించనున్నాయి.

● అపోలో మైక్రోసిస్టమ్స్.. ప్రిఫరెన్షియల్ షేర్లు, వారంటీల జారీ ద్వారా రూ.416 కోట్లు సమీకరించినట్లు ప్రకటించింది. ప్రమోటర్ గ్రూప్, ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిత్య కుమార్ హల్వాసియాలకు వీటిని జారీ చేయటం ద్వారా ఈ మొత్తాలను సమీకరించినట్లు తెలిపింది.

అమెరికా బీటీఏపై జర జాగ్రత్త


మన సాగుకు రక్షణ తప్పనిసరి: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: డొనాల్డ్ ట్రంప్ సుంకాల నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుగుతున్న చర్చల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాన్ని నీతి ఆయోగ్ కోరింది. దీనికి సంబంధించి తన సూచనలతో ఒక పత్రాన్ని విడుదల చేసింది. మన రైతాంగ జీవనోపాధికి కీలకమైన ఉత్పత్తులకు దిగుమతుల నుంచి రక్షణ తప్పనిసరి అని స్పష్టం చేసింది. లేకపోతే దేశంలో వీటి ధరల స్థిరీకరణ కూడా కష్టమవుతుందని హెచ్చరించింది. అయితే అదే సమయంలో మన దేశంలో కొరతగా ఉన్న వంటనూనెలు, నూనె గింజలు, పెద్దగా సాగు చేయని బాదం, పిస్తా, అక్రోట్ వంటి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను జీరో లేదా తక్కువ దిగుమతి సుంకాలతో అనుమతించ వచ్చని సూచించింది. అమెరికా పౌల్ట్రీ ఉత్పత్తులను మాత్రం జీరో డ్యూటీతో అనుమతించ వద్దని కోరింది. సుంకేతర అడ్డంకుల (నాన్ టారిఫ్ బ్యారియర్స్) ద్వారానైనా ఈ దిగుమతులను అడ్డుకోవాలని నీతి ఆయోగ్ సూచించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

రాజాసాబ్ వచ్చేది అప్పుడే



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్'. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం కొంతకాలంగా వేయి కళ్లతో ఎదురుచూస్తున్న అభిమానులకు తియ్యటి కబురందించారు మేకర్స్. సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఈ నెల 16న టీజర్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. "మీ అందరికీ ప్రామిస్ చేసినట్లే మీరు చూడాలనుకుంటున్న విధంగా ప్రభాస్‌ను వెండితెరపై చూస్తారు. ఆ రోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి" అని పేర్కొన్నారు. కాలిపోతున్న డబ్బుల కట్టల ముందు నిల్చున్న ప్రభాస్ స్టిల్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలు.

మంచి చిత్రాన్ని అందించారు

ఇళయరాజా



ఇటీవలె విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతున్న చిత్రం 'షష్టిపూర్తి'. ఇళయరాజా సంగీతం అందించి సినిమా విజయంలో కీలక పాత్ర పోషించారు. మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'షష్టిపూర్తి' టీమ్ ఆయనను చెన్నైలో కలిసి శుభాకాంక్షలు తెలిపింది. డా.రాజేంద్రప్రసాద్ ఇళయరాజాకు పుష్పాభిషేకం చేశారు. ఇలాంటి మంచి సందేశం ఉన్న సినిమాను ప్రేక్షకులకు అందించినందుకు చిత్రబృందాన్ని అభినందించారు ఇళయరాజా. కాగా, రాజేంద్రప్రసాద్, రూపేశ్, అర్చన, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని పవన్‌ప్రభ తెరకెక్కించారు.

తొలి ప్రేమే తోపు కాదే!



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరి ప్రియ జంటగా రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'చెన్నై లవ్‌స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. రవి నంబూరి దర్శకత్వంలో సాయిరాజేశ్, ఎస్కేన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్, గ్లింప్స్‌ని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. 'తొలి ప్రేమేం తోపు కాదు.. ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది' అని చెబుతూ సాగిన గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. అంతం వరకూ అనంతమై సాగే ఈ జీవితంలో తొలి ప్రేమ ఒక మజిలీ మాత్రమే అనీ, అదే తుది కాదనే కాన్సెప్ట్‌ను ఈ గ్లింప్స్ ద్వారా మేకర్స్ అందంగా తెలియజేశారు. ఈ గ్లింప్స్‌కు 'తొలి ప్రేమే తోపు కాదే తోపు కాదే..' అంటూ సంగీత దర్శకుడు మణిశర్మ బీజీఎం కంపోజ్ చేశారు.

ఆ నలుగురే కారణం

ప్రతాని రామకృష్ణ గౌడ్



తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైన థియేటర్ల సమస్యకు ఇండస్ట్రీలోని నలుగురు వ్యక్తులే కారణమని, వారే తమ స్వార్థంతో థియేటర్స్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను నాశనం చేస్తున్నారని టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆరోపించారు. టీఎఫ్‌సీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'గద్దర్ అవార్డుల్లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. నేను 1992లో ఇండస్ట్రీకి వచ్చాను. 2002 వరకు థియేటర్లలో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత కొందరు తమ స్వార్థంతో రెంట్ సిస్టమ్ మొదలు పెట్టారు. ఏపీలో థియేటర్ల వ్యవస్థ ప్రక్షాళనకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చర్యలను అభినందిస్తున్నాం' అని అన్నారు.

థగ్‌లైఫ్.. కమల్‌హాసన్ పారితోషికం ఎంత?



చెన్నైలో జరిగిన 'థగ్‌లైఫ్' ఆడియో వేడుకలో కన్నడ భాష గురించి కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత కర్ణాటకలో జరిగిన పరిణామాల గురించి తెలిసిందే. దీంతో ఈ సినిమాను ప్రస్తుతానికి కర్ణాటకలో విడుదల చేయకూడదని నిర్ణయించుకున్నారు హీరో, చిత్ర నిర్మాతల్లో ఒకరైన కమల్‌హాసన్. ఈ విషయాన్ని ఆయన హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో క్రేజ్ ఏ మాత్రం తగ్గట్లేదు. 'నాయకుడు' సినిమా తర్వాత 38 ఏళ్లకు కమల్ హాసన్, మణిరత్నం కలయికలో తెరకెక్కిన చిత్రం కావడంతో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో హింట్ ఇచ్చాయి. దీంతో సినిమాను తొలిరోజే చూడడానికి సిద్ధమవుతున్నారు సినీ ప్రియులు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో జోరు చూపిస్తోంది చిత్రం. ఆన్‌లైన్‌లో టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ జోరు చూస్తుంటే ఈ ఏడాదిలో ఇంత వరకూ వచ్చిన సినిమాల కంటే 'థగ్‌లైఫ్' అత్యధిక ఓపెనింగ్స్‌ను తెచ్చుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు ట్రేడ్ పండితులు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన బడ్జెట్, నటీనటుల పారితోషికాల వివరాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

బడ్జెట్.. నటీనటుల పారితోషికాలు

కమల్‌హాసన్, మణిరత్నం సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్ర బడ్జెట్ దాదాపు రూ.300 కోట్లు అని తెలుస్తోంది. ఈ చిత్రానికి వారిద్దరూ ప్రత్యేకంగా పారితోషికాలు తీసుకోలేదు. ఈ సినిమా విడుదల తర్వాత వచ్చిన లాభాల్లో వాటాను పంచుకోనున్నారు. శింబు రూ.40 కోట్ల పారితోషికాన్ని అందుకున్నారని తెలిసింది. త్రిష రూ.12 కోట్లు తీసుకున్నారని సమాచారం. ఇది ఇంతకు ముందు ఆమె నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం కంటే మూడింతలు ఎక్కువని టాక్. అలాగే, ఇందులో కీలక పాత్రలు పోషించిన జోజు జార్జ్, అశోక్ సెల్వన్, అభిరామి కూడా మంచి మొత్తాన్నే అందుకున్నారట. ఈ గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్ ఈ గురువారం ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

వానల్లో వయ్యారంగా...

చిత్తడిలో నేల మీద జీరాడే దుస్తులు ధరించలేం! కాబట్టి ప్రత్యేకించి వాన రోజుల్లో కురచ గౌన్లకే ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు అమ్మాయిలు. అలాంటి కొన్ని చిట్టి పొట్టి గౌన్ల మీద ఓ లుక్కేద్దామా?





మోకాలి పొడవు గౌన్లు ధరించడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు చూడముచ్చటగా కనిపిస్తాయి. పూలు, లతల డిజైన్లు, జామెట్రిక్ డిజైన్లు... ఇలా భిన్నమైన డిజైన్లతో, భిన్నమైన వస్త్రాలతో రూపొందే షార్ట్ గౌన్స్‌కు అనువైన కాలమిది. అయితే వీటిని ధరించేటప్పుడు కొన్ని అంశాలు దృష్టిలో పెట్టుకోవాలి. అవేంటంటే...

- కాటన్, లినెన్, జార్జెట్, స్పన్... ఇలా గౌన్లు ఎన్నో రకాల వస్త్రాలతో తయారవుతూ ఉంటాయి. అయితే ఒడ్డు పొడవుల ఆధారంగా ఎవరికి వారు ఈ గౌన్లను ఎంచుకోవాలి. నాజూకుగా ఉన్న మహిళలు కాటన్, లినెన్ గౌన్లను ఎంచుకోవచ్చు. బొద్దుగా ఉండేవారికి స్పన్, జార్జెట్ గౌన్లు బాగుంటాయి
- బ్లంట్ హీల్స్, పెన్సిల్ హీల్స్. వీటిలో ఏ జోళ్లు ధరించినా గౌన్లకు చక్కగా మ్యాచ్ అవుతాయి. అయితే ఇది వానాకాలం కాబట్టి తోలుతో తయారైన జోళ్లకు బదులుగా ఇతరత్రా మెటీరియల్స్‌తో తయారైన వాటినే ఎంచుకోవాలి.
- ఈ గౌన్లతో కృత్రిమ ఆభరణాలు, జర్మన్ సిల్వర్ ఆభరణాలు ధరించవచ్చు. ఈ ఆభరణాలు వీలైనంత సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి
- ఇక మిగతా యాక్సెసరీస్ విషయానికొస్తే పర్సులకు బదులుగా స్లింగ్ బ్యాగ్స్ గౌన్లకు చక్కగా నప్పుతాయి. చేతులకు బ్యాంగిల్స్‌కు బదులుగా పెద్ద డయల్ కలిగిన వాచీలను ఎంచుకోవాలి.

ధనురాసనం వేద్దామా..?

వేసవిలో ఎండ వేడివల్ల అలసటగా నీరసంగా అనిపిస్తూ ఉంటుంది. వీటిని నివారించి ఉత్సాహంగా ఉండాలంటే... ప్రతిరోజూ యోగా చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ యోగాలో ముఖ్యమైన భంగిమ 'ధనురాసనం'. దీని గురించి తెలుసుకుందాం.



ధనురాసనం ఇలా వేయాలి

- ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. మోకాళ్ల నుంచి కాళ్లను పైకి ఎత్తాలి. చేతులను వెనక్కి చాచి కాలి మడమలను పట్టుకోవాలి. మెడను నిటారుగా ఉంచాలి. గుండె నిండా గాలిని పీల్చి పదిహేను సెకండ్లు అలాగే ఉండి తరవాత గాలిని మెల్లగా విడవాలి.

ప్రయోజనాలు

- ప్రతిరోజూ ధనురాసనం వేయడం వల్ల కండరాలు, కీళ్లు బలోపేతమవుతాయి. శరీరం అన్ని వైపులకూ సులువుగా వంగుతుంది.
- ఈ ఆసనం వేసేటప్పుడు పొత్తి కడుపు కండరాల మీద ఒత్తిడి పడడం వల్ల అవి దృఢంగా తయారవుతాయి. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. జీర్ణాశయం చురుకుగా పనిచేసి అజీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.
- వెనక్కి వంగడం వల్ల వెన్నెముక బలపడుతుంది. నడుము వంగకుండా ఉంటుంది. నిటారుగా నిలబడి నడిచే సామర్థ్యం పెరుగుతుంది.
- తరచూ ఈ ఆసనం వేస్తూ ఉంటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీంతో అలసట, నీరసం, శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి.
- ధనురాసనం వేసే క్రమంలో రెండు కాళ్లు పైకి లేపడం వల్ల శరీరమంతటా రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. దీంతో గుండె, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి.
- కార్యాలయాల్లో ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవారు ప్రతిరోజూ ఈ ఆసనం వేస్తూ ఉంటే భుజాలు, మెడ, తల నొప్పులు సహా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- దీర్ఘంగా శ్వాస పీల్చడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.

కరాటే సిస్టర్స్

అమృతారెడ్డి, ఘనసంతోషిణిరెడ్డి... ఈ అక్కాచెల్లెళ్లు రికార్డులకు పెట్టింది పేరు. బద్దలు కొట్టడంలో కాదు... సరికొత్తవి సృష్టించడంలో. ఒకటా రెండా... కరాటేలో వీరు సంచలనాలకు మారుపేరు. ఇటీవలే 121 ఆత్మరక్షణ మెళకువలను కేవలం 9.36 నిమిషాల్లో ప్రదర్శించి మరో ప్రపంచ రికార్డు నెలకొల్పారు. అంతర్జాతీయ క్రీడాకారులుగానూ సత్తా చాటుతున్నారు. రెండేళ్ల వయసులోనే మొదలైన తమ కరాటే జర్నీ గురించి అమృతారెడ్డి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.



"మనం రోజూ చూస్తున్నాం... ఎక్కడో అక్కడ మహిళల మీద నిత్యం ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వీటి నుంచి తమను తాము రక్షించుకొనేలా ఆడపిల్లలు దృఢంగా మారాలి. అందుకు కరాటేలాంటి మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడతాయి. కరాటే నేర్చుకొంటే ఆత్మరక్షణ మెళకువలు తెలుస్తాయి. దానివల్ల ఆత్మవిశ్వాసం, శరీర దారుఢ్యం పెరుగుతాయి. ఈ రెండూ తోడుంటే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ధైర్యంగా ఎదిరించగలుగుతాం. ఇవన్నీ ఆలోచించే నాకు, మా చెల్లి ఘనసంతోషిణికి మా నాన్న గోపాల్ రెడ్డి చిన్న వయసులోనే కరాటే శిక్షణ ప్రారంభించారు. నేను రెండేళ్లప్పుడు మొదలుపెడితే... చెల్లి తన మూడో ఏట ఇందులోకి వచ్చింది. అప్పటి నుంచి నిర్విరామంగా మా శిక్షణ సాగుతూనే ఉంది. మా నాన్నావాళ్లది కరీంనగర్. మేం పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లో. నాన్నకు ఇక్కడ కరాటే అకాడమీ ఉంది. నాకు ఒక తమ్ముడు. వాడు కూడా కరాటే నేర్చుకొంటున్నాడు. మా అమ్మ మాధవి గృహిణి. తను మినహా ఇంట్లో అందరం కరాటేలో ఉన్నాం. అమ్మ మా అందరికీ కావల్సినవన్నీ అందించి, ఎంతో ప్రోత్సహిస్తుంది.

నాన్న స్ఫూర్తితో...

ఊహ తెలియకముందే మేం కరాటే అభ్యాసం మొదలుపెట్టాం. కానీ పెరిగేకొద్దీ దానిపై మాకు ఇష్టం ఎక్కువైంది. మాకు స్ఫూర్తి మా నాన్నే. ఆయన 1994 నుంచి వందలమంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఒకే ఏడాదిలో వివిధ రంగాలకు చెందిన లక్ష మంది మహిళలకు ఉచితంగా ఆత్మరక్షణ మెళకువలు నేర్పి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. మాలో ఆత్మస్థైర్యం నింపి, ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలనేది ఆయన కోరిక. నాన్న మాకు గురువు మాత్రమే కాదు... మార్గదర్శి కూడా.

అన్నీ రికార్డులే...

ప్రస్తుతం నేను బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్నాను. చెల్లి బీకాం ఫస్ట్ ఇయర్. తమ్ముడు టెన్త్. మేము చదువుకొంటూనే కరాటే అభ్యాసం కూడా కొనసాగిస్తున్నాం. నేనూ, మా చెల్లి కలిసి చాలా కొత్త రికార్డులు సృష్టించాం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏటా ఏదో ఒక రికార్డు ప్రదర్శన ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఒక్కో ఏడాది ఒక్కో థీమ్. ఒక ఏడాది 365 టైల్స్‌ను 365 సెకన్లలో పగులగొట్టాను. మరోసారి మేకులపై పడుకున్న నా మీద గ్రెనేట్ రాయి పెడితే... మాస్టర్ దాన్ని పగులకొడతారు. ఒక్కో రాయి 150 నుంచి 220 కిలోల బరువు ఉంటుంది. అలా 36 రాళ్లు 3 నిమిషాల్లో బ్రేక్ చేయాలనేది మా ప్రయత్నం. కానీ రెండు సెకన్ల ముందే పూర్తయింది. తరువాత నేను, మా చెల్లి కలిసి ఒక ఫీట్ చేశాం. నా కింద, మీద మేకులు ఉంటాయి. నాపైనున్న మేకుల మీద చెల్లి పడుకుంటుంది. తనపై 60 నాపరాళ్లు ఒక్కొక్కటే పెట్టి బ్రేక్ చేయాలి. 3.05 నిమిషాల్లో సాధించాం. చెల్లి 85 సిరామిక్ టైల్స్‌ను 84 సెకన్లలో పంచ్‌తో పగులగొట్టింది. వీటిల్లో 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ కిడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'తో పాటు కొన్ని గిన్నిస్ రికార్డులు కూడా ఉన్నాయి. ఇవన్నీ అంతకముందు ఎవరూ చేయని ఫీట్స్.

మరో ఘనత...

ఇటీవల మేం మరో రికార్డు సృష్టించాం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 121 ఆత్మరక్షణ మెళకువల (సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్)ను 9.36 నిమిషాల్లో ప్రదర్శించాం. మేం అనుకున్నది 11 నిమిషాల్లో పూర్తి చేయాలని. కానీ దాదాపు ఒకటిన్నర నిమిషం ముందే పూర్తి చేయగలిగాం. కరాటేలోని ఒక్కో చాప్టర్‌లో 11 టెక్నిక్స్ ఉంటాయి. అలా 11 చాప్టర్స్‌లో 11 చొప్పున మొత్తం 121 ఆత్మరక్షణ మెళకువలను ఎంచుకున్నాం. మాలాగా అందరు అమ్మాయిల్లో ఆత్మస్థైర్యం నింపాలనేది ఈ ఫీట్ ఉద్దేశం. 'ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్', 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ఇది నమోదైంది.

అంతర్జాతీయ క్రీడల్లోనూ...

నేను అంతర్జాతీయ కరాటే క్రీడాకారిణి కూడా. ఇటీవల మలేషియా, సింగపూర్‌లో జరిగిన టోర్నీల్లో పాల్గొన్నాను. అలాగే 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' గేమ్స్‌లోనూ పోటీపడ్డాను. ఎన్నో పతకాలు గెలిచాను. మా చెల్లి కూడా జాతీయ స్థాయి క్రీడాకారిణి. ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ టోర్నీలకు వెళుతోంది. తను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక 'బాలసూర్య' ప్రభుత్వ అవార్డు అందుకుంది.

ఒలింపిక్స్... సివిల్స్...

ప్రస్తుతం నా లక్ష్యం ఒలింపిక్స్‌లో పతకం. అన్ని క్రీడల్లానే 'అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ' (ఐఓసీ)కి అనుబంధంగా 'ప్రపంచ కరాటే సమాఖ్య' (డబ్ల్యూకేఎఫ్) ఉంది. సమాఖ్య టోర్నీల్లో విజయాలు సాధించినవారికి మాత్రమే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఆ పోటీలకు వెళ్లాలంటే ఇరవై ఏళ్లు నిండి ఉండాలి. వయసు పరంగా ఇప్పుడే నేను అర్హత సంపాదించాను. వాటిల్లో మంచి ప్రదర్శన కనబరిచి దేశం తరుపున ఒలింపిక్స్ ఆడాలన్నదే నా సంకల్పం. రెండేళ్లుగా నేను కరాటేలో శిక్షణ కూడా ఇస్తున్నా. సాధ్యమైనంత మంది మహిళలకు ఆత్మరక్షణ మెలకువలు నేర్పించి, వారిని శక్తిమంతులుగా చేయాలనే లక్ష్యంతోనే శిక్షణ ప్రారంభించాను. సివిల్స్‌లో ర్యాంకు సాధించి దేశానికి సేవ చేయాలనేది నా కల. నా కలలు, లక్ష్యాలు నెరవేర్చుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాను."

సహనం అవసరం...

కరాటేకు ప్రధానంగా కావల్సింది సహనం. ఎలాగైనా నేర్చుకోవాలనే ఒక బలమైన సంకల్పం. లేదంటే ప్రయత్నం మధ్యలోనే ఆగిపోతుంది. సహనం అనుభవంతో వస్తుంది. నేర్చుకొనే క్రమంలో శారీరక దారుఢ్యం మెరుగవుతుంది. కరాటేలో వైట్ బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు 12 లెవెల్స్ ఉంటాయి. ప్రస్తుతం నేను, చెల్లి ఆఖరి లెవెల్ చేస్తున్నాం. ఇది పూర్తయితే మమ్మల్ని 'బ్లాక్ బెల్ట్ డాన్' అంటారు. ఆత్మరక్షణ కోసం అయితే రోజుకు గంట సాధన సరిపోతుంది. మేమైతే ఆరేడు గంటలు సాధన చేస్తున్నాం. నేర్చుకొంటూ... నేర్పిస్తున్నాం. శిక్షణ తీసుకొనేవారే కాదు, యువత అంతా జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. జంక్‌ఫుడ్ వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. అమ్మాయిలకు చెప్పేదేంటంటే... ప్రతిఒక్కరూ కచ్చితంగా కరాటే నేర్చుకోండి. దానివల్ల మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఫిట్‌నెస్ మెరుగవుతుంది. మనలో భయాలను పోగొడుతుంది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని, ఆత్మస్థైర్యంతో మనల్ని మనం రక్షించుకోగలుగుతాం. వేరొకరి సాయం కోసం ఎదురుచూడక్కర్లేదు. నా బలం అదే... ఆత్మవిశ్వాసం."

• హనుమా

నాదీ అదే కల...

అక్కలాగానే నాదీ అదే కల... ఒలింపిక్స్‌లో పాల్గొనాలి. సివిల్స్ ర్యాంకు సాధించి దేశానికి సేవ చేయాలి. అందుకే ఇటీవల మేం సాధించిన రికార్డును 'ఆపరేషన్ సిందూర్'కు అంకితం చేశాం. 2014లో, అంటే నాకు నాలుగున్నర ఏళ్లప్పుడు నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి నుంచి బహుముఖ ప్రజ్ఞగల బాలికగా 'బాలసూర్య' అవార్డు అందుకున్నాను. దాన్ని చూసినప్పుడు నా మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది. స్ఫూర్తి రగులుతుంది. మరికొన్ని అవార్డులు కూడా తీసుకున్నాను. అలాగే ఐదేళ్లప్పుడు 39 నిమిషాల్లో 3,315సార్లు నెక్ రొటేట్ చేసి కొత్త రికార్డు నెలకొల్పాను. దీంతోపాటు మహిళా సాధికారత కోసం నావంతు బాధ్యతగా సాధ్యమైనంతమందికి కరాటే నేర్పించాలనేది నా సంకల్పం.

- ఘనసంతోషిణి



అల్లం తాజాగా..!

మనం తరచూ అల్లాన్ని ఉపయోగిస్తూ ఉంటాం. అల్లం తాజాగా ఉంటేనే వంటకాల రుచి పెరుగుతుంది. అలాగే శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది. బజారు నుంచి కొని తెచ్చిన తరవాత సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే అల్లం త్వరగా చెడిపోతుంది. అలాకాకుండా అల్లాన్ని నిల్వ చేసే విధానాల గురించి తెలుసుకుందాం...



- అల్లాన్ని నిల్వ చేసేముందు దాన్ని నీళ్లతో శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. తేమ ఎక్కువగా లేకుండా పొడిగా ఉండేలా చూసుకోవాలి.
- శుభ్రంగా, పొడిగా ఉన్న అల్లాన్ని ఒక కాగితంలో చుట్టి గాలి చొరబడని డబ్బాలో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే నెల రోజుల పాటు నిల్వ ఉంటుంది. అదే గాలి ఆడేలా ఒక ప్లాస్టిక్ బుట్టలో పెడితే పది రోజులు వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.
- పేపర్ టవల్‌ను నీళ్లతో కొద్దిగా తడపాలి. దానితో అల్లాన్ని చుట్టి ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఫ్రిజ్‌లో పెడితే అల్లం తేమతో తాజాగా ఉంటుంది.
- అల్లాన్ని తడి మట్టితో కప్పి ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. మట్టి తడారిపోకుండా రెండు రోజులకు ఓసారి నీళ్లు చల్లుతూ ఉండాలి. పూర్వం ఈ పద్ధతినే అనుసరించేవారు.
- అల్లాన్ని చిన్న ముక్కలుగా తరిగి లేదంటే తురుముకుని జిప్‌లాక్ కవర్‌లో వేసి ఫ్రీజర్లో ఉంచితే ఆర్నెల్లు తాజాగా ఉంటుంది.
- తొక్కతీసి సన్నని ముక్కలుగా తరిగి ఎండలో ఆరబెట్టాలి. తేమ లేకుండా ఎండిన అల్లం ముక్కలను ఒక డబ్బాలో భద్రపరచుకుంటే ఏడాది పాటు వాడుకోవచ్చు.
- అల్లాన్ని సన్నగా తురిమి అందులో కొద్దిగా ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో నింపి గట్టిగా మూత బిగించి ఫ్రిజ్‌లో పెడితే నెల రోజులు తాజాగా ఉంటుంది.
- అల్లాన్ని పెద్ద మొత్తంలో నిల్వ చేయాల్సి వచ్చినప్పుడు దాన్ని ఒక గాజు సీసాలో వేసి పైన తగినంత వెనిగర్ లేదా తేనె వేసి ఉంచితే చాలు. దీనివల్ల అల్లం తాజాగా ఉండడమే కాకుండా దానిలోని ఔషధ గుణాలు పెరుగుతాయి.

చిన్న వయసులో పెద్ద మనసు

దాచుకున్న డబ్బుతో పిల్లలు బొమ్మలు, చాక్లెట్లు కొనుక్కుంటారు. కానీ మేఘాలయకు చెందిన ఏడేళ్ల ఆభా నోంగ్రమ్, పొదుపు చేసిన డబ్బుతో క్షయ రోగుల కోసం పోషకాహార కిట్లను సేకరించడం మొదలుపెట్టింది. చిన్న వయసుతో పెద్ద మనసుతో ఆలోచించిన ఆ పాప కథనమిది.

స్ఫూర్తి



క్షయ వ్యాధిని సమూలంగా తరిమికొట్టాలనే లక్ష్యంతో అలుపెరగని పోరాటానికి పూనుకున్న దేశం మనది. ఎన్ని ఆరోగ్య సేవలను అందించినా, ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టినా ఈ వ్యాధి ఇప్పటికీ ప్రజల ఆరోగ్యాలను కుదేలు చేస్తూనే ఉంది. సమర్థమైన మందులు ఉన్నప్పటికీ, తగిన పోషకాహారం కరవవడంతో ఈ వ్యాధి, ఏళ్ల తరబడి వేధిస్తూ, రోగులను మరణానికి చేరువ చేస్తోంది. ఈ విషయాన్ని గ్రహించిన రెండో తరగతి చదువుతున్న ఆభా, వ్యాధి నుంచి కోలుకోవడానికి తోడ్పడే పోషకాహారాన్ని క్షయ రోగులకు అందించాలనుకుంది. ఈ సంకల్పంతో తల్లితండ్రులు, బంధువులు ఇచ్చే జేబు డబ్బును పొదుపు చేసి, క్షయ రోగులకు పంచడం కోసం న్యూట్రిషన్ కిట్లను కొనుగోలు చేయడం మొదలుపెట్టింది.

ముఖ్యమంత్రి దృష్టిని ఆకర్షించి...

ఏదో ఒకనాటికి క్షయ రోగులను ప్రత్యక్షంగా కలుస్తాననే ఆశతో పోషకాహార మద్దతును అందించడంతో పాటు, క్షయ వ్యాధి వ్యతిరేక పోరాటంలో తనవంతుగా సహాయపడుతోంది ఆభా. ఈ పాప ప్రయత్నం మేఘాలయ ముఖ్యమంత్రి కొన్రాడ్ కె. సంగ్మాను కూడా ఆకర్షించింది. సంగ్మా, ఆభా కథను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడమే కాకుండా ఈ పాపను ఒక రోల్ మోడల్‌గా అభివర్ణించారు. "మేఘాలయకు చెందిన యువ క్షయ హీరోను కలవండి. ఏడేళ్లకే ఆభా నంగ్రమ్, తన జేబు డబ్బుతో న్యూట్రిషనల్ ప్యాక్‌లతో క్షయ రోగులకు సహాయపడుతోంది" అంటూ సామాజిక మాధ్యమాల్లో ఆభా మీద ప్రశంసలు కురిపించారు. రెండో తరగతి విద్యార్థిని ఆభా, మారథాన్ విజేత, తైక్వాండో ఛాంపియన్ కూడా! ఈ పాప తైక్వాండోలో రాష్ట్ర స్థాయిలో రజత పతకాన్ని సాధించింది. ఐదేళ్ల వయసుకే మారథాన్‌లో గెలుపొందింది.



వేల మంది ప్రతిన పూని...

దేశ వ్యాప్తంగా 2,54,000 మంది నిక్షయ్ మిత్రలు ఉన్నారు. వీరిలో ఆభాతో సహా మరో 314 మంది మేఘాలయలోనే ఉన్నారు. వీళ్లందరూ క్షయ రోగుల మద్దతుకు సమిష్టిగా ప్రతిజ్ఞ పూనారు. క్షయ వ్యాధి పట్ల సమాజంలో నెలకొని ఉన్న అపోహలు, భయాలు తొలగి, క్షయ రహిత భారత దేశం దిశగా సాగించే పోరాటంలో సమాజ భాగస్వామ్యం ప్రాముఖ్యతను వీళ్లందరూ చాటుతూ ఉండడం విశేషం.

బొద్దింకలను వదిలించుకోండి ఇలా...



ఒక్కోసారి ఇంట్లో బొద్దింకలు విపరీతంగా పెరిగిపోతూ ఉంటాయి. రాత్రి కాగానే ఇల్లంతా పాకుతూ ఆహారపదార్థాల మీద కూడా చేరుతూ ఉంటాయి. బజారు నుంచి తెచ్చిన రసాయనిక మందులు పిచికారీ చేసినప్పటికీ ఈ సమస్య పూర్తిగా తీరదు. అలాకాకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతో చిన్న చిట్కాలు పాటించి ఈ బొద్దింకల బెడద నుంచి తప్పించుకోవచ్చు.

- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల బోరాక్స్ పౌడర్, రెండు చెంచాల బేకింగ్ సోడా, మూడు చెంచాల పంచదార వేసి బాగా కలపాలి. ఈ నీళ్లను స్ప్రే బాటిల్‌లో పోసి రాత్రిపూట బొద్దింకలు ఎక్కువగా తిరిగే వంటగది, డైనింగ్ టేబుల్, బాత్‌రూమ్‌ల దగ్గర పిచికారీ చేయాలి. తెల్లారిన తరవాత ఈ ప్రదేశాలను తడిగుడ్డతో తుడిచి శుభ్రం చేసుకోవాలి. ఇలా నాలుగు రోజులు చేస్తే బొద్దింకల సమస్య తగ్గుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బోరిక్ యాసిడ్, మూడు చెంచాల మైదా పిండి వేసి బాగా కలపాలి. ఇందులో కొన్ని నీళ్ల చుక్కలు చల్లుతూ గట్టిగా కలిపి చిన్న ఉండలు చేయాలి. వీటిని గాలికి ఆరబెట్టాలి. ఈ ఉండలను బొద్దింకలు ఎక్కువగా తిరిగే చోట మూలల్లో ఉంచాలి. రెండు రోజుల్లో ఇంట్లో ఉన్న బొద్దింకలన్నీ చనిపోతాయి. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నవారు... ఈ చిట్కాను పాటించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల దాల్చిన చెక్క పొడి, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ పొడిని వంటగది అరల్లో కొద్దిగా చల్లితే బొద్దింకలు బయటికి వెళ్లిపోతాయి.
- బొద్దింకలు తిరిగే చోటా కొద్దిగా హెయిర్‌స్ప్రే చల్లినా ఫలితం ఉంటుంది. పడకగది, పిల్లలు చదువుకునే గది మూలల్లో రెండు లవంగాలు లేదంటే బిరియానీ ఆకు ముక్కలు ఉంచితే బొద్దింకలు లోపలికి రావు.



ఉప్పొంగిన దేశభక్తి

ఐపీఎల్ ముగింపోత్సవంలో దేశభక్తి, జాతీయ భావం వెల్లువెత్తింది. 'సబ్‌సే ఆగే హోంగే హిందుస్థానీ', దుష్మన్‌కే చక్కే చుడాదే, హమ్ ఇండియావాలే' లాంటి పాటలతో స్టేడియం మొత్తం హుషారెత్తింది. 'సైన్యానికి సెల్యూట్' 'భారత భద్రతా దళాలకు ధన్యవాదాలు' లాంటి సందేశాలు స్టేడియంలోని డిజిటల్ బోర్డులపై ప్రముఖంగా డిస్‌ప్లే చేశారు. ప్రముఖ సింగర్ శంకర్ మహదేవన్, అతడి కుమారులు సిద్ధార్థ్, శివం తమ పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. లక్ష్య సినిమా సాంగ్స్‌తోపాటు రహమాన్ పాడిన 'వందే మాతరం'తో జోష్‌ను తారస్థాయికి తీసుకెళ్లారు. 'సబ్‌సే ఆగే హోంగే హిందుస్థానీ'తో కార్యక్రమాన్ని ముగించారు.

విరాట్.. విరాట్..



ఫైనల్ మ్యాచ్ కోసం స్టేడియానికి ఫ్యాన్స్ పోటెత్తారు. రికార్డు స్థాయిలో **90,871** మంది హాజరయ్యారు. స్టాండ్స్‌లో ఎక్కువగా బెంగళూరు జెర్సీలే కనిపించాయి. మ్యాచ్ ఆద్యంతం స్టేడియం మొత్తం విరాట్.. విరాట్.. విరాట్.. అన్న నినాదాలతో మార్మోగిపోయింది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు జట్టు మాజీ స్టార్లు క్రిస్ గేల్, డివిల్లీర్స్ కూడా హాజరై ఆర్సీబీకి మద్దతుపలికారు. జట్టు గెలిచిన అనంతరం గేల్, డివిల్లీర్స్.. విరాట్ కోహ్లీని హత్తుకున్నారు.

1 ఐపీఎల్‌లో ఒకే జట్టుపై ఎక్కువ పరుగులు (పంజాబ్‌పై 1159) చేసిన బ్యాటర్‌గా విరాట్



కప్ నమ్దు

'ఈ సాల కప్ నమ్దే..' అవును.. ప్రతీ సీజన్‌ను ఇదే నినాదంతో హోరెత్తించే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చివరకు సాధించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ ఈసారి కప్ కొట్టామంటూ బెంగళూరు ఫ్యాన్స్ దిక్కులు పిక్కటిల్లేలా సంబరాలు చేసుకున్నారు. ఐపీఎల్ మొదలు నుంచీ టైటిల్ కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తున్న విరాట్ కోహ్లీ ఈ అద్భుత విజయంతో భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఫైనల్లో తమ బ్యాటర్లు పెద్దగా రాణించకపోయినా.. బౌలర్లు మాత్రం దుమ్మురేపడంతో ఆర్‌సీబీ తొలి టైటిల్‌తో మురిసిపోయింది. అటు క్వాలిఫయర్2లో కనిపించిన పంజాబ్ పరాక్రమం అసలైన మ్యాచ్‌లో లోపించింది. కెప్టెన్ శ్రేయాస్ కేవలం సింగిల్ రన్‌కే పరిమితం కావడం దెబ్బతీసింది. ఆఖరి ఓవర్‌లో శశాంక్ బ్యాట్ ఝుళిపించినా.. ఒక్క 'సిక్సర్' దూరంలోనే వీరికి టైటిల్ అందకుండా పోయింది.

కోహ్లీ గ్యాంగ్ కొట్టేసింది

బెంగళూరుకు తొలి ఐపీఎల్ టైటిల్

ఫైనల్లో పంజాబ్ ఓటమి

ప్రైజ్‌మనీ
విజేత బెంగళూరుకు - రూ. 20 కోట్లు
రన్నరప్ పంజాబ్‌కు- రూ. 12.5 కోట్లు

అహ్మదాబాద్: ఐపీఎల్ 18వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొత్త చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్లో ఆర్‌సీబీ ఆరు పరుగుల తేడాతో నెగ్గింది. తద్వారా ఇన్నాళ్లూ ఊరిస్తున్న కప్పు కలను నెరవేర్చుకుంది. మరోవైపు క్రితంసారి కోల్‌కతాను విజేతగా నిలిపిన కెప్టెన్ శ్రేయాస్ ఈసారి చివరి మెట్టుపై బోల్తా పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. విరాట్ (35 బంతుల్లో 3 ఫోర్లతో 43) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అర్ష్‌దీప్, జేమిసన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులు చేసి ఓడింది. శశాంక్ సింగ్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 61 నాటౌట్) పోరాడగా, ఇన్‌గ్లిస్ (23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39) ఫర్వాలేదనిపించాడు. క్రునాల్, భువనేశ్వర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రునాల్ పాండ్యా నిలిచాడు.

చేరువుగా వచ్చినా..: ఓ మాదిరి ఛేదనలో పంజాబ్ ఆరంభం కూడా ధాటిగా ఏమీ సాగలేదు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి లోనైంది. కానీ ఆఖర్లో శశాంక్ మెరుపులు మెరిపించినా స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ (26), ప్రియాన్ష్ (24) బౌండరీల జోరుకు తొలి రెండు ఓవర్లలో 23 పరుగులతో మెరుపు ఆరంభమే దక్కింది. హాజెల్‌వుడ్ బరిలోకి దిగడంతో కష్టాలు ఆరంభమయ్యాయి. అతడి ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో ప్రియాన్ష్ రెండు ఫోర్లు బాదినా.. బౌండరీ లైన్ దగ్గర సాల్ట్ సమయస్ఫూర్తితో వ్యవహరించి క్యాచ్ పట్టేశాడు. తొలి వికెట్‌కు వీరు 43 పరుగులు జోడించారు. ఎనిమిదో ఓవర్‌లో ఇన్‌గ్లిస్, ప్రభ్ చెరో సిక్సర్‌తో 15 రన్స్ వచ్చాయి. కానీ 9,10 ఓవర్లలో పంజాబ్‌కు గట్టి ఝలక్ తగిలింది. ముందుగా స్పిన్నర్ క్రునాల్.. ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేయగా, ఇక అత్యంత ప్రమాదకర కెప్టెన్ శ్రేయాస్ (1)ను షెఫర్డ్ పెవిలియన్‌కు చేర్చడం మలుపు తిప్పింది. దీంతో నరేంద్ర మోదీ స్టేడియంలో హోరు ఆకాశాన్నంటింది. ఇక మ్యాచ్ మనదే అనే భావన ఆర్‌సీబీ ఫ్యాన్స్‌తో పాటు ఆటగాళ్లలోనూ కనిపించింది. అయితే పంజాబ్ మాత్రం క్రీజులో చక్కగా కుదురుకున్న ఇన్‌గ్లిస్‌పై ఆశలు పెట్టుకుంది. దీనికి తగ్గట్టుగానే అతడు క్రునాల్, షెఫర్డ్ ఓవర్లలో సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. అయితే ఈ సంబరం కూడా ఎక్కువ సేపు లేకుండా 13వ ఓవర్‌లో అతడిని క్రునాల్ అవుట్ చేశాడు. ఈ దశలో శశాంక్, నేహల్ (15) జోడీ ఐదో వికెట్‌కు 38 పరుగులు జోడించింది. 17వ ఓవర్‌లో నేహల్‌తో పాటు వచ్చీ రాగానే సిక్సర్ బాదిన స్టొయినిస్ (6)ను భువనేశ్వర్ పెవిలియన్‌కు చేర్చడంతో ఇక పంజాబ్ చేసేదేమీ లేకపోయింది. 6 బంతుల్లో 29 పరుగులు చేయాల్సి రాగా.. 6,4,6,6తో శశాంక్ 22 పరుగులతో ఓటమి తేడాను మాత్రమే తగ్గించగలిగాడు.

కట్టడి చేశారు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో పెద్దగా మెరుపులు కనిపించలేదు. విరాట్ టాప్ స్కోరర్‌గా నిలిచినా అతడి ఆటలో వేగం లోపించింది. మిడిలార్డర్‌లో రజత్, జితేశ్, లివింగ్‌స్టోన్ ఎదురుదాడి ప్రయత్నం కాసేపే అయ్యింది. పంజాబ్ బౌలర్ల విజృంభణకు డెత్ ఓవర్లలో 45 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఆర్‌సీబీ స్కోరు 200లోపే ముగిసింది. తొలి ఓవర్‌లోనే 6,4 బాదిన ఓపెనర్ సాల్ట్ (16) రెండో ఓవర్‌లో శ్రేయాస్ సూపర్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆ తర్వాత పవర్‌ప్లేలో మయాంక్ (24) వేగం చూపడంతో స్కోరు 55/1తో నిలిచింది. చాహల్ తన తొలి ఓవర్‌లోనే మయాంక్‌ను అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆర్‌సీబీ తొలి పది ఓవర్లలో 18 డాట్ బాల్స్ ఆడగా, విరాట్ బ్యాట్ నుంచి రెండు ఫోర్లు మాత్రమే రావడం గమనార్హం. ఉన్నకాసేపు కెప్టెన్ రజత్ పటీదార్ (26) రెండు సిక్సర్లతో వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. 11వ ఓవర్‌లో అతడిని జేమిసన్ ఎల్బీ చేయడంతో మూడో వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం చాహల్, వైశాక్ కట్టడి చేయడంతో ఆర్‌సీబీ రన్స్ కోసం ఇబ్బంది పడింది. చివరకు 14వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ 6, విరాట్ 4తో 14 రన్స్ సమకూరాయి. అయితే సహజశైలిలో భారీషాట్లు ఆడలేకపోయిన కోహ్లీ పుల్‌షాట్ ఆడే ప్రయత్నంలో అజ్మతుల్లాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో వచ్చిన జితేశ్ 16వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. తర్వాతి ఓవర్‌లో 2 సిక్సర్లతో అదుర్స్ అనిపించాడు. జేమిసన్ ఈ ఓవర్‌లో 23 పరుగులిచ్చుకున్నా లివింగ్‌స్టోన్ (25) వికెట్ తీయగలిగాడు. ఈ జోడీ మధ్య ఐదో వికెట్‌కు 12 బంతుల్లోనే 36 పరుగులు జత చేరాయి. అటు చక్కటి టచ్‌లో కనిపించిన జితేశ్‌ను పేసర్ వైశాక్ బౌల్డ్ చేయగా.. 19వ ఓవర్‌లో షెఫర్డ్ 4,6తో 14 రన్స్ అందించాడు. గతంలో చెన్నైపై అతడి హిట్టింగ్‌ను చూసిన ఫ్యాన్స్.. ఈసారి కూడా భారీస్కోరు చేస్తాడని భావించారు. అయితే అర్ష్‌దీప్ ఆఖరి ఓవర్‌లో 3 పరుగులే ఇచ్చి షెఫర్డ్ (17), క్రునాల్ (4), భువనేశ్వర్ (1)ల వికెట్లతో వహ్వా.. అనిపించాడు.



విరాట్.. ఏడ్చేశాడు

ఆధునిక క్రికెట్‌లో అత్యున్నత ఆటగాడైనా తన కెరీర్‌లో ఇప్పటి దాకా ఐపీఎల్ టైటిల్ లేని లోటు విరాట్ కోహ్లీని వేధిస్తూనే వచ్చింది. అందుకే సుదీర్ఘ విరామం తర్వాత చాంపియన్‌గా నిలిచామనే వాస్తవాన్ని కోహ్లీ కూడా కాసేపు నమ్మలేకపోయాడేమో.. ఆఖరి ఓవర్‌లో రెండో బంతి ముగియగానే భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు. అప్పటికి 4 బంతుల్లో 29 రన్స్ అవసరమవడంతో ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది. దీంతో విరాట్ తన ముఖాన్ని రెండు చేతుల్లో దాచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. మైదానంలోకి వచ్చిన భార్య అనుష్కను కౌగిలించుకుని చాలా సేపు అలాగే ఉండిపోయాడు. ఇదిలావుండగా.. తమ అభిమాన క్రికెటర్ కోహ్లీ జెర్సీ నెంబర్ 18 కావడం.. అటు అతనికి ఐపీఎల్ టైటిల్ కూడా 18వ సీజన్‌లోనే దక్కడం అభిమానులకు మరింత ఆనందాన్నిస్తోంది.





(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కల నిజమాయె!

ఒకటా..రెండా..ఏకంగా 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ.. ఏబీ డివిల్లీర్స్, క్రిస్ గేల్, డుప్లెసి, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, కలిస్, జహీర్ ఖాన్ వంటి సూపర్‌స్టార్లు ప్రాతినిధ్యం వహించిన జట్టది. కానీ నేటివరకు బెంగళూరు జట్టుకు టైటిల్ అందని ద్రాక్షే అయ్యింది. ప్రతి ఏడాదీ 'ఈ సాల కప్ నమ్దే' అంటూ ఊదరగొట్టడం.. కీలక సమయాల్లో బోల్తా కొట్టి తీవ్ర నిరాశలో కూరుకుపోవడం ఏళ్లుగా ఆటగాళ్లతోపాటు ఆర్‌సీబీ ఫ్యాన్స్‌కూ అలవాటైపోయింది. ఐపీఎల్‌లో ఆర్సీబీ రికార్డు చూస్తే....మూడుసార్లు (2009, 2011, 2016) తుది మెట్టుపై బోల్తా.. రెండుసార్లు (2015, 2022) క్వాలిఫయర్-2లో చుక్కెదురు..మరో మూడుసార్లు (2020, 2021, 2024) ఎలిమినేటర్లలో ఎదురు దెబ్బలుతిని నిష్క్రమించింది. మరీ ముఖ్యంగా 2016లో అద్భుత ఫామ్‌లో ఉన్న నాటి సారథి విరాట్ కోహ్లీ నాలుగు సెంచరీలు సహా మొత్తం 973 పరుగులతో అదరగొట్టినా..ఆ జట్టుకు ట్రోఫీ అందుకోలేకపోయింది. ఆ సీజన్‌లో బెంగళూరు అభిమానుల బాధ వర్ణనాతీతం! ఎట్టకేలకు ఆర్‌సీబీ చిరకాల స్వప్నం సాకారమైంది. 'మెగా ట్రోఫీ'ని ఆ జట్టు 18వ సీజన్‌లో ఒడిసిపట్టింది. తమ అభిమాన ఆటగాడు విరాట్ కోహ్లీ ఇటీవల టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో తీవ్ర వేదనలో ఉన్న అతడి అభిమానులను ఆర్‌సీబీ జట్టు ఐపీఎల్ ఫైనల్ విజయం ఆనంద డోలికల్లో ముంచెత్తింది.

స్పష్టమైన ప్రణాళికతో..

ఈ సీజన్‌లో టైటిల్ అందుకోవడాన్ని ఏకైక లక్ష్యంగా ఆర్‌సీబీ నిర్దేశించుకుంది. ఈ క్రమంలో జట్టును సమూలంగా ప్రక్షాళన చేయాలని వ్యూహకర్తలు నిర్ణయించారు. ఆ మేరకు పక్కా ప్రణాళికతో వేలంలోకి దిగారు. రిటైన్ చేసుకున్న కోహ్లీ, రజత్ పటీదార్, యశ్ దయాల్ అంచనాలను అందుకొని జట్టు విజయాలలో తమ వంతు పాత్ర పోషించారు. వికెట్ కీపర్, బ్యాటర్ ఫిల్ సాల్ట్, కోహ్లీ మెరుపు ఆరంభాలివ్వగా....దేవదత్ పడిక్కళ్, రజత్ పటీదార్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ మిడిలార్డర్‌లో చెలరేగారు. ఆల్‌రౌండర్లు టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్ లోయరార్డర్‌లో దంచికొట్టారు. ఇక ఆర్‌సీబీ బౌలింగ్ విభాగం గురించి ఎంత చెప్పినా తక్కువే. ముఖ్యంగా ఆస్ట్రేలియా పేసర్ జోష్ హాజెల్‌వుడ్ వికెట్ల వేట కొనసాగించగా..భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ అతడికి అండగా నిలిచారు. స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ ప్రత్యర్థులను పూర్తిగా కట్టడి చేశారు. ఇలా ప్రతి ఆటగాడు తమ బాధ్యతను అత్యంత సమర్థంగా నిర్వర్తించారు. మొత్తంగా సమష్టితత్వం ప్రధాన ఆయుధంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తన చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకుంది.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (సి) శ్రేయాస్ (బి) జేమిసన్ 16, విరాట్ కోహ్లీ (సి అండ్ బి) ఒమర్జాయ్ 43, మయాంక్ అగర్వాల్ (సి) అర్ష్‌దీప్ (బి) చాహల్ 24, పటీదార్ (ఎల్బీ) జేమిసన్ 26, లివింగ్‌స్టోన్ (ఎల్బీ) జేమిసన్ 25, జితేశ్ (బి) వైశాక్ 24, షెఫర్డ్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 17, క్రునాల్ పాండ్యా (సి) శ్రేయాస్ (బి) అర్ష్‌దీప్ 4, భువనేశ్వర్ (సి) ప్రియాన్ష్ (బి) అర్ష్‌దీప్ 1, యశ్ దయాల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 190/9; వికెట్ల పతనం:** 1-18, 2-56, 3-96, 4-131, 5-167, 6-171, 7-188, 9-189, 9-190; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-40-3, జేమిసన్ 4-0-48-3, ఒమర్జాయ్ 4-0-35-1, వైశాక్ 4-0-30-1, చాహల్ 4-0-37-1.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 24, ప్రభ్‌సిమ్రన్ (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 26, ఇన్‌గ్లిస్ (సి) లివింగ్‌స్టోన్ (బి) క్రునాల్ 39, శ్రేయాస్ (సి) జితేశ్ (బి) షెఫర్డ్ 1, నేహల్ (సి) క్రునాల్ (బి) భువనేశ్వర్ 15, శశాంక్ సింగ్ (నాటౌట్) 61, స్టొయినిస్ (సి) యశ్ (బి) భువనేశ్వర్ 6, ఒమర్జాయ్ (సి/సబ్) భండగె (బి) యశ్ దయాల్ 1, జేమిసన్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 11; మొత్తం: 20 ఓవర్లలో 184/7; వికెట్ల పతనం:** 1-43, 2-72, 3-79, 4-98, 5-136, 6-142, 7-145; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-38-2, యశ్ దయాల్ 3-0-18-1, హాజెల్‌వుడ్ 4-0-54-1, క్రునాల్ 4-0-17-2, సుయాశ్ 2-0-19-0, షెఫర్డ్ 3-0-30-1.

ఒలింపిక్స్‌లో క్రికెట్.. భారత్ వల్లే!

బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్



అహ్మదాబాద్: వందేళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో మళ్లీ క్రికెట్‌ను చేర్చడానికి భారతే కారణమని బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ కొనియాడారు. క్రికెట్ వీరాభిమాని అయిన సునాక్.. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ని తిలకించేందుకు ఇక్కడికి వచ్చారు. భారత్‌ను ప్రభావితమైన శక్తిగా తయారు చేయడంలో ఐపీఎల్, బీసీసీఐ పాత్ర ఎంతో ఉందని ఆయన ప్రశంసించారు. 1900 తర్వాత.. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కింది. '21వ శతాబ్దాన్ని భారత్ ఎలా ప్రభావితం చేయగలదనడానికి ఇవి సంకేతాలు. వందేళ్ల తర్వాత తొలిసారి విశ్వక్రీడల్లో క్రికెట్‌కు చోటు దక్కిందంటే.. అది ఇండియా వల్లే'నని సునాక్ అన్నారు. ఇక, ఐపీఎల్‌లో 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరుకు సునాక్ మద్దతు ప్రకటించారు.

సెంట్రల్ కాంట్రాక్ట్‌కు మళ్లీ నో చెప్పిన కేన్ విలియమ్సన్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌ను ఆ దేశ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ మరోసారి తిరస్కరించాడు. ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టిసారించిన విలియమ్సన్ గతేడాది కూడా సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకొన్నాడు. కానీ, గత సంవత్సరం తరహాలోనే క్యాజువల్ కాంట్రాక్ట్‌పై అతడు సంతకం చేసే అవకాశాలున్నాయి. బోర్డు విడుదల చేసిన 20 మంది సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్ల జాబితాలో కాన్వే, అలెన్, సీఫెర్ట్, ఫెర్గూసన్ పేర్లు కూడా లేవు. వీరంతా ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్‌లు ఆడుతున్న వారే. కాగా, మిడిల్‌సెక్స్ తరఫున కౌంటీలు ఆడుతున్న విలియమ్సన్.. ఆ తర్వాత 'ద హండ్రెడ్'లో బరిలోకి దిగనున్నాడు.

ఒకుహారపై సింధు గెలుపు

● సాత్విక్ జోడీ ముందంజ
● ప్రణయ్, లక్ష్య అవుట్

ఇండోనేసియా ఓపెన్



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పీవీ సింధు, డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. కాగా, వెటరన్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్, మరో స్టార్ ఆటగాడు లక్ష్య సేన్ మాత్రం ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సింధు 22-20, 21-23, 21-15తో చిరకాల ప్రత్యర్థి, జపాన్ స్టార్ నొజోమి ఒకుహారపై పోరాడి గెలిచింది. సింధు రెండోరౌండ్లో ఆరోసీడ్ పోర్న్‌పవీ చోచువాంగ్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది. డబుల్స్ మొదటి రౌండ్లో సాత్విక్/చిరాగ్ జోడీ 18-21, 21-18, 21-14తో స్థానిక ద్వయం లియో రోలీ కర్నాండో/మౌలానాను ఓడించి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. ఇక లక్ష్య సేన్ 11-21, 22-20, 15-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ షి యు కి (చైనా) చేతిలో, ప్రణయ్ 17-21, 18-21తో స్థానిక షట్లర్ ఫర్హాన్ చేతిలో ఓటమి పాలయ్యారు.

నీరజ్ క్లాసిక్ ఈవెంట్ 5న..


బెంగళూరు: 'నీరజ్ చోప్రా క్లాసిక్' మొట్టమొదటి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ వచ్చే నెల 5న బెంగళూరులో జరగనుంది. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, భారత స్టార్ నీరజ్ చోప్రా ఆధ్వర్యంలో జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సహకారంతో అతని పేరుతోనే ఈ ఆరంభ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీ గతనెల 24న జరగాల్సి ఉంది. అయితే, భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈవెంట్‌ను అప్పట్లో వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఏడుగురు, భారత్ నుంచి ఐదుగురితో కలిపి మొత్తం 12 మంది జావెలిన్ త్రోయర్లు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

సెమీస్‌కు సబలెంక, స్వియటెక్

జెంగ్, స్విటోలినా అవుట్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: మహిళల డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్, టాప్ సీడ్ సబలెంక ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మంగళవారం ఇక్కడ జరిగిన సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఐదోసీడ్ స్వియటెక్ (పోలెండ్) 6-1, 7-5తో ఉక్రెయిన్ స్టార్, 13వ సీడ్ స్విటోలినాను చిత్తుచేసింది. కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురిపెట్టిన 24 ఏళ్ల స్వియటెక్‌కు ఈ వేదికపై వరుసగా ఇది 26వ విజయం. స్వియటెక్ తన కెరీర్‌లో నెగ్గిన మొత్తం ఐదు గ్రాండ్‌స్లామ్స్‌లో నాలుగు ఇక్కడే అందుకోవడం విశేషం. క్లేకోర్టులో తిరుగులేని ఆటతీరుతో అదరగొడుతున్న స్వియటెక్ గురువారం జరిగే సెమీఫైనల్లో వరల్డ్ నెంబర్‌వన్ సబలెంకతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో సబలెంక (బెలారస్) 7-6 (3), 6-3తో చైనాకు చెందిన 8వ సీడ్ కిన్వెన్ జెంగ్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో 8వ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-2, 4-6, 7-5, 6-2తో అమెరికాకు చెందిన 15వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోపై గెలిచి సెమీఫైనల్‌కు చేరాడు.


సబలెంక


స్వియటెక్

1 అరంగేట్ర సీజన్‌లో ఎక్కువ పరుగులు (475) చేసిన అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా ప్రియాన్ష్ ఆర్య

ఈ సీజన్ హీరోలు

ఆరెంజ్ క్యాప్: సాయి సుదర్శన్
(15 మ్యాచ్‌ల్లో 759 పరుగులు, గుజరాత్)
పర్పుల్ క్యాప్: ప్రసిద్ధ్ కృష్ణ
(15 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు, గుజరాత్)
అత్యంత విలువైన ఆటగాడు-సూర్యకుమార్
ఉత్తమ వర్ధమాన ఆటగాడు- సాయి సుదర్శన్
ఫెయిర్ ప్లే- చెన్నై సూపర్ కింగ్స్
ఉత్తమ పిచ్ అవార్డు- ఢిల్లీ క్యాపిటల్స్

లెక్క సరిచేసిన గుకేష్

● నార్వే చెస్‌లో అర్జున్‌పై గెలుపు

స్టావెంజర్ (నార్వే): సహచరుడు అర్జున్ ఇరిగేసిపై బదులు తీర్చుకొన్న వరల్డ్ చాంపియన్ గుకేష్.. నార్వే చెస్ టోర్నీలో ద్వితీయ స్థానానికి ఎగబాకాడు. 6వ రౌండ్‌లో కార్ల్‌సన్‌పై గెలుపుతో బలంగా పుంజుకొన్న గుకేష్.. 7వ రౌండ్‌లో అర్జున్‌పై గెలిచాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 92 ఎత్తుల్లో అర్జున్ ఆట కట్టించాడు. 2వ రౌండ్‌లో అర్జున్ చేతిలో గుకేష్ ఓడిన సంగతి తెలిసిందే. వరుసగా రెండో క్లాసిక్ గేమ్‌లో నెగ్గిన గుకేష్.. మొత్తం 7 రౌండ్ల నుంచి 11.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కరువానా 12.5 పాయింట్లతో టాప్‌లో ఉండగా.. కార్ల్‌సన్ 11 పాయింట్లతో మూడో స్థానంలో, అర్జున్ 7.5 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల ఏడో రౌండ్‌లో ముజిచెక్‌తో క్లాసిక్ గేమ్‌ను డ్రా చేసుకొన్న హంపి.. ఆర్మగెడాన్‌లో ఓటమి పాలైంది. కాగా, లీ టింగ్జీ చేతిలో వైశాలి క్లాసిక్ గేమ్‌లోనే ఓడింది. 7 రౌండ్ల నుంచి హంపి 10.5 పాయింట్లతో మూడో స్థానంలో, వైశాలి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

ఎవరిది వెన్నుపోటు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య వాదులు పేర్కొంటున్నారు.

ఏది వెన్నుపోటు...

మోసం, ద్రోహం, పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాన్ని పడదోసి, అధికార పీఠాన్ని చేజిక్కించుకుంటే అది కచ్చితంగా వెన్నుపోటే అవుతుంది. కానీ.. ప్రజాభిప్రాయాన్ని వెన్నుపోటుగా పేర్కొనడం వైసీపీకే చెల్లింది. ఈ ఎన్నికల్లో ప్రజలు తిరుగులేని తీర్పు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా... 93 శాతం స్ట్రైక్ రేటుతో 175 స్థానాలకు 164 స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో అతి భారీ మెజారిటీలు కట్టబెట్టారు. వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేసి... ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. ఇది... ఐదేళ్ల జగన్ అరాచక, నిర్బంధ పాలనపై జనం ఇచ్చిన తీర్పు! దీనినే జగన్ ఇప్పుడు 'వెన్నుపోటు'గా అభివర్ణిస్తున్నారు.

ఐదేళ్ల వెన్నుపోట్ల పాలన...: వెన్నుపోటు దినంగా ప్రకటించాల్సి వస్తే... అందుకు జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు 2019 మే 30వ తేదీనే ఎంచుకోవాలని టీడీపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. 'దేశమంతా మెచ్చుకునేలా పాలన సాగిస్తా' అని చెప్పిన జగన్... ఐదేళ్లపాటు రాష్ట్రంలో నిరంకుశ, అరాచక, విధ్వంస పాలన సాగించారు. జగన్, ఆయన అనుచరగణం వెన్నుపోట్లను మచ్చుకు కొన్ని గుర్తు తెచ్చుకుంటే...

- అధికారం చేపట్టిన వెంటనే 'ప్రజావేదిక'ను కూల్చివేసి... తన పాలన ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పారు.
- జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు కాదు ఊళ్లు కడుతున్నామంటూ ఊదరగొట్టి... ఎకరం పదీ ఇరవై లక్షలు కూడా చేయని పొలాలను రూ.50 లక్షలకు కొనుగోలు చేసి వందలకోట్లు కుమ్మేశారు. భూముల మెరక పేరుతోనూ డబ్బులు దండుకున్నారు. నివాసయోగ్యం కాని స్థలాలను అప్పగించి పేదలకు వెన్నుపోటు పొడిచారు.

నిర్బంధం వీడిన రోజు...

2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనను ఓర్పుతో భరించిన ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పారు. వైసీపీని ఓడించడమనే ఏకైక లక్ష్యంతో పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ప్రజల్లో నిగూఢంగా దాగున్న వ్యతిరేకత బద్దలైంది. అది 2024 జూన్ 4న ఎన్నికల ఫలితాల రోజున వెల్లడైంది. ఈ రోజును వైసీపీ 'వెన్నుపోటు దినం' అంటోంది. వెరసి... ఈ తీర్పును జగన్ ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారని అర్థమవుతోంది.

- మద్యం పాలసీని ముడుపులకు వీలుగా మార్చేశారు. నాసిరకం మద్యంతో వందల మంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారు.
- నిరుద్యోగులకు దారుణంగా వెన్నుపోటు పొడిచారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి.. చేతులెత్తేశారు. ఒక్కటంటే ఒక్క డీఎస్సీ కూడా వేయలేదు.
- ఉద్యోగం అంటే నెలకు రూ.5వేలు ఇచ్చే 'వలంటీరు' అనే కొత్త అర్థాన్ని ఇచ్చారు. వారిని తన రాజకీయ అవసరాలకు వాడుకున్నారు.
- అమరావతికి వెన్నుపోటు పొడిచారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. అప్పటికే జరిగిన వేలకోట్ల విలువైన ప్రాజెక్టులను కూడా ఆపివేశారు.
- పూర్తయ్యే దశలో ఉన్న 'టిడ్కో' ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుబెట్టారు.
- రివర్స్ టెండరింగ్ పేరుతో విధ్వంసానికి తెరలేపారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి కారణమయ్యారు. ఇతర ప్రాజెక్టులను గాలికొదిలేశారు. జగన్ ప్రభుత్వ వైఫల్యం వల్లే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, ఈ ఘటన దేశానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఉందని కేంద్రమే ప్రకటించింది.
- వ్యవసాయ రంగానికీ జగన్ వెన్నుపోటు పొడిచారు. వైసీపీ పాలనలో సుమారు 3 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. భూముల రీసర్వే పేరుతో కొత్త చిచ్చు పెట్టారు. దశాబ్దాలుగా వారసత్వంగా వస్తున్న ఒకరి భూములను మరొకరి ఖాతాల్లో వేసేసి రైతులను క్షోభపెట్టారు.
- ఇసుకనుంచీ డబ్బు పిండుకున్నారు. జిల్లాల వారీగా నేతలకు క్వారీలు అప్పగించి.. వారి నుంచి నెలనెలా డబ్బులు వసూలు చేశారు.

రాజకీయ అరాచకం...

టీడీపీ కార్యకర్తల నుంచి నేతల దాకా అందరూ జగన్ కక్ష సాధింపులకు లక్ష్యమయ్యారు. ఫైల్స్ ఆపరేషన్ చేయించుకున్న 2 రోజులకే మాజీ మంత్రి అచ్చెన్నాయుడును శ్రీకాకుళంలో అరెస్టు చేసి సుమారు 450 కి.మీ. రోడ్డు మార్గంలో విజయవాడకు తరలించారు. మరో మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై అక్రమ హత్య కేసు బనాయించి జైలుకు పంపారు. సాక్షాత్తు టీడీపీ అధినేత చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి జైలు పాలు చేశారు. సామాన్యులనూ జగన్ వదిలిపెట్టలేదు. కరోనా సమయంలో మాస్కులు ఏవని నిలదీసిన దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్ నుంచి... సోషల్ మీడియా పోస్టు ఫార్వర్డ్ చేసిన వృద్ధురాలు రంగనాయకమ్మ మొదలు ఎందరో బాధితులు. దళిత డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ చేసినా దిక్కులేదు. ఇసుక మాఫియాను నిలదీసిన మరో దళిత యువకుడికి శిరోముండనం చేసినా పట్టించుకోలేదు. అంతెందుకు... కొవ్వూరులో ఇసుక తవ్వుకునేందుకు ప్రతినెలా రూ.25 కోట్లు కట్టలేక వైసీపీకి చెందిన ప్రేమ్‌రాజ్ అనే కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకునేంత పరిస్థితికి తెచ్చారు.

నేడు క్యాబినెట్ సమావేశం

» కూటమి ఏడాది పాలనపై ప్రత్యేక చర్చ

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో జరగనుంది. అమరావతి నిర్మాణం, రెండో దశకు అవసరమైన 44 వేల ఎకరాల భూసేకరణ అంశంపై చర్చ జరగనుంది. అమరావతిలో నిర్మించే జీఏడీ టవర్ టెండర్లకు, హెచ్‌వోడీ భవనాల 4 టవర్లకు, అమరావతిలో 5 వేల ఎకరాల్లో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలపనుంది. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రత్యేక చర్చ జరగనుంది. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై కూడా క్యాబినెట్‌లో చర్చించనున్నారు.

మైనార్టీల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: ఫరూక్

'రాష్ట్రంలోని మైనార్టీల ఆర్థిక స్వావలంబన, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయం. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తాం' అని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కేంద్ర పథకాలపై ఆయన సమీక్ష చేశారు.

గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా భారత్

» బ్రిక్స్ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని



న్యూఢిల్లీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డిజిటల్ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా మారిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బ్రెజిల్‌లోని బ్రెసిలియాలో నిర్వహించిన 11వ బ్రిక్స్ కమ్యూనికేషన్స్ మంత్రుల సమావేశంలో పెమ్మసాని పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 2.18 లక్షల గ్రామాలకు భారత్ నెట్ ద్వారా కనెక్టివిటీ కల్పించామని, 95 శాతానికిపైగా జనాభాకు 4జీ అందుబాటులో ఉందని, 80 శాతానికి పైగా జనాభాకు 5జీ కవరేజీని అందిస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత చౌకధరలో డేటాను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య డిజిటల్ ఎకోసిస్టంను ఏర్పరుచుకునేందుకు సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవాలని కోరారు. వచ్చే ఏడాది భారత్‌లో నిర్వహించనున్న 12వ బ్రిక్స్ కమ్యూనికేషన్స్ మంత్రుల సమావేశానికి సభ్యదేశాలను కేంద్ర మంత్రి పెమ్మసాని ఆహ్వానించారు.

ఇడుపులపాయలోనే జగన్ అక్రమ ఆస్తులు: యనమల

తుని రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అక్రమ ఆస్తులను ఇడుపులపాయలోని బంకర్లలోనే దాచిపెట్టారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'వెన్నుపోటు దినం అంటూ జగన్ తన అవినీతి పత్రికను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ కుట్రలను కూటమి నేతలు తిప్పికొట్టాలి. వెన్నుపోటు పొడవటం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. తల్లి, చెల్లిని రోడ్డుపైకి ఈడ్చాడు. బాబాయి వివేకా హత్యతో జగన్ నేర చరిత్ర ప్రజలందరికీ తెలిసిందే. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారు. పేదలకు కూటమి ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మిస్తుంటే జగన్‌కు కడుపు మంట ఏంటి?' అని యనమల నిలదీశారు.

రియాధ్‌లో తొలిసారిగా మినీ మహానాడు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియా రాజధాని రియాధ్‌లో తొలిసారిగా మినీ మహానాడు నిర్వహించిన తెలుగు తమ్ముళ్లు చరిత్ర సృష్టించారు. టీడీపీ ప్రముఖులు షేక్ జానీ బాషా, చెన్నుపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీలోని అన్ని జిల్లాలకు చెందిన ప్రవాసీయులు పండుగలా జరుపుకొన్నారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ నలుమూలల్లో ఉన్న తెలుగువారికి చేరువ కావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేస్తున్న కృషిని వివరించారు. కాగా, స్థానిక చట్టాలకు లోబడి.. ఇక్కడ వివిధ ప్రాంతాల్లో పార్టీని విస్తరించనున్నట్టు టీడీపీ ఎన్నారై సౌదీ అరేబియా శాఖ అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా పెర్కొన్నారు.

ఇది ప్రజల విజయోత్సవ దినం: పార్థసారథి

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకపాలనకు ప్రజలు ముగింపు పలికిన జూన్ 4... ప్రజల విజయోత్సవ దినం. ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ వారు ప్రజా తీర్పును కించపరిచేలా వెన్నుపోటు దినంగా నిరసనలు తెలపడం వారి మూర్ఖత్వం' అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. 'కూటమి ప్రభుత్వ ఏడాది సంక్షేమ పాలనను ప్రజలు కళ్లారా చూస్తున్నారు. జగన్ చేస్తున్న రౌడీషీటర్ల పరామర్శ యాత్రలనూ గమనిస్తున్నారు. అన్యాయం చేసిన వారి కోసం ధర్నాలు, పరామర్శలు చేసే నాయకులను తొలిసారి చూస్తున్నాం' అని ఎద్దేవా చేశారు.

పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్లు రెన్యువల్

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను ప్రభుత్వం రెన్యువల్ చేసింది. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 309 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు, 116 మంది వర్క్‌షాప్ సిబ్బందిని రెన్యువల్ చేశారు. జూన్ 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు 11 నెలల పాటు వారి సేవలు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 2022 పీఆర్‌సీలో జరిగిన పొరపాటు వల్ల వారి జీతాన్ని రూ.61,960 నుంచి రూ.54,060కు తగ్గించే ప్రతిపాదన వచ్చింది. అయితే జీతాలు యథావిధిగా అమలుచేయాలని జేఏల్స్ కోరడంతో.. తప్పిదాన్ని సవరించిన ప్రభుత్వం జీతం తగ్గదని స్పష్టం చేసింది. దీనిపై ఏపీ పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధులు ఏఆర్ గోవర్ధన్‌రెడ్డి, బి.కృష్ణ, పి.సాయిరాజు... మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీల వేతనాలకు వెయ్యి కోట్లు విడుదల

ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరయ్యాయి. నెల రోజులుగా ఉపాధి శ్రామికులకు వేతనాలు విడుదల కాకపోవడంతో సుమారు రూ.2100 కోట్లు కేంద్రం బకాయిపడింది. దీంతో గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కేంద్రాన్ని సంప్రదించారు. కేంద్ర ప్రభుత్వం వేతనాలకు సంబంధించి రూ.1000 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలిచ్చింది. మరో రూ.1100 కోట్లు వేతనాల నిధులు రాష్ట్రానికి రావాల్సి ఉంది. దీంతో పాటు కేంద్రం నుంచి మెటీరియల్ నిధులు మరో రూ.2500 కోట్లు రావాల్సి ఉంది. ఈ నిధులు కూడా మరో వారంలో విడుదలవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

పోలవరం-బనకచర్లతో ఆదాయార్జన!



ఏటా రూ.2,765 కోట్ల రాబడి.. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ నివేదన

» మూడు దశల్లో నిర్మాణం

» మొత్తం అంచనా రూ.81,900 కోట్లు

» అందులో సగం విదేశీ రుణం

» కేంద్రం నుంచి 16,380 కోట్లు

» ప్రజెంటేషన్‌లో రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం.. స్వీయ ఆదాయార్జన ప్రాజెక్టుగా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. జలవిద్యుత్ ప్రాజెక్టులు, ఇళ్లు, పరిశ్రమలకు నీటి సరఫరా ద్వారా ఏటా రూ.2,763 కోట్లు ఆర్జించే వీలుందని తెలిపింది. పథకం అంచనా వ్యయం రూ.81,900 కోట్లని.. మూడు దశల్లో చేపడతామని సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ అధికారులకు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వెల్లడించింది. ఆ సమాచారం 'ఆంధ్రజ్యోతి'కి అందింది. అంచనా వ్యయంలో 50 శాతం అంటే రూ.40,950 కోట్లు విదేశీ రుణంగా తీసుకోదలిచామని.. కేంద్రం 20 శాతం అంటే రూ.16,380 కోట్లు భరిస్తే.. రాష్ట్రం పది శాతం వాటా కింద రూ.8,190 కోట్లు ఖర్చుచేస్తుందని.. మిగతా 20 శాతం వాటాను అంటే.. రూ.16,380 కోట్లను ప్రైవేటు సంస్థల ద్వారా సమీకరిస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ వివరించారు. ఈ ప్రాజెక్టుపై నిర్మించే పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా రూ.201 కోట్లు, చెరో 200 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల ద్వారా రూ.651 కోట్లు, గృహాలకు మంచినీటి సరఫరా ద్వారా రూ.213 కోట్లు, పరిశ్రమలకు నీటి సరఫరాతో రూ.1,699 కోట్లు.. మొత్తంగా ఏటా రూ.2,765 కోట్ల ఆదాయం వస్తుందని వెల్లడించారు.

దశలవారీ నిర్మాణమిలా..

- పోలవరం-బనకచర్ల పథకం తొలి దశలో గోదావరి వరదనీటిని తాడిపూడి వరద కాలువ ద్వారా పోలవరం కుడి ప్రధాన కాలువను కలుపుతూ 175 కి.మీ. మేర ప్రకాశం బ్యారేజీ దాకా 5,000 క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. ఇందుకయ్యే ఖర్చు రూ.13,800 కోట్లు.
- ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని బొల్లాపల్లి రిజర్వాయరు(150 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తారు)కు తీసుకెళ్తారు. ఇందుకు రూ.35,750 కోట్లు ఖర్చవుతుంది.
- బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు నీటిని తరలిస్తారు. బొల్లాపల్లి వద్ద 200 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రం నిర్మిస్తారు. ఎగువ చర్లోపల్లి రిజర్వాయరులోకి నీటిని తరలిస్తారు. 19.5 కి.మీ. టన్నెల్ తవ్వి సిద్ధాపురం చెరువును నీటితో నింపుతారు. దానిపై రూ.582 కోట్లతో 600 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంటు నిర్మిస్తారు. అక్కడే 6.6 కి.మీ. ఇంకో సొరంగం తవ్వుతారు. ఈ ప్రాంతంలో 200 మెగావాట్ల జల విద్యుత్కేంద్రం నిర్మిస్తారు. అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకు తీసుకెళ్లి నీటిని ఎత్తిపోస్తారు. ఈ ప్రక్రియకు రూ.32,350 కోట్లు వ్యయమవుతుంది.
- ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమలోని దుర్భిక్ష ప్రాంతాలకూ.. పల్నాడులోని కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందడమే గాక పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీరివ్వడం సాధ్యపడుతుంది. మొత్తంగా 80 లక్షల మంది ప్రజలకు తాగునీరు, 91.4 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 3 లక్షల హెక్టార్లకు సాగునీరు, పరిశ్రమలకు 20 టీఎంసీల నీరు ఇవ్వాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ పథకంపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పిస్తే నిధుల మంజూరుపై కార్యాచరణను ప్రకటిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ హామీ ఇచ్చినట్లు ఢిల్లీ వెళ్లిన ఉన్నతాధికారుల బృందం సభ్యుడొకరు వివరించారు.

గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని ఒప్పుకోం

» ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తాం

» టి.మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టదలిచిన 'గోదావరి-బనకచర్ల' అనుసంధానం ప్రాజెక్టును ఒప్పుకోబోమని, దానిని అడ్డుకుంటామని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. 'గోదావరి-బనకచర్ల' ప్రాజెక్టుపై అభ్యంతరాలను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి ఇప్పటికే వివరించామని తెలిపారు. అలాగే, ప్రాజెక్టుకు సాయం చేయవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాశామని తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు అమలు దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తుండటంపై ఉత్తమ్ స్పందిస్తూ... సముద్రంలో కలిసే నీళ్లను తరలిస్తామని ఏపీ ఏ విధంగా అంటుందని ప్రశ్నించారు. తెలంగాణలో గోదావరి నదిపై చేపట్టే ఏ ప్రాజెక్టు డీపీఆర్‌ను అనుమతుల కోసం సమర్పించినా.. నీటి లభ్యత లేదని వాదించే ఏపీ.. ఇప్పుడు ఏ నీటిని గోదావరి-బనకచర్ల ద్వారా తరలిస్తుందని విమర్శించారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్: ఆప్టా డిమాండ్

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)కు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. గతంలో పాఠశాల విద్య కమిషనర్‌తో జరిగిన చర్చల్లో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు.

ప్రసాదాల్లో నాణ్యత పెంచాలి

» ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

» దేవదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్, కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో భక్తులకు అందిస్తున్న ప్రసాదాల్లో నాణ్యత పెంచాలని, ప్రసాదాల తనిఖీ, పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించాలని దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ ఆదేశించారు. మంగళవారం దేవదాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు ప్రసాదాల్లో నాణ్యత తగ్గకుండా చూడాలని సూచించారు. నాణ్యత పరిశీలనకు రాష్ట్రస్థాయిలో నోడల్ అధికారితో పాటు ప్రతి ఆలయానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ మాట్లాడుతూ... డిప్యూటీ కమిషనర్ కేడర్ ఆలయాల్లో అన్నదానం ప్రారంభించాలని చెప్పారు. ఆలయాల భూముల పరిరక్షణ బాధ్యత ఈవోలదేనని, జీవో 60 ప్రకారం ఎప్పటికప్పుడు కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని భూములను రక్షించాలని అన్నారు. ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్జేసీ కేడర్ ఆలయాల్లో కనీసం వెయ్యి మంది వలంటర్లీను నియమించుకోవాలని సూచించారు. వలంటీర్ల నియామకానికి ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

బదిలీల హడావుడిలో ఉద్యోగులు..

» రాయితీ విత్తన పంపిణీలో తాత్సారం

» రైతు సేవా కేంద్రాలకు పూర్తిస్థాయిలో చేరని విత్తనాలు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు వచ్చేసినా, ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ పూర్తి స్థాయిలో సాగడం లేదు. ఈ సీజన్‌కు అవసరమైన విత్తనాలకు సంబంధించిన రాయితీ సొమ్మును ఆర్థికశాఖ సకాలంలో విడుదల చేయకపోవడంతో సరఫరాలో జాప్యం జరిగిందని అధికారులు చెప్తున్నారు. ఈ సీజన్ ఇండెంట్‌లో కొంత మేరకే ఏపీ సీడ్స్ నుంచి క్షేత్రస్థాయికి విత్తనాలు తరలించారు. రాయితీ విత్తనాలకు రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అయినందున రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 70 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైతే.. ఇప్పటికి 30 వేల క్వింటాళ్లు మాత్రమే రావడంతో కొంత పంపిణీ జరిగింది. రాయలసీమలో రైతులకు 2 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందించాల్సి ఉండగా, 78 వేల క్వింటాళ్ల విత్తనాలు క్షేత్రస్థాయికి వచ్చాయి. ఇక కోస్తా రైతులకు పంచాల్సిన 2.25 లక్షల క్వింటాళ్ల వరి వంగడాల్లో 62 వేల క్వింటాళ్లు మాత్రమే రైతుసేవా కేంద్రాలకు చేరాయి. గత నెల 15 నుంచి వ్యవసాయశాఖ ఉద్యోగులు సాధారణ బదిలీల హడావుడిలో ఉండటం, ఈ ప్రక్రియను ఈనెల 9 వరకు పొడిగించడంతో విత్తన పంపిణీపై అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారని అంటున్నారు. ప్రస్తుతం రుతుపవనాల కదలిక మందకొడిగా ఉన్నందున మిగతా విత్తనాలను కూడా తెప్పించి ఈనెల మూడో వారం నాటికి రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా 'సీజనొస్తున్నా.. సరఫరా ఏదీ..?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆర్థికశాఖ స్పందించింది. గతేడాది విత్తన బకాయిలకు రూ.130 కోట్లు విడుదల చేసింది. రూ.110 కోట్లకు బిల్లులు ప్రాసెస్‌లో ఉన్నాయి. ప్రస్తుతం విత్తన రాయితీ కింద నిధులు విడుదల చేస్తేనే పూర్తి స్థాయిలో సరఫరా జరుగుతుందని సమాచారం.

కోర్టు హాల్లో ఇంతమంది ఎందుకు?

» ఇదే పునరావృతమైతే తలుపులు మూసుకుపోతాయి

» కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశాన్ని కోల్పోతారు

» వైసీపీ నేతలను ఉద్దేశించి న్యాయాధికారి వ్యాఖ్యలు

» 'మద్యం' నిందితులకు 17 వరకూ రిమాండ్ పొడిగింపు

» సిట్ ఎస్ఐపై చిందులు తొక్కిన రాజ్ కసిరెడ్డి

» బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన బాలాజీ గోవిందప్ప





కోర్టు హాలు వద్ద రాజ్ కసిరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి... విచారణకు హాజరవుతున్న బాలాజీ గోవిందప్ప

విజయవాడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపునకు ఇంతమంది అవసరమా అని సీబీఐ కోర్టు న్యాయాధికారి సీతారామకృష్ణారావు ప్రశ్నించారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే కోర్టు తలుపులు మూసుకుపోతాయని వైసీపీ నేతలు, నిందితుల న్యాయవాదులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మద్యం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఏడుగురు నిందితులకు ఈ నెల 17వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్ రెడ్డి, కసిరెడ్డి పీఏ పైలా దిలీప్, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, చాణక్యను పోలీసులు మంగళవారం కోర్టుకు తీసుకొచ్చారు. ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు సెలవులో ఉండటంతో సీబీఐ కోర్టుకు ఇన్‌చార్జి అప్పగించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగానే వారి కుటుంబు సభ్యులు, వైసీపీ నాయకులు కోర్టు హాలులోకి వచ్చారు. రిమాండ్ పొడిగింపునకు మెమో దాఖలు చేసేటప్పుడు దర్యాప్తు పురోగతిని అధికారులు కోర్టుకు తెలియజేయడం లేదని నిందితుల తరఫు న్యాయవాదులు ఇంకొల్లు వెంకటేశ్వరరావు మరికొంతమంది న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు. సిట్ అధికారులు ఒక కాపీని దాఖలు చేసి పొడిగింపు కోరుతున్నారని వివరించారు. దీంతో ప్రాసిక్యూషన్స్ ఏడీ రాజేంద్రప్రసాద్‌ను పిలిపించిన న్యాయాధికారి.. డిఫెన్స్ న్యాయవాదుల అభ్యంతరాన్ని ఆయనకు తెలియజేశారు. ఏసీబీ కోర్టు ఉత్తర్వులను పాటిస్తున్నామని, గతనెల 31 వరకు దర్యాప్తు పురోగతిని కోర్టుకు అందజేశామని ఆయన వివరించారు. న్యాయాధికారి ఆ రికార్డును తెప్పించుకొని పరిశీలించారు. 31న దర్యాప్తు ప్రగతిని కోర్టుకు అందజేశారని, మరో రిపోర్టు సీల్డ్ కవర్‌లో ఉందని స్పష్టం చేశారు. రిమాండ్ పొడిగింపునకు ఆదేశాలు ఇచ్చే క్రమంలో భోజనం చేసేవరకు సమయం ఇవ్వాలని నిందితులు కోరారు. పక్కనే ఉన్న కమర్షియల్ కోర్టు ఖాళీగా ఉందని, అక్కడ భోజనం చేస్తామని విజ్ఞప్తి చేయగా ఏడీ రాజేంద్రప్రసాద్ వ్యతిరేకించారు. ఈ చర్య దర్యాప్తు అధికారులకు లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతుందని, వారి ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని కోరారు. న్యాయాధికారి స్పందిస్తూ.. పక్క కోర్టు ఖాళీగా ఉంటే అక్కడ భోజనాలు పెట్టమని తాను చెప్పలేనని స్పష్టం చేశారు. ఈ సమయంలో న్యాయాధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. "సాఫీగా జరిగిపోయే రిమాండ్ పొడిగింపునకు కోర్టు హాలులో ఇంతమంది అవసరమా? కోర్టు తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయి. ఇటువంటి పరిస్థితి పునరావృతమైతే తలుపులు మూసుకుపోతాయి. హడావుడి చేస్తే మీకే ఇబ్బంది. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడుకునే అవకాశాన్ని కోల్పోతారు" అని వ్యాఖ్యానించారు. కాగా, మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బాలాజీ గోవిందప్ప సీబీఐ కోర్టులో మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

నోటికి పనిచెప్పిన రాజ్ కసిరెడ్డి

నిందితులను మూడో అంతస్తులో సీబీఐ కోర్టు వద్దకు ఎస్కార్ట్ సిబ్బంది తీసుకొచ్చారు. వారితో మాట్లాడటానికి కుటుంబ సభ్యులు, వైసీపీ నాయకులు భారీగా వచ్చారు. నిందితులందరినీ ఎస్కార్ట్ సిబ్బంది ఒకపక్కన కూర్చోబెట్టారు. రాజ్ కసిరెడ్డి మాత్రం అటూ ఇటూ తిరుగుతుండగా సిట్ ఎస్ఐ అమీద్ అడ్డుకున్నారు. దీంతో రాజ్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీ పేరేంటి?' అంటూ ఆయనతో గొడవకు దిగే విధంగా ప్రవర్తించడంతో పక్కనే ఉన్న సిబ్బంది సర్దిచెప్పి కూర్చోబెట్టారు. లిఫ్టులో నుంచి కోర్టు వద్దకు తీసుకొస్తున్న సమయంలోనూ వైసీపీ న్యాయ విభాగానికి చెందిన ఓ న్యాయవాది వారి వద్దకు వస్తుండగా సిట్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఆయన ఆగ్రహంతో ఊగిపోతూ, అసభ్య పదజాలంతో వారిని దూషించారు. దీనిపై న్యాయాధికారికి ఫిర్యాదు చేయాలని సిట్ అధికారులు యోచిస్తున్నారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

» హైకోర్టులో పిన్నెల్లి సోదరుల పిటిషన్.. టీడీపీ నేతల హత్య కేసు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు ఇద్దరూ టీడీపీకి చెందినవారేనని, ఆ పార్టీలో ఆధిపత్య పోరు కారణంగా హత్య జరిగిందని పిటిషన్‌లో వెల్లడించారు. హత్య అనంతరం జిల్లా ఎస్పీ విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నారని తెలిపారు. హత్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని, స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో తమను నిందితులుగా చేర్చారని ఆరోపించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

మధ్యంతర బెయిలివ్వండి

» హైకోర్టులో వంశీ అనుబంధ పిటిషన్



అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత వైద్యులు సూచించిన ఆస్పత్రిలో వైద్యం పొందడానికి వీలుగా తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత వల్లభనేని వంశీ హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేశారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, తనకు విజయవాడ ఆయుష్ ఆస్పత్రిలో చికిత్స అందించాలని, జూన్ 5న వైద్యపరీక్షల నివేదిక అందజేయాలని ఆదేశించిందని తెలిపారు. ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే ఆస్పత్రి వర్గాలపై పోలీసులు ఒత్తిడి తెచ్చి తనను డిశ్చార్జ్ చేసేలా చేశారని ఆరోపించారు. 110 రోజులుగా జైల్లో ఉన్న తన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని వంశీ కోరారు. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం పరిధిలో నకిలీ ఇళ్లపట్టాల జారీకి సంబంధించి హనుమాన్ జంక్షన్ పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ ఇచ్చేందుకు నూజివీడు కోర్టు నిరాకరించడంతో వంశీ హైకోర్టును ఆశ్రయించారు.



గో బ్యాక్ జగన్

- తెనాలిలో దళిత సంఘాల నిరసనలు

తెనాలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి పర్యటనలో వైసీపీ అధినేత జగన్‌కు దళిత సంఘాల నుంచి తీవ్రమైన నిరసనల సెగ తగిలింది. 'దళితులను పొట్టనబెట్టుకున్న రౌడీ షీటర్లకు అండగా నిలుస్తావా? సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నావ్?' అంటూ ప్రజాసంఘాలు మండిపడ్డాయి. 'గో బ్యాక్ జగన్..' అంటూ పెద్దగా నినదిస్తూ నిరసన తెలిపాయి. తెనాలిలోని ఐతానగర్ సెంటర్‌కు వెళ్లే మార్గంలోనే ఎస్సీ సెల్ నాయకులు, ఇతర ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు నల్ల బెలూన్‌లు పట్టుకుని, నల్ల కండువాలు, చొక్కాలు ధరించి జగన్ తీరును నిరసించారు. ప్లకార్డులు చూపుతూ, బెలూన్‌లు ఎగరువేస్తూ జగన్ కాన్వాయ్‌కు అడ్డుగా దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు రంగంలోకి దిగి వారిని అడ్డుకుని, చెదరగొట్టారు. తెనాలి మార్కెట్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉన్నం ధర్మారావు, దళిత సంఘాల నాయకుడు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తెనాలి వదిలి జగన్ వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. రౌడీషీటర్లకు మద్దతుగా ఎలా వస్తారంటూ ఆగ్రహించారు.


తెనాలిలో జగన్ పర్యటనలో పోలీస్ వాహనంపై ఎక్కి డ్యాన్స్ చేస్తున్న వైసీపీ కార్యకర్త

అన్నీ అబద్ధాలే!


జగన్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన దళిత సంఘాల కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

వేమా నవీన్‌పై చాలా సంవత్సరాలుగా రౌడీషీట్ ఉంది. ఇతణ్ణి 'కిల్లర్' అని పిలుస్తారు. వీరందరిపైనా ఆరు నుంచి పది వరకు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తెనాలిలోని ఐతానగర్ అడ్డాగా దళితులు, ఇతర వర్గాలపై హంతక దాడులు, దౌర్జన్యాలు, ఎత్తుకెళ్లి చిత్రహింసలు, గంజాయి, దారిదోపిడీలు చేసిన భయంకర నేరచరిత్ర ఉన్న రౌడీషీటర్లు వీళ్లు. తెనాలిలోని అన్ని వర్గాలూ వీరి బాధితులే. ఎస్సీలు, మైనారిటీలు అతి ఎక్కువగా దాడులకు గురయ్యారు. అందువల్లే జగన్ తెనాలి పర్యాటనను అడ్డుకుంటూ ప్రధానంగా ఈ వర్గాలే నిరసనల్లో పాల్గొన్నాయి. అలాంటి వారి పరామర్శకు పనిగట్టుకుని జగన్ తెనాలికి వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రౌడీషీటర్ల నేర చరిత్ర, కేసుల వివరాలివీ.. చేబ్రోలు జాన్ విక్టర్‌పై 2023 జూలై 9న సస్పెక్టడ్ షీట్ తెరిచారు. ఆయన నేర చరిత్ర 2017లోనే మొదలైంది. జగన్ పాలించిన 2019-2024 మధ్యకాలంలో మరింతగా రెచ్చిపోయాడు. అప్పట్లో అతనిపై 4కేసులు నమోదయ్యాయి. గత జనవరిలో సస్పెక్టడ్ షీట్‌ను రౌడీషీట్‌గా మార్చారు. విక్టర్‌పై 10 కేసులు ఉన్నాయి. మరో రౌడీషీటర్ దోమా రాకేశ్‌పై 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయంలో 5 కేసులు నమోదయ్యాయి. రాకేశ్‌పై 9 కేసులున్నాయి. హత్యాయత్నం, దారిదోపిడీలు, దొంగతనాలు తదితర కేసుల్లో నిందితుడు. మరో రౌడీషీటర్ వేమా నవీన్ అలియాస్ కిల్లర్‌పై జగన్ హయాంలోనే 6 కేసులు నమోదయ్యాయి. ఇలాంటివారిని ఉద్దేశించి 'అమాయకులు' అని జగన్ మద్దతుగా మాట్లాడటం వైసీపీ వర్గాలనే విస్మయానికి గురిచేస్తోంది.

జగన్ మార్క్ కహానీ..

దోమా రాకేశ్, జాన్ విక్టర్, కరీముల్లా ఐతానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కానిస్టేబుల్ చిరంజీవి సివిల్ డ్రెస్‌లో ఎవరితోనో గొడవ పడటం చూసి అడ్డుకోగా, వారి ఫోన్లు, బండి తాళాలు కానిస్టేబుల్ తీసుకున్నారని జగన్ సెలవిచ్చారు. కానీ, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, ఆ ముగ్గురే ఇంటికి వెళుతున్న కానిస్టేబుల్ చిరంజీవిని చుట్టుముట్టి కొట్టారు. సివిల్ డ్రస్సులో కానిస్టేబుల్ ఉండటంతో గుర్తించలేదని తప్పించుకోడానికి వీలు కూడా లేదు. ఎందుకంటే ముద్దాయిల్లో ఒకడైన రాకేశ్, కానిస్టేబుల్ ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. ఈ ఘటన తర్వాత ఏప్రిల్ 25న పోలీసులు మంగళగిరి వెళ్లి విక్టర్‌ను, కరీముల్లాను కొట్టుకుంటూ తీసుకొచ్చారని జగన్ చెప్పింది కూడా అబద్ధమే. ఈ కేసులో నిందితులను తెనాలిలోని రామలింగేశ్వరరావు పేట సెంటర్లలో అదే నెల 27న అరెస్ట్ చేసినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఆదేరోజు వారిని కోర్టులో హాజరుపరిచి రేపల్లె జైలుకు తరలించారు. వాస్తవం ఇది కాగా, మూడు రోజులు పోలీస్‌స్టేషన్లో, పోలీసుల అదుపులో వారిని ఉంచుకున్నరనీ, విక్టర్ జేబులో పోలీసులే కత్తి పెట్టి మధ్యవర్తుల సమక్షంలో పంచనామా రాశారని జగన్ సెలవిచ్చారు. వాళ్ల శరీరంపై దెబ్బలు ఉన్నాయనేదీ తప్పుడు కథనమే. కోర్టులో ప్రవేశపెట్టడానికి ముందుగా ముగ్గురినీ పరీక్షించిన వైద్యులు వారి ఒంటిపై ఎలాంటి దెబ్బలు లేవని సర్టిఫికెట్ ఇచ్చారు.

ఐతానగర్ అడ్డాగా ఆగడాలు....

తెనాలిలోని ఐతానగర్ అడ్డాగా రౌడీషీటర్లు చెలరేగిపోతున్నారు. ఒకవైపు గంజాయి దందా! మరోవైపు హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, మహిళలపై వేధింపులు! ఇలా ఐదేళ్లుగా వీళ్ల ఆగడాలు శ్రుతిమించాయని స్థానికులు వాపోతున్నారు. వీరి బాధ పడలేక అక్కడ అద్దెకు ఉంటున్న వారిలో చాలామంది వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. తమపై గంజాయి, మద్యం మత్తులో అల్లరిమూకలు ఎక్కడ దాడిచేస్తారో అనే భయంతో ప్రజలు వణికిపోతున్నారు. రాత్రిసమయాల్లో రోడ్లపై బైకులపై విచ్చలవిడిగా తిరుగుతూ, ఎదురు తిరిగిన వారిపై దాడులు చేస్తున్నారు. ఈక్రమంలోనే తమ ఆగడాలను ప్రశ్నించిన కానిస్టేబుల్ చిరంజీవిపై రాకేశ్, విక్టర్, నవీన్, కరీముల్లా దాడి చేశారు. తోమటి ప్రశాంత్ అనే రౌడీ షీటర్ మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. బాధితురాలికి అండగా నిలిచాడని ఆమె సొంత మామను హత్యచేశాడు. వివాహేతర సంబంధం ఉన్నదనే అనుమానంతో మాదిగ వర్గానికి చెందిన ఒక వ్యక్తిని సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డా అనే రౌడీషీటర్ అత్యంత పాశవికంగా మృతదేహాన్ని ముక్కలుగా నరికి, ఆ ముక్కలను గోనెసంచిలో మూటకట్టి కాలువలో పడేశాడు. తెనాలి పట్టణంలో రౌడీషీటర్‌లు వీరయ్యపై 12, సురేంద్రపై 3 కేసులు ఉన్నాయి. ఆయా రౌడీషీటర్ల అనుచరులుగా ఉంటూ వారి నీడలో పెరిగిన లడ్డా గ్యాంగ్ ఇప్పుడు సామాన్యులపై దాడులకు తెగబడుతోంది. ఈ నేపథ్యంలో జగన్ రౌడీమూకలకు వత్తాసు పలుకుతూ పోలీసులను, ప్రజలను తప్పుపట్టడం ఎంతవరకు సమంజసమనే వాదన వినిపిస్తోంది. కాగా, జగన్ తెనాలి పర్యటనలో వైసీపీ మూకలు వీరంగం సృష్టించాయి. ఆయన కాన్వాయ్‌లో ఉన్న ఏఆర్ పోలీస్ వాహనంపైకెక్కి ఓ యువకుడు ఊగిపోతూ చిందులు తొక్కాడు. శివాలెత్తినట్టు మత్తులో తూగుతూ హల్‌చల్ రేపారు. వైసీపీ ర్యాలీలో యువకులు బైక్‌లకు సైలెన్సర్‌లు తీసేసి భారీ శబ్దాలతో హడలెత్తించారు. రాకేశ్ నివాసం దగ్గరకు జగన్ వెళ్లినప్పుడు, అది చిన్న సందు కావటంతో తోపులాట జరిగింది. బయట నిలబడిన మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజినీ, అంబటి రాంబాబు, వైసీపీ నేత అప్పిరెడ్డిపైకి జనం తోసుకుంటూ వచ్చేశారు. అప్పిరెడ్డి పక్కకు దూకేయగా, నాని, రజిని కిందపడిపోయినంత పనయింది. అయితే వారిపై స్థానికులు దాడి చేశారంటూ సోషల్ మీడియాతో వదంతులు వైరల్ అయ్యాయి.


రౌడీషీటర్ల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జగన్

వారంతా అమాయకులు

కానిస్టేబులే వారిపై దౌర్జన్యం చేశారు

- రౌడీషీటర్లకు మద్దతుగా తెనాలిలో జగన్ వ్యాఖ్యలు

తెనాలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పోలీసుల దాడిలో గాయపడిన రౌడీషీటర్ల కుటుంబాలను వైసీపీ అధినేత జగన్ మంగళవారం తెనాలిలో పరామర్శించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, కానిస్టేబుల్‌పై దాడిచేసిన కేసులో ముద్దాయిలు దోమా రాకేశ్, జాన్ విక్టర్, నవీన్, కరీముల్లాకు మద్దతుగా ఆయన మాట్లాడారు. వీరిని ఉద్దేశించి 'అమాయకులు' అంటూ సమర్థించారు. 'పోలీసులు ఇంత దారుణంగా కొడతారా?' అంటూ ఆక్రోశించారు. వారిపై పాత కేసులున్నాయేమో.. తనకు తెలియదని సెలవిచ్చారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందంటూ షరా మామూలుగానే రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబుపై అవాకులుచవాకులు మాట్లాడారు. తనకు నచ్చని మీడియాపై అక్కసు వెళ్లగక్కారు. జగన్ హయాంలో కొందరు ఐపీఎస్‌లు వైపీఎస్‌లుగా వ్యవహరించి, ఇప్పుడు కటకటాలు లెక్కిస్తున్నారు. అలాంటిది పోలీసు వ్యవస్థకు జగన్ సుద్దులు చెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు అదుపుతప్పి పోయారనీ... ఆ వ్యవస్థ దిగజారిపోయిందన్నారు. ఈ పర్యటనలో ఆయన రౌడీషీటర్లు రాకేశ్, జాన్ విక్టర్‌తో పాటు నిందితుడు కరీముల్లాలను కలుస్తారని జగన్ మీడియా మొదట ఊదరగొట్టింది. కానిస్టేబుల్‌పై దాడి కేసులో అరెస్టు అయిన వీరంతా మూడురోజుల క్రితమే బయటకు వచ్చారు. అయినా, వారిని కాకుండా, ఆ ముగ్గురి కుటుంబసభ్యులను మాత్రమే పరామర్శించి జగన్ వెనుదిరగడం గమనార్హం. పర్యటనలో భాగంగా ఆయన దోమా రాకేశ్ ఇంటికి వెళ్లారు. మిగతా ముగ్గురి కుటుంబాలను అక్కడికే పిలిపించుకుని మీడియా సమక్షంలో పరామర్శించారు. మీడియాతో అరగంటకుపైగా మాట్లాడిన జగన్.. ఎక్కువ సమయం రౌడీషీటర్‌లకు సంబంధించి, కాగితాలపై రాసుకొచ్చిన కథ చెప్పేందుకే ప్రాధాన్యం ఇచ్చారు. నిన్నటి వరకు స్థానిక వైసీపీ నేతలు, జగన్ రోత మీడియా చేసిన ప్రచారానికి భిన్నంగా కొత్త కథ వినిపించారు. గంజాయి కేసులో ముద్దాయిలుగా ఉన్న ఆ యువకులను లంచం అడిగేందుకు కానిస్టేబుల్ వెళ్లారని, లంచం ఇవ్వలేదని దౌర్జన్యం చేశారని, దానికి సంబంధించిన ఆధారాలన్నీ తమ దగ్గర ఉన్నాయని, వాటిని బయటపెడతామని నిన్నటి వరకు వైసీపీ మీడియా చెబుతూ వచ్చింది. అయితే.. జగన్ మాత్రం వారందరినీ 'అమాయకులు'గా తేల్చేశారు. "హైదరాబాద్, మంగళగిరిలో ఉండే చిన్ననాటి మిత్రులంతా తెనాలిలో కలుసుకుని, మాట్లాడుకుంటుండగా మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్ ఎవరితోనో గొడవ పడటం చూశారు. గొడవను ఆపడానికి ప్రయత్నించిన యువకులపై కానిస్టేబుల్ దౌర్జన్యం చేశారు. ఆయన కానిస్టేబుల్ అని కూడా వారికి అప్పుడు తెలియదు.. వారి బండి తాళాలు ఆయనే లాక్కున్నారు." అని జగన్ వివరించారు. కేసులు ఎవరిపైనైనా ఉంటాయనీ, అందుకని నడిరోడ్డుపై కొడతారా అంటూ ప్రశ్నించారు. 24 కేసులున్నాయని చెప్పి చంద్రబాబును రోడ్డుపైకి తీసుకొచ్చి తన్నటం న్యాయంగా ఉంటుందా అంటూ పొంతన లేకుండా మాట్లాడారు. వారిలో విక్టర్ జూనియర్ అడ్వకేట్ అని, రాకేశ్ చెల్లి ఇంజనీర్ అని, ఆయన పాలిటెక్నిక్ చదువుకున్నారంటూ నల్లకోటు ఫొటోలు, పోలీసుల దాడిలో దెబ్బలు తగిలినట్టు అరికాళ్లకు బొబ్బలెక్కాయంటూ మరికొన్ని చిత్రాలు, రాకేశ్ కాళ్లలో రాడ్‌లు ఉన్నాయంటూ ఎక్స్‌రేను పదేపదే చూపిస్తూ మాట్లాడారు.

ప్రజలపై ప్రతీకారంగానే వైసీపీ వెన్నుపోటు దినం

- సంఘ విద్రోహ శక్తులకు పరామర్శా..!: రఘురామరాజు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'ప్రజలు వైసీపీకి వెన్నుపోటు పొడిచారని జగన్ భావిస్తున్నారు. అందుకు ప్రతీకారంగానే ఆయన వెన్నుపోటు దినం చేస్తున్నారు' అని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించారు. మంగళవారం అమరావతి అసెంబ్లీలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎవరినీ వెన్నుపోటు పొడవలేదని స్పష్టం చేశారు. 'నేను ఇంత సంక్షేమం చేసినా ఎందుకు నాకు వెన్నుపోటు పొడిచి, సంక్షోభంలోకి నెట్టారు?' అన్న ఉద్దేశంతో జగన్ వెన్నుపోటు దినం చేసుకుంటే తప్పు లేదు. రాజకీయాల్లో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవు అన్నట్లు.. ఈ రోజు జగన్ ఆత్మహత్య దినం జరుపుకున్నారు. రేపు వెన్నుపోటు దినం చేసుకుంటారు. సంఘ విద్రోహ శక్తులతో, 'భయపడకు... నీకు నేనున్నాను' అని జగన్ అనడం దురదృష్టం. జగన్‌ను చూసి జాలి పడటం కన్నా చేయగలిగిందేమీ లేదు' అని రఘురామ తెలిపారు.

గంజాయి, డ్రగ్స్ వ్యాపారుల గౌరవాధ్యక్షుడు జగన్: నక్కా



గంజాయి అమ్మడం, ఆడపిల్లలను వేధించడం నేరం కాదన్నట్లుగా జగన్ మాటలు ఉన్నాయని టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని ప్రజలంటే జగన్‌కు రోజురోజుకీ కోపం పెరిగిపోతోంది. సీఎంగా చేసిన వ్యక్తి రౌడీషీటర్లకు, చైన్ స్నాచర్లకు, బ్లేడ్ బ్యాచ్‌లకు, గంజాయి వ్యాపారులకు మద్దతు ఇవ్వడం ఏమిటి? ఇలాంటి వ్యక్తి చేతుల్లో రాష్ట్రాన్ని పెడితే ఎంతటి ప్రమాదకరమో ప్రజలు గ్రహించాలి. గంజాయి, డ్రగ్స్ వ్యాపారులు, బ్లేడ్ బ్యాచులకు జగన్‌ను గౌరవ అధ్యక్షుడిగా నియమిస్తే సరిపోతుంది' అని ఆనంద్‌బాబు ఎద్దేవా చేశారు.

అరాచకాలను ప్రోత్సహిస్తున్న జగన్: సవిత



రౌడీషీటర్లకు, గంజాయి బ్యాచ్‌లకు పరామర్శలతో రాష్ట్రంలో అరాచకాలను జగన్‌రెడ్డి ప్రోత్సాహిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. 'ఐదేళ్ల పాలనలో దళితులను పట్టించుకోని జగన్.. ఉనికి కోసమే కుల, శవ రాజకీయాలు చేస్తున్నారు. జగన్ నైతికంగా పతనమైన నాయకుడు. ఆయన దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. సీఎం చంద్రబాబుపై నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం చెప్తాం' అని మంత్రి సవిత హెచ్చరించారు.

వెన్నుపోట్లు, గొడ్డలి వేట్లు జగన్‌కే చెల్లు: ఆర్.శ్రీనివాసులరెడ్డి



వెన్నుపోట్లు, గొడ్డలి వేట్లు జగన్‌కే చెల్లు అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ 4తో ఏడాది పూర్తవుతుంది. అదే రోజు జగన్ వెన్నుపోటు దినమంటూ కొత్త డ్రామాకు తెరలేపారు. ఎవరు ఎవర్ని వెన్నుపోటు పొడిచారో జగన్ వివరించాలి. వెన్నుపోట్లుకు పేటెంట్ రైట్లన్నీ వైఎస్ కుటుంబం వద్దే ఉన్నాయి. గొడ్డలి వేట్లుకు జగన్ మారుపేరుగా నిలిచారు. వెన్నుపోట్లు.. గొడ్డలివేట్లు జగన్ తాత, నాన్న కాలం నుంచే ప్రారంభమయ్యాయి' అని ఆయన పేర్కొన్నారు.

జగన్ హయాంలో ఆర్థిక అరాచకం: నీలాయపాలెం



'జగన్ హయాంలో భారీ స్థాయిలో ఆర్థిక అవినీతి జరిగింది. అలాంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వ ఆర్థిక పరిపాలన గురించి మాట్లాడే అర్హత లేదు' అని ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. 'జగన్ హయాంలో జరిగినంత ఆర్థిక ఆరాచక పాలన ప్రపంచంలో ఎక్కడా జరిగి ఉండదు. వైసీపీ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసి, వాటిని ఉత్పాదక వ్యయాలకు కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించింది. దీంతో రాష్ట్రం తీవ్రంగా వెనుకబడిపోయింది. అలాంటి వారు ఇప్పుడు ఆర్థిక ప్రమాణాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది' అని నీలాయపాలెం విమర్శించారు.


అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధతపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు డోలా, లోకేశ్, కందుల దుర్గేశ్, సత్యకుమార్ యాదవ్, అనిత

'యోగాంధ్ర'కు అఖండ స్పందన

ముఖ్యమంత్రి సంతృప్తి

- 21న విశాఖలో ప్రధాని హాజరయ్యే యోగా డేలో 5 లక్షల మంది పాల్గొనాలి
- గిన్నిస్ రికార్డు సృష్టే లక్ష్యం: చంద్రబాబు

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రకు ప్రజల నుంచి అఖండ స్పందన వస్తోందంటూ సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ జిల్లాల్లో చేపట్టిన కార్యక్రమాలు, సన్నాహక ఏర్పాట్లు, రిజిస్ట్రేషన్లు, ప్రజల భాగస్వామ్యం ఆకట్టుకున్నాయని తెలిపారు. అత్యధిక భాగస్వామ్యంతో అతిపెద్ద యోగా సెషన్ నిర్వహించి గిన్నిస్ రికార్డు సృష్టించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో యోగాంధ్రపై ఆయన సమీక్ష జరిపారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 21న విశాఖలో జరిగే కార్యక్రమంలో 5లక్షల మంది పాల్గొనేలా కచ్చితమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ వస్తున్నారని గుర్తుచేశారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ ఆంక్షలు ఉండాలని.. వివిధ ప్రాంతాల నుంచివచ్చే ప్రజలకు వేదిక వద్ద, బయటకు వెళ్లే మార్గాలపై స్పష్టత ఉండాలని సూచించారు. 7న ప్రతి గ్రామంలో, ప్రాంతంలో యోగా అవగాహన ర్యాలీలు జరుగుతాయని, 14న విద్యా సంస్థలు, అందుబాటులో ఉన్న బహిరంగ ప్రదేశాలు సహా లక్ష ప్రదేశాల్లో యోగా సాధన సెషన్లు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలను మానసికంగా, శారీరకంగా సిద్ధం చేయడంతో పాటు యోగా దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలని సీఎం సూచించారు.


చిత్తూరు జిల్లా పులిగుండులో యోగాంధ్ర కార్యక్రమం

ఆ రోజు వర్షం పడితే..!

21న విశాఖలో వర్షం పడితే బ్యాకప్ వేదికలుగా జర్మన్ హ్యాంగర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రులు లోకేశ్, కందుల దుర్గేశ్, అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్, అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి గ్రామం నుంచి అంచనాలకు మించి రిజిస్ట్రేషన్లు వస్తున్నాయని, సంఖ్యలు అంచనాలకు మించి ఉన్నాయని స్పెషల్ సీఎస్, నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. రాష్ట్రం మొత్తం 2కోట్ల మంది పాల్గొంటారని, ఇందులో 1.77కోట్ల మంది రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వివరించారు. 1.25 లక్షల మంది యోగా అభ్యాసకులకు శిక్షణ ఇవ్వాలని టార్గెట్ పెట్టుకోగా.. 1.48 లక్షల మంది ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు.

'పులిగుండు'లో యోగాపై మోదీ ప్రశంసలు

- మీ రాక కోసం ఏపీ ఎదురుచూస్తోంది: సీఎం

న్యూఢిల్లీ/అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగాను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రజలు చేస్తున్న కృషిని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. చిత్తూరు జిల్లాలోని పులిగుండ ట్విన్ హిల్స్ వద్ద నిర్వహించిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భారీ ఎత్తున ప్రజలు పాల్గొనడాన్ని ఆయన 'ఎక్స్' వేదికగా అభినందించారు. ఈ నెల 21న రాష్ట్రంలో నిర్వహించనున్న యోగా దినోత్సవంలో పాల్గొనడానికి ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. మోదీ ట్వీట్‌పై సీఎం చంద్రబాబు స్పందించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రయత్నాలపై మీ స్పందనకు ధన్యవాదాలు. జూన్ 21న మీ రాక కోసం ఏపీ ఎదురుచూస్తోంది. మీ రాక యోగాను ఎక్కువమంది జీవన విధానంగా స్వీకరించేలా ప్రోత్సహిస్తుందని భావిస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

రేవులు రాష్ట్ర సంపద

(మొదటి పేజీ తరువాయి)

నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల తొలి దశ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు మన రాష్ట్ర సంపదని వ్యాఖ్యానించారు. విమానాశ్రయాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి యువరాజ్, పోర్టుల అభివృద్ధి సంస్థ ఎండీ ప్రవీణ్ ఆదిత్య తదితరులతో పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా.. ఆయా ప్రాంతాలకు మరింత ఆదాయం సమకూరేలా ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అభివృద్ధి చేయడంపై అధ్యయనం చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించదలపెట్టిన కుప్పం, దగదర్తి, అమరావతి, శ్రీకాకుళం(పలాస) ఎయిర్‌పోర్టుల నిర్మాణాన్ని ముందుగా చేపట్టాలన్నారు. రాష్ట్రంలో రేవులు, ఫిషింగ్ హార్బర్లు కలిపి 20కి తగ్గకుండా.. అలాగే 14 విమానాశ్రయాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రహదారుల అభివృద్ధి, విస్తరణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర రహదారులన్నింటిని జాతీయ రహదారులతో అనుసంధానం చేయాలన్నారు. రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి లక్ష్యంగా త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మౌలిక సదుపాయాల కల్పనా శాఖ కార్యదర్శి యువరాజ్‌ను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చెందేలా హెలీ పోర్టుల ఏర్పాటునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.

2026 నవంబరుకల్లా మచిలీపట్నం పోర్టు తొలి దశ..

మచిలీపట్నం పోర్టు మొదటి దశ పనులు 43.25 శాతం పూర్తయ్యాయని, వచ్చే ఏడాది నవంబరునాటికి పనులన్నీ పూర్తవుతాయని అధికారులు సీఎంకు తెలిపారు. రామయపట్నం పోర్టు మొదటి దశ పనులు 46.89 శాతం, మూలపేట పోర్టు మొదటి దశ పనులు 46.59 శాతం, కాకినాడ గేట్‌వే పోర్టు పనులు 29.92 శాతం పూర్తయినట్లు వివరించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు 97.72 శాతం, నిజాంపట్నం తొలిదశ పనులు 81.17 శాతం, మచిలీపట్నం మొదటి దశ పనులు 69.20 శాతం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 78.94 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించారు.


ఏపీ అసెంబ్లీ పిటిషన్ల కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, విష్ణుకుమార్‌రాజు, కొణతల

బియ్యం వద్దనుకుంటే కార్డు వెనక్కి ఇవ్వండి

ఆరోగ్య శ్రీ కార్డు విడిగా ఇస్తే బియ్యం అక్రమ రవాణాను అరికట్టొచ్చు

- ప్రభుత్వానికి అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ప్రతిపాదన
- డిప్యూటీ స్పీకర్ రఘురామ వెల్లడి

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'రేషన్ కార్డుకు, ఆరోగ్య శ్రీకి ఎలాంటి సంబంధం ఉండకూడదు. అలా చేస్తే రేషన్ బియ్యం అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టవచ్చు' అని డిప్యూటీ స్పీకర్ కే రఘురామకృష్ణరాజు అభిప్రాయపడ్డారు. బియ్యం అవసరం లేని వారు రేషన్ కార్డులను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇచ్చేయాలని సూచించారు. మంగళవారం అమరావతి శాసనసభ హాలులో ప్రజా ఫిర్యాదుల కమిటీ సమావేశం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అధ్యక్షతన జరిగింది. ఆరోగ్యశ్రీ అవసరాల కోసం రేషన్ కార్డు తీసుకుని, బియ్యం అమ్ముకుంటున్నారన్న ఫిర్యాదుపై కమిటీ కూలంకషంగా చర్చించింది. అనంతరం ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజుతో కలసి రఘురామ మీడియాతో మాట్లాడారు. 'రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీకి సంబంధం ఉండటంతో చాలా మంది కార్డు తీసుకుని, బియ్యం అమ్ముకుంటున్నారు. రెంటినీ విడగొడితే ఈ ఇబ్బంది ఉండదని అధికారులు చెప్పారు. ఇదే విషయాన్ని కమిటీ చర్చించింది. స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతాం. రాష్ట్రంలో 1.70 కోట్ల కుటుంబాలు ఉంటే 1.48 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. రేషన్‌పై కేంద్రం ఇచ్చేది పోగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,100 కోట్లు ఖర్చు పెడుతోంది. బియ్యం తినని వాళ్ల రేషన్ కార్డులు వెనక్కిస్తే సుమారుగా రూ.2 వేల కోట్లు భారం తగ్గుతుంది. ఆ సొమ్మును విద్యాశాఖపై ఖర్చు పెడితే ఇంకాస్త మెరుగైన విద్యా సౌకర్యాలు లభిస్తాయి. ప్రతి కుటుంబానికి ఆరోగ్య శ్రీ కార్డు, రేషన్ కార్డు, పెన్షన్ కార్డు... దేనికది వేర్వేరుగా ఉంటే బాగుంటుందని కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతుంది. హెల్త్ కార్డుకు పెద్దగా నిబంధనలు లేకుండా ఇవ్వాలని ప్రభుత్వానికి సూచిస్తాం. రేషన్ బియ్యం అవసరం లేని వారికి నగదు చెల్లింపులు జరపడం సరికాదు. రైతుకు మద్దతు ధర లభించడం కోసమే ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఎఫ్‌సీఐ దగ్గర రెండేళ్లకు సరిపడా బియ్యం నిల్వ ఉన్నా, రైతుకు న్యాయం చేయడం కోసమే బియ్యం కొని, కార్డుదారులకు పంపిణీ చేస్తున్నాం. ఇది రేషన్ కార్డుల్లో కోత కాదు. రేషన్ వాడుకోని వారు స్వచ్ఛందంగా వెనక్కి ఇస్తే మంచిది. రేషన్ షాపుల్లో మిల్లెట్స్, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను కూడా పెట్టొచ్చనే ప్రతిపాదనను ప్రభుత్వానికిస్తాం. కమిటీ సలహాను స్వీకరించాలా? లేదా? అన్నది ప్రభుత్వం ఇష్టం' అని రఘురామ చెప్పారు.

సీఎంను కలిసిన అక్కినేని నాగార్జున



అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును సినీ హీరో అక్కినేని నాగార్జున మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. తన చిన్న కొడుకు అక్కినేని అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను అందించారు. పెళ్లికి రావాల్సిందిగా ఆహ్వానించారు.

పోలీసు కానిస్టేబుల్ డ్రగ్స్ దందా!

- హైదరాబాద్ పోలీసుల అదుపులో తిరుపతి ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్
- వైసీపీ నేత సహా మరో ఐదుగురు అరెస్టు



గుణశేఖర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలో కీలక నిందితుడైన తిరుపతికి చెందిన రిజర్వు కానిస్టేబుల్ ఎం.గుణశేఖర్‌ను హైదరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో ఏ2గా ఉన్న తిరుపతి రూరల్ పేరూరు ప్రాంతానికి చెందిన వైసీపీ నేత ఉన్నం సురేంద్ర, మరో నలుగురిని కూడా అరెస్టు చేశారు. కాగా, గుణశేఖర్ 2007లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా చేరాడు. తర్వాత 2009లో రిజర్వు విభాగానికి బదిలీ చేసుకున్నాడు. తిరుపతి రిజర్వు యూనిట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆయన విధులకు తరచూ ఎగ్గొట్టడం.. ఏవో కారణాలు చెప్పి సెలవులు పెడుతుంటాడని అధికారులు చెబుతున్నారు. బ్యాక్ పెయిన్ ఉందని ఫిబ్రవరి 26 నుంచి మే 17 వరకు సిక్ లీవ్, బావమరిది పెళ్లి పేరుతో మే 31 నుంచి జూన్ 9 వరకు గుణశేఖర్ సెలవు పెట్టాడు. ఈ సమయంలోనే గుణశేఖర్ డ్రగ్ సరఫరా మాఫియాతో చేతులు కలిపినట్లు అధికారులు భావిస్తున్నారు. తిరుపతి వైసీపీ ఎంపీ గురుమూర్తి వద్ద గుణశేఖర్ 2022 జూన్ 13 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 25 వరకు గన్‌మ్యాన్‌గా చేశాడు. ఈ క్రమంలోనే సురేంద్రతో పరిచయం ఏర్పడినట్లు సమాచారం. వీరిద్దరూ తిరుపతిలో పలు స్మగ్లింగ్ కార్యకలాపాలు నడిపారన్న ఆరోపణలున్నాయి. తోటి కానిస్టేబుళ్ల వద్ద గుణశేఖర్ లక్షల రూపాయలు తీసుకుని ఎగ్గొట్టినట్లు తెలుస్తోంది. ప్లాట్ విక్రయిస్తామని గుణశేఖర్, ఆయన భార్య రేణుక గతేడాది మార్చిలో రూ.22 లక్షలు తీసుకున్నారని తిరుపతి రూరల్ పేరూరు ఎస్టీఆర్ కాలనీకి చెందిన తుంగ లక్ష్మి రెడ్డెమ్మ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయకపోగా, డబ్బులూ ఇవ్వకపోవడంతో సోమవారం ఆమె ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో వారిద్దరిపై మంగళవారం కేసు నమోదైంది.

రుతుపవనాల మందగమనం

- తిరిగి కొనసాగుతున్న వేసవి పరిస్థితులు
- ఈనెల పదో తేదీ తర్వాతే మళ్లీ పురోగతి
- రాష్ట్రంలో 4 రోజులుగా వేడి వాతావరణం

విశాఖపట్నం, అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే దేశంలోకి ప్రవేశించినప్పటికీ.. నాలుగు రోజుల నుంచి మందగించాయి. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో రుతుపవన కరెంట్(కదలిక) బలహీనంగా ఉండడంతో ఈశాన్య భారతం తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో తిరిగి వేసవి పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ముఖ్యంగా కోస్తాలో కొన్నిచోట్ల సెగలు కక్కే వాతావరణం కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీల వరకూ నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతకు వాతావరణ అనిశ్చితి నెలకొని సాయంత్రం పూట అక్కడక్కడ పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. వరుసగా మూడోరోజైన మంగళవారమూ జంగమహేశ్వరపురంలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజులు కోస్తాలో అనేకచోట్ల వేడి వాతావరణం నెలకొంటుందని, పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీలు, ఒకటిరెండుచోట్ల 40 డిగ్రీల వరకూ నమోదవుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు విస్తరించేటప్పుడు మధ్యలో కొద్దిరోజుల విరామం సాధారణమేనని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ చెప్పారు. ఈనెల 10 తర్వాతే బంగాళాఖాతంలో రుతుపవనాల కదలికకు అనువుగా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. 12 నుంచి రుతుపవనాల్లో మళ్లీ కదలిక రావచ్చునని వివరించారు. కాగా, బుధవారం కోస్తా జిల్లాల్లో ఉక్కపోతతోపాటు గరిష్ఠంగా 39-40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

'తుని' కేసు తిరగదోడం!

- రాష్ట్రప్రభుత్వం స్పష్టీకరణ

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తుని రైలు దహనం కేసులో నెలకొన్న గందరగోళానికి రాష్ట్రప్రభుత్వం తెరదించింది. రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసులో రైల్వే కోర్టు వెలువరించిన తీర్పుపై అప్పీలుకు వెళ్లే ఉద్దేశం లేదని, కేసును మళ్లీ తిరగదోడే ఆలోచనే లేదని తేల్చి చెప్పింది. రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) అధికారి ప్రతిపాదనతో అప్పీలుకు వెళ్లాలంటూ సోమవారం హోంశాఖ వెలువరించిన జీవో-852ను ఉపసంహరిస్తూ మంగళవారం మరో జీవో 869ని జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా వెలువడి గందరగోళానికి కారణమైన అప్పీలు జీవో ఫైలు ఎవరి ఆమోదంతో ముందుకు కదిలిందనే విషయమై ఆరా తీసి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించింది.

ఏం జరిగింది..?: రైల్వే ఆస్తులను సంరక్షించే ఆర్పీఎఫ్ విభాగం సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ తుని రైలు దహనం కేసులో కింది కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీలుకు ప్రతిపాదన పంపారు. పరిశీలించిన ప్రభుత్వ న్యాయవాది.. ఇతర ప్రతిపాదనల తరహాలోనే హోంశాఖకు పంపడంతో యాంత్రికంగా జీవో జారీ అయింది. సదరు బాధ్యులపై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాగా, ప్రస్తుత వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం తుని వద్ద 'కాపు గర్జన' పేరుతో 2016 జనవరి 31న భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభ ముగిసిన వెంటనే ఆయనతో పాటు వైసీపీ నేత దాడిశెట్టి రాజా యువతను రెచ్చగొట్టడంతో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలను తగులబెట్టారు. అప్పట్లో ఆర్పీఎఫ్ కేసు నమోదు చేసింది. కేసు విచారణ సందర్భంగా.. ఆర్పీఎఫ్ అధికారులు ఒక్క సాక్షిని కూడా కోర్టులో ప్రవేశపెట్టలేక పోయారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ధైర్యంగా సాక్ష్యం చెప్పడానికి ఎవరూ ముందుకు రాలేదు. దర్యాప్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైల్వే కోర్టు.. ముద్రగడ, దాడిశెట్టితో పాటు 41 మందిని నిర్దోషులుగా ప్రకటించింది.

రాష్ట్రంలో మరో నాలుగు కొవిడ్ కేసులు

కర్నూలు హాస్పిటల్/తిరుపతి(వైద్యం), జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు రోజుల వ్యవధిలో మూడు కరోనా కేసులు నమోదవడం కలకలం రేపింది. సోమవారం ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, మంగళవారం స్థానిక జీజీహెచ్‌లో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. వీరిలో జీజీహెచ్‌కు చెందిన ప్రొఫెసర్, మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన 25 ఏళ్ల మహిళ ఉన్నారు. వైద్యుడు హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా.. మహిళకు జీజీహెచ్‌లోని కొవిడ్ ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు.

10 నెలల చిన్నారికి కొవిడ్: తిరుపతి రుయాస్పత్రిలో పది నెలల చిన్నారికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన చిన్నారికి జ్వరం రాగా.. తల్లిదండ్రులు సోమవారం రుయాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డుకు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి, స్విమ్స్‌లో ఆర్టీపీసీఆర్ కొవిడ్ పరీక్ష చేయించగా.. పాజిటివ్‌గా తేలిందని ఆయన తెలిపారు. చిన్నారి శాంపిల్స్‌ను పూణెకు పంపి తీవ్రతను గుర్తిస్తామని చెప్పారు.

ప్రమాదాన్ని ఆపేందుకు వెళ్లి..

- గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని రోడ్డుపై ఆగిన లారీ
- వెనుక వాహనాలకు సిగ్నల్ ఇస్తూ రోడ్డుపైకొచ్చిన డ్రైవర్
- చీకటిలో వేగంగా వచ్చి ఢీకొట్టిన ఐషర్ వ్యాన్
- లారీ డ్రైవర్, ఐషర్ డ్రైవర్ ఇద్దరూ మృతి



ప్రమాదానికి గురై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ఐషర్ వాహనం

కొవ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒక డ్రైవర్ మంచి మనసు అతని ప్రాణాలే తీసింది. ఆయన నడుపుతున్న లారీకి ప్రమాదం జరిగి రోడ్డు పక్కన ఆగిపోయింది. చీకట్లో ఆ లారీని మరేదైనా వాహనం ఢీకొడితే మరింత ప్రమాదమని గుర్తించిన డ్రైవర్.. రోడ్డు పక్కన నిలబడి వాహనాలకు సిగ్నల్ ఇస్తున్నాడు. తెల్లవారుజాము కావడంతో అటుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఆ డ్రైవర్‌ను ఢీకొని వెళ్లి.. ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో డ్రైవర్లిద్దరూ ప్రాణాలు కోల్పోయాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం ఎక్స్‌ప్రెస్ హైవేపై మంగళవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం తల్లా వెళ్ళమల గ్రామానికి చెందిన లారీడ్రైవర్ బత్తుల శ్రీనయ్య (40) హైదరాబాద్ నుంచి ధాన్యం లోడ్‌తో మండపేట బయలుదేరాడు. కొవ్వూరు మండలం కాపవరం వచ్చేసరికి మంగళవారం తెల్లవారుజామున నిద్రమత్తులో ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆ లారీ కుడి పక్క డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. అయితే వెనుక వచ్చే వాహనాలు చీకట్లో కనిపించక లారీని ఢీకొట్టకుండా ఉండేందుకు శ్రీనయ్య తన లారీ వెనుక నిలబడి ట్రాఫిక్ డైరెక్షన్స్ ఇస్తున్నాడు. అదే సమయంలో జంగారెడ్డిగూడెం నుంచి ధాన్యం లోడ్‌తో వస్తున్న ఐషర్ వ్యాన్.. శ్రీనయ్యను ఢీకొట్టింది. ఆ వెంటనే లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ బత్తుల శ్రీనయ్య, కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన ఐషర్ డ్రైవర్ కొయ్యా బాబూరావు (40) కేబిన్‌లో చిక్కుకుని మృతి చెందారు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి 113 కోట్లు

అమరావతి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం జిల్లాలోని ముదసర్లోవ, మధురవాడ, నరావా ప్రాంతాల్లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి రూ.113.52 కోట్లు విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో అదనంగా ఈ నిధులు మంజూరు చేస్తూ మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.